www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 26-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 209 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: దశమి తె. 5.24 తదుపరి ఏకాదశి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 9.46 తదుపరి మఖ; వర్జ్యం: రా.11.05-12.51; దుర్ముహూర్తం: ఉ.6.15-7.46; అమృతఘడియలు: ఉ.8.01-9.46; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.15; సూర్యాస్తమయం: 5.42

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



స్పిన్ టెస్ట్‌లో మనోళ్లు ఫెయిల్

భారత్ తొలి ఇన్నింగ్స్ 156 ఆలౌట్ ● శాంట్నర్‌కు ఏడు వికెట్లు



పంత్ (18) క్లీన్‌బౌల్డ్

ప్చ్.. ఏం మారలేదు. బౌలింగ్‌లో అదరగొట్టారనే సంతోషాన్ని భారత బ్యాటర్లు ఆవిరి చేశారు. ఆడుతోంది స్వదేశంలోనా.. పరాయి గడ్డపైనా అన్నట్టు స్పిన్‌కు దాసోహమయ్యారు. అటు భారత పిచ్‌లపై ఎలా బౌలింగ్ చేయాలో పక్కా ప్రణాళికలతో బరిలోకి దిగిన కివీస్ గొప్ప విజయం దిశగా సాగుతోంది. స్టార్లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌ను స్పిన్నర్ శాంట్నర్ ఏడు వికెట్లతో వెన్ను విరవగా.. ఫిలిప్స్ రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత కివీస్ బ్యాటర్లు ఎప్పటిలాగే రాణించి భారీ లక్ష్యాన్ని నిర్దేశించే ప్రయత్నంలో పడ్డారు. దీంతో భారత్‌కు ఈ టెస్టులో కూడా ఓటమి ఖాయంగా కనిపిస్తోంది.

పుణె: స్వదేశంలో అడుగుపెట్టిన ప్రతీ జట్టును వేటాడటమే తప్ప.. ప్రత్యర్థి ఉచ్చులో టీమిండియా పడిందే లేదు. కానీ ఇప్పుడు పరిస్థితి రివర్స్‌లా కనిపిస్తోంది. రెండో టెస్టులోనూ పర్యాటక న్యూజిలాండ్ స్పష్టమైన ఆధిపత్యం చూపుతోంది. ఇప్పటికే తొలి టెస్టును దక్కించుకున్న ఈ జట్టు ఇప్పుడు ఏకంగా సిరీస్ కోసం ఉవ్విళ్లూరుతోంది. జరిగింది రెండు రోజుల ఆటే అయినా కివీస్ ప్రస్తుతానికి 301 పరుగుల ఆధిక్యంలో ఉండడం విశేషం. శుక్రవారం ఆట ముగిసేసరికి ఈ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 5 వికెట్లకు 198 పరుగులు చేసింది. క్రీజులో బ్లండెల్ (30), ఫిలిప్స్ (9) ఉన్నారు. కెప్టెన్ లాథమ్ (86) అర్ధసెంచరీ సాధించాడు. స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కు 4 వికెట్లు దక్కాయి. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 45.3 ఓవర్లలో 156 రన్స్‌కే కుప్పకూలింది. జడేజా (38), జైస్వాల్ (30), గిల్ (30) మాత్రమే రాణించారు. కెరీర్‌లో తొలిసారి శాంట్నర్ (7/53) ఐదు వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. మరో మూడ్రోజుల ఆట ఉండడంతో మ్యాచ్ ఫలితం రావడం ఖాయమే. శనివారం కివీస్ సాధ్యమైనంత వేగంగా ఆడి మరో 50-100 రన్స్ జత చేసే చాన్సుంది. అదే జరిగితే నాలుగో ఇన్నింగ్స్‌లో భారత్ కష్టసాధ్యమైన ఛేదనకు బరిలోకి దిగాల్సి ఉంటుంది.

ఇదేం బ్యాటింగ్..?: తొలిరోజు చివర్లోనే బ్యాటింగ్‌కు దిగిన రోహిత్‌సేనకు క్రీజులో కాస్త కుదురుకోవాలన్న ఆలోచనే లేకుండా పోయింది. టర్నింగ్ పిచ్‌పై ఆడడం తెలియదన్నట్టుగా మనోళ్లు పేలవ షాట్లతో పెవిలియన్ చేరారు. ఫలితంగా తొలి సెషన్‌లోనే జట్టు మరో 6వికెట్లు కోల్పోయింది. ఓవర్‌నైట్ స్కోరు 16/1తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత జట్టులో ఆరంభంలో జైస్వాల్, గిల్ కివీస్ బౌలర్లను ఓపిగ్గా ఎదుర్కొన్నారు. జైస్వాల్ భారీషాట్లకు ప్రయత్నించినా.. గిల్ సాధికారిక షాట్లతో పైచేయి సాధించాడు. వీలు కుదిరినప్పుడల్లా బౌండరీలతో ఒత్తిడి పెంచాడు. అయితే వికెట్ నుంచి సహకారం అందుకున్న శాంట్నర్ మొదట గిల్‌తో తన వేట మొదలుపెట్టాడు. అతను కచ్చితమైన లెంగ్త్‌తో వేసిన బంతి ప్యాడ్లను తాకడంతో గిల్ ఎల్బీగా వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 49 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఓవర్‌లోనే లో-ఫుల్ టాస్ బంతిని స్వీప్ ఆడబోయిన విరాట్ కోహ్లీ (1)ని సైతం శాంట్నర్ బౌల్డ్ చేశాడు. మరో ఎండ్‌లో స్పిన్నర్ ఫిలిప్స్ కూడా ప్రభావం చూపుతూ జైస్వాల్, రిషబ్ పంత్ (18)లను అవుట్ చేసి జట్టును మరింత ఒత్తిడిలోకి నెట్టాడు. ఆదుకుంటాడనుకున్న సర్ఫరాజ్ (11) తక్కువ స్కోరుకే అవుటవడంతో 95/6 స్కోరుతో జట్టు కష్టాల్లో పడింది. ఇక లంచ్ బ్రేక్ తర్వాత జట్టు 7.3 ఓవర్లు మాత్రమే ఆడి మిగతా వికెట్లను కోల్పోయింది. అయితే జడేజా భారీషాట్లతో ఆకట్టుకున్నాడు. కానీ శాంట్నర్ ఒకే ఓవర్‌లో జడ్డూతో పాటు ఆకాశ్‌దీప్ (6)ను అవుట్ చేశాడు. చివర్లో సుందర్ (18 నాటౌట్).. ఎజాజ్ ఓవర్‌లో 4,6,4తో కాస్త జోష్ తెచ్చాడు. కానీ, తర్వాతి ఓవర్‌లోనే బుమ్రాను శాంట్నర్ డకౌట్ చేయడంతో భారత్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.


కోహ్లీ (1)

రాణించిన లాథమ్: 103 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్ దాదాపు రెండు సెషన్లపాటు ఆత్మవిశ్వాసంతో ఆడింది. ఓవర్‌కు నాలుగు పరుగుల రన్‌రేట్‌తో భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. స్పిన్నర్ సుందర్ మాత్రం మరో నాలుగు వికెట్లతో దెబ్బతీసే ప్రయత్నం చేశాడు. ఈ సిరీస్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న కివీస్ కెప్టెన్ లాథమ్ ఈసారి సత్తా చాటాడు. భారత్ స్పిన్నర్లతోనే బౌలింగ్ మొదలెట్టినా.. ఓపెనర్లు ఎలాంటి ఇబ్బందిపడలేదు. లాథమ్ చక్కటి స్వీప్‌షాట్లతో ఆకట్టుకున్నాడు. మొత్తంగా రెండో సెషన్‌లో కాన్వే (17)ను సుందర్ అవుట్ చేయగా, విల్ యంగ్ (23)ను అశ్విన్ వెనక్కిపంపాడు. అలాగే చివరి సెషన్ ఆరంభంలోనే కీలక రచిన్ రవీంద్ర (9)ను సైతం సుందర్ అవుట్ చేసి భారత్‌కు ఊరటనిచ్చాడు. అయితే డారిల్ మిచెల్ (18), బ్లండెల్, కెప్టెన్ లాథమ్‌కు సహకారం అందించారు. దీంతో కివీస్ ఆధిక్యం మరింత పెరిగింది. శతకం వైపు సాగుతున్న లాథమ్ 45వ ఓవర్‌లో స్వీప్ షాట్‌కు వెళ్లి సుందర్‌కు చిక్కాడు. దీంతో ఐదో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.


శాంట్నర్ (7/53)

3 భారత్‌పై కివీస్ తరఫున మూడో ఉత్తమ బౌలింగ్ ప్రదర్శన (7/53) చేసిన శాంట్నర్. ఎజాజ్ (10/119), హ్యాడ్లీ (7/23) ముందున్నారు.

2 భారత గడ్డపై 300+ ఆధిక్యం సాధించడం కివీస్‌కిది రెండోసారి. 2010లో 327 పరుగుల లక్ష్యాన్ని విధించింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259;

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 30; రోహిత్ (బి) సౌథీ 0; గిల్ (ఎల్బీ) శాంట్నర్ 30; విరాట్ (బి) శాంట్నర్ 1; పంత్ (బి) ఫిలిప్స్ 18; సర్ఫరాజ్ (సి) ఓరోక్ (బి) శాంట్నర్ 11; జడేజా (ఎల్బీ) శాంట్నర్ 38; అశ్విన్ (ఎల్బీ) శాంట్నర్ 4; సుందర్ (నాటౌట్) 18; ఆకాశ్ (బి) శాంట్నర్ 6; బుమ్రా (ఎల్బీ) శాంట్నర్ 0; **ఎక్స్‌ట్రాలు: 0. మొత్తం: 45.3 ఓవర్లలో 156 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-1, 2-50, 3-56, 4-70, 5-83, 6-95, 7-103, 8-136, 9-142, 10-156. **బౌలింగ్:** సౌథీ 6-1-18-1; ఓరోక్ 3-2-5-0; ఎజాజ్ 11-1-54-0; శాంట్నర్ 19.3-1-53-7; ఫిలిప్స్ 6-0-26-2.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లండెల్ (బ్యాటింగ్) 30; ఫిలిప్స్ (బ్యాటింగ్) 9; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 53 ఓవర్లలో 198/5. వికెట్ల పతనం:** 1-36, 2-78, 3-89, 4-123, 5-183. **బౌలింగ్:** అశ్విన్ 17-1-64-1; సుందర్ 19-0-56-4; జడేజా 11-1-50-0; బుమ్రా 6-1-25-0.

టెస్ట్ జట్టులో నితీశ్ కుమార్



ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక
హర్షిత్ రాణాకు చోటు
షమి, అక్షర్‌లకు నిరాశ

న్యూఢిల్లీ: అదిరే బ్యాటింగ్‌తో టీమిండియా టీ20 జట్టులో తన స్థానానికి పూర్తిగా న్యాయం చేసిన తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిపై సెలెక్టర్లకు పూర్తిగా గురి కుదిరినట్టుంది. ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్‌కు శుక్రవారం ప్రకటించిన జట్టుకు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ నితీశ్‌ను ఎంపిక చేశారు. నితీశ్‌తోపాటు పేసర్ హర్షిత్ రాణాకు తొలిసారి టెస్ట్ జట్టులో చోటు కల్పించింది. 18 మంది సభ్యుల జట్టుకు రోహిత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. స్టార్ పేసర్ బుమ్రాను వైస్-కెప్టెన్‌గా నియమించింది. దేశవాళీ పోటీల్లో పరుగుల వరద పారిస్తున్న బెంగాల్ బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్‌కు మూడో ఓపెనర్‌గా స్థానం లభించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ నవంబరు 22న పెర్త్‌లో జరిగే తొలి టెస్ట్‌తో ప్రారంభం కానుంది.

షమికి దక్కని స్థానం: సీనియర్ పేసర్ మహ్మద్ షమికి జట్టులో చోటు దక్కలేదు. ఈ ఏడాది ఆరంభంలో పాదం గాయానికి ఆపరేషన్ చేయించుకున్న షమి..తాను ఫిట్‌గానే ఉన్నానని ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. పేసర్ ఆకాశ్‌దీప్ సింగ్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బుమ్రా, సిరాజ్‌తో కలిసి అతడు పేస్ బౌలింగ్ భారాన్ని మోయనున్నాడు. గాయం నుంచి కోలుకోవడంతో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ జట్టులో పునరాగమనం చేశాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ గజ్జల్లో గాయం కారణంగా ఎంపికకు అందుబాటులో లేడని బీసీసీఐ తెలిపింది. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లోనూ అద్భుతంగా రాణిస్తున్న స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌కూ చోటు దక్కింది. ఫలితంగా మరో స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌పై వేటు పడింది.

టీ20 జట్టులో రమణ్‌దీప్, వైశాఖ్

సౌతాఫ్రికాతో జరిగే నాలుగు టీ20లకూ టీమిండియాను ప్రకటించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ రమణ్‌దీప్ సింగ్, కర్ణాటక పేసర్ వైశాఖ్ విజయ్ కుమార్‌లకు తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. అలాగే గాయంతో యువ పేసర్ మయాంక్ యాదవ్‌నూ ఎంపిక చేయలేదు. 15మంది జట్టుకు సూర్యకుమార్ నాయకత్వం వహిస్తాడు. నవంబరు 8న డర్బన్‌తో మ్యాచ్‌తో సిరీస్ మొదలు కానుంది.

ఆసీస్ టూర్‌కు జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా (వైస్ కెప్టెన్), జైస్వాల్, ఈశ్వరన్, గిల్, కోహ్లీ, కేఎల్ రాహుల్, పంత్ (కీపర్), సర్ఫరాజ్, జురెల్ (కీపర్), అశ్విన్, జడేజా, సిరాజ్, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, సుందర్. **రిజర్వ్:** సైనీ, ముకేశ్ కుమార్, ఖలీల్ అహ్మద్.

సఫారీ టూర్‌కు టీ 20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శాంసన్ (కీపర్), రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ (కీపర్), హార్దిక్, అక్షర్, రమణ్‌దీప్, వరుణ్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, వైశాఖ్ విజయ్‌కుమార్, అవేశ్, యశ్ దయాల్.



పట్టుబిగించిన పాక్

రావల్పిండి: ఇంగ్లండ్‌తో మూడో, ఆఖరి టెస్ట్‌లో పాకిస్థాన్ జట్టు పట్టు బిగించింది. 77 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లండ్ జట్టు శుక్రవారం ఆఖరికి 24 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 73/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ 344 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (134) శతకంతో కదం తొక్కాడు. స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (48), నోమన్ అలీ (45) బ్యాటింగ్‌లోనూ సత్తా చాటారు. తొమ్మిదో వికెట్‌కు వీరిద్దరూ 72 రన్స్ జోడించారు. ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 267 పరుగులు చేసింది.

భారత కుర్రాళ్లకు షాక్

ఫైనల్లో అఫ్ఘానిస్థాన్
ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్

అల్ అమెరాత్ (ఒమన్): హ్యాట్రిక్ విజయాలతో ఉన్న భారత్ 'ఎ' జట్టుకు ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీలో గట్టి ఝలక్ తగిలింది. ఐపీఎల్ స్టార్లతో కూడిన ఈ జట్టు సునాయాసంగా ఫైనల్ చేరుతుందనుకున్న వేళ.. అనూహ్యంగా అఫ్ఘానిస్థాన్ 'ఎ' జట్టు చేతిలో భంగపడింది. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో తిలక్ వర్మ సేన 20 పరుగులతో ఓటమి పాలైంది. దీంతో అఫ్ఘాన్ 'ఎ' తొలిసారి ఫైనల్‌కు చేరింది. ముందుగా అఫ్ఘాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 రన్స్ చేసింది. ఓపెనర్లు సెదికుల్లా అతల్ (83), జుబైద్ అక్బరి (64), కరీమ్ జనత్ (41) అదరగొట్టారు. రసిఖ్ సలామ్‌కు 3 వికెట్లు దక్కాయి. భారీ ఛేదనలో భారత్ 'ఎ' 20 ఓవర్లలో 186/7 స్కోరుకే పరిమితమైంది. రమణ్‌దీప్ (64), బదోని (31), నిశాంత్ (23) మాత్రమే ఆకట్టుకున్నారు. గజన్‌ఫర్, అబ్దుల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆదివారం జరిగే ఫైనల్లో శ్రీలంక 'ఎ'తో అఫ్ఘాన్ తలపడనుంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ చాంప్ పాకిస్థాన్ 'ఎ'పై శ్రీలంక 'ఎ' 7 వికెట్లతో నెగ్గింది.

ప్చ్.. హాకీలో ఫైనల్ మిస్

జొహార్ (మలేసియా): భారత జట్టు సుల్తాన్ జొహార్ కప్ జూనియర్ హాకీ టోర్నీలో ఫైనల్ చేరడంలో విఫలమైంది. శుక్రవారం న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి లీగ్ పోరును మనోళ్లు 3-3తో డ్రా చేశారు. టోర్నీలో 5 మ్యాచుల్లో 3 గెలిచి, ఒకటి ఓడి, మరొకటి డ్రా చేసిన భారత్ 10 పాయింట్లతో నిలిచింది. ఇక తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా 9-3తో మలేసియాను, బ్రిటన్ 3-1తో జపాన్‌ను ఓడించాయి. దాంతో భారత్, ఆసీస్, బ్రిటన్ పదేసి పాయింట్లతో నిలిచాయి. అయితే మెరుగైన గోల్స్ భేదంతో తొలి రెండు స్థానాలు సాధించిన ఆసీస్, బ్రిటన్ శనివారం జరిగే ఫైనల్‌కు అర్హత సాధించాయి. మూడో స్థానంకోసం న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది.

రషీద్‌కు ఆంధ్ర రంజీ పగ్గాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర రంజీ జట్టుకు కొత్త సారథిగా 21 ఏళ్ల యువ బ్యాటర్ షేక్ రషీద్ నియమితుడయ్యాడు. పిన్న వయసులో ఆంధ్ర రంజీ సారథ్య బాధ్యతలు అందుకున్న క్రికెటర్ రషీదే. కాగా ఆంధ్ర, హిమాచల్‌ప్రదేశ్ మధ్య శనివారం మొదలయ్యే రంజీ మ్యాచ్‌కు ఇక్కడి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదిక కానుంది.

తలైవాస్‌కు పట్నా ఝలక్

హైదరాబాద్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో రెండు వరుస విజయాలతో జోరుమీదున్న తమిళ్ తలైవాస్‌కు ఝలక్ తగిలింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 42-40తో తలైవాస్‌ను ఓడించింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 36-22తో బెంగళూరు బుల్స్‌ను చిత్తుచేసింది.

బిజినెస్

2024 ఆర్థిక సంవత్సరంలో సత్య నాదెళ్లకు రూ.665 కోట్ల పారితోషికం

2023తో పోలిస్తే 63 శాతం అధికం

కాలిఫోర్నియా: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజ కంపెనీ మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ అయిన తెలుగు తేజం సత్య నాదెళ్ల.. 2024 జూన్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం 7.91 కోట్ల డాలర్ల (రూ.665.15 కోట్లు) భారీ పారితోషికాన్ని అందుకున్నారు. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్‌ఈసీ)కి మైక్రోసాఫ్ట్ ఈ విషయాన్ని గురువారం వెల్లడించింది. నాదెళ్ల వార్షిక ప్యాకేజీ 2023 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 63 శాతం పెరిగింది. అంతేకాదు, 2014లో మైక్రోసాఫ్ట్ సారథిగా పగ్గాలు చేపట్టిన తర్వాత కాలంలో నాదెళ్ల అందుకున్న అత్యధిక పారితోషికమిదే. 2014 ఆర్థిక సంవత్సరంలో ఆయనకు 8.4 కోట్ల డాలర్ల ప్యాకేజీ లభించింది.



90 శాతం స్టాక్స్ కేటాయింపులే..

ఈ ఏడాది పారితోషికంలో నాదెళ్ల వేతన రూపంలో అందుకోనున్నది కేవలం 25 లక్షల డాలర్లే. కాగా, కంపెనీ షేర్ల రూపంలో లభించిన వాటానే 90 శాతం (7.1 కోట్ల డాలర్లు)గా ఉంది. గత ఏడాదిలో లభించిన 3.9 కోట్ల డాలర్ల స్టాక్స్ పోలిస్తే, ఈ ఏడాది కేటాయింపులు దాదాపు రెట్టింపయ్యాయి. నాదెళ్ల సారథ్యంలో కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో కంపెనీ పురోగతి, చాట్‌జీపీటీని రూపొందించిన ఓపెన్‌ఏఐలో పెట్టుబడులు మార్కెట్లో మైక్రోసాఫ్ట్ స్థానాన్ని మరింత బలోపేతం చేశాయి. దాంతో నాదెళ్లకు స్టాక్స్ రూపంలో ప్రోత్సాహకాలూ భారీగా పెరిగాయి. ఈ మధ్యనే మైక్రోసాఫ్ట్‌లో సైబర్ భద్రత సమస్యలు తలెత్తాయి. అందుకు బాధ్యత వహిస్తూ నాదెళ్ల తన నగదు ప్రోత్సాహకాలను సగానికి (1.06 కోట్ల డాలర్ల నుంచి 52 లక్షల డాలర్లకు) తగ్గించుకున్నారు. అయినప్పటికీ, ఆయన వార్షిక పారితోషికం భారీగా పెరగడం గమనార్హం.



బీ న్యూలో దీపావళి ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ సంస్థ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ దీపావళి పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గడిచిన పదేళ్లుగా 70 లక్షల కంటే ఎక్కువ మొబైల్ వినియోగదారుల అభిమానం, ఆదరణ చూరగొన్న బీ న్యూ మొబైల్స్. దీపావళి సందర్భంగా మొబైల్స్ సహా గృహోపకరణాలపై అద్భుతమైన ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చిందని సంస్థ సీఈఓ వై సాయి నిఖిలేష్ తెలిపారు. ఎంఐ, వివో, ఒప్పో, రియల్‌మీ, ఐఫోన్, ఐటెల్, సామ్‌సంగ్ మొబైల్స్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతిని అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అలాగే లక్కీ డ్రాలో కారు, బైక్, రూ.10 లక్షల నగదు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ల్యాప్‌టాప్‌లపై రూ.10,000, టీవీలపై రూ.7,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను ఆఫర్ చేస్తున్నట్లు నిఖిలేష్ తెలపారు. యాక్సెసరీస్‌పై 80 శాతం వరకు డిస్కౌంట్ సహా ఎంపిక చేసిన మొబైల్స్‌పై 50 శాతం వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు చెప్పారు. ఐఫోన్ కొనుగోలుపై భారీ డిస్కౌంట్‌తో పాటు రూ.5,000 వరకు క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా ఆధార్ కార్డు, పాన్‌కార్డులతో బజాజ్ ఫిన్‌సర్వ్ ద్వారా మొబైల్, టీవీ, ల్యాప్‌టాప్స్‌ను జీరో డౌన్ పేమెంట్, జీరో వడ్డీతో కొనుగోలు చేయవచ్చన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 150కి పైగా బీ న్యూ షోరూమ్స్‌ల్లో దీపావళి ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయని నిఖిలేష్ వెల్లడించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,580 ▲	72,950 ▲	1,07,000 ▼
ముంబై	78,015 ▼	71,462 ▼	95,800 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	535
చిత్తూరు	578	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	120
వరంగల్	115	గుంటూరు	120
కరీంనగర్	115	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	126
కర్నూలు	115	నెల్లూరు	126
విశాఖపట్నం	105	అనంతపురం	126
గోదావరి	120		

రూ.6.80 లక్షల కోట్లు ఆవిరి



వరుసగా ఐదో రోజూ నష్టాల్లో మార్కెట్
సెన్సెక్స్ మరో 663 పాయింట్లు పతనం
80,000 కీలక స్థాయిని కోల్పోయిన సూచీ
24,200 దిగువకు పడిపోయిన నిఫ్టీ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టపోయాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 927 పాయింట్లకు పైగా క్షీణించింది. చివరికి 662.87 పాయింట్ల నష్టంతో 79,402.29 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 80,000 కీలక స్థాయిని చేజార్చుకుంది. నిఫ్టీ సైతం 218.60 పాయింట్లు కోల్పోయి 24,180.80 వద్ద ముగిసింది. నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు పాల్పడటం ఇందుకు ప్రధాన కారణం. అలాగే, ఎనర్జీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో భారీ నష్టాలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతుండటం కూడా ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. అమ్మకాల హోరులో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6.80 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.436.98 లక్షల కోట్లకు (5.20 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఈ వారంలో సెన్సెక్స్ 1,822.46 పాయింట్లు (2.24 శాతం), నిఫ్టీ 673.25 పాయింట్లు (2.70 శాతం) క్షీణించాయి. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది నాలుగో వారం. ఈ నెలలో ఇప్పటివరకు సూచీలు 6.5 శాతం నష్టపోయాయి. కొవిడ్ సంక్షోభం తర్వాత మార్కెట్‌కు ఇదే అత్యంత గడ్డు నెల. కాగా మున్ముందు సూచీలు మరింత పతనమయ్యే అవకాశాలు ఉన్నాయని ఈక్విటీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

మార్కెట్ విశ్లేషకులకు సెబీ చెక్

నిబంధనలు కఠినం చేస్తూ ఆదేశాలు

టీవీ చానల్స్, పత్రికల్లో స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై సలహాలు, సూచనలు ఇచ్చే రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ), ప్రాక్సీ అడ్వైజర్ల (పీఏ)కు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చెక్ పెడుతోంది. ఇక ఎవరు పడితే వారు ఈ అవతారాలు ఎత్తేందుకు వీల్లేదు. సెబీ వద్ద నమోదైన రీసెర్చ్ అనలిస్టులు, ప్రాక్సీ అడ్వైజర్లు మాత్రమే ఇక సలహాలు, సూచనలు ఇవ్వాలి. పైగా వారు ప్రతి నెల, ఆరు నెలలకు ఒకసారి నిర్ణీత ఫార్మాట్‌లో తమ పూర్తి వివరాలను సెబీ, రీసెర్చ్ అనలిస్ట్ అడ్మినిస్ట్రేషన్ అండ్ సూపర్‌వైజరీ బాడీల (ఆర్ఏఏఎస్‌బీ)కు సమర్పించాలి. ప్రతి ఏడాది మార్చి 31, సెప్టెంబరు 30తో ముగిసే ప్రతి ఆరు నెలలకు ఈ నిర్ణీత ఫార్మాట్ సమర్పించాలి. ఆ తర్వాత కూడా ప్రతి నెలా తమ వివరాలు సమర్పించాలని సెబీ స్పష్టం చేసింది.

ఫార్మాట్‌లో అన్ని వివరాలు: తమ రిజిస్ట్రేషన్ నంబర్, అధికారిక వెబ్‌సైట్ అడ్రస్, తమ సోషల్ మీడియా వ్యవహారాలు చూసే వ్యక్తుల వివరాలు, జారీ చేసిన ప్రకటనలు, ఖాతాదారుల నుంచి ఫీజు వసూలు చేసేందుకు ఉపయోగిస్తున్న బ్యాంకు ఖాతాల వివరాలు, డైరెక్టర్లు, భాగస్వాములు, వారి వాటాలు, తమపై వచ్చిన ఫిర్యాదుల వంటి విషయాలు అన్నిటిని పేర్కొనాలి.

రూ. 20 లక్షల వరకు ముద్రా రుణాలు

పాత రుణాలు చెల్లించిన వారికే

న్యూఢిల్లీ: ముద్రా రుణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రుణాల పరిమితిని ప్రస్తుత రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే ముద్రా రుణాలు తీసుకుని వాటిని సక్రమంగా చెల్లించిన వారికి మాత్రమే 'తరుణ్ ప్లస్' పేరుతో ఈ రుణాలు మంజూరు చేస్తారు. దీంతో చిన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని భావిస్తున్నారు. ముద్రా రుణాల గరిష్ఠ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచబోతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది జూలైలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ప్రకటించిన సంగతి తెలిసిందే. పెంచిన ఈ రుణాల చెల్లింపునకు మైక్రో యూనిట్స్ పరపతి హామీ నిధి (సీజీఎఫ్ఎంయూ) ప్రభుత్వం హామీ ఇస్తుంది.

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ).. హైదరాబాద్‌లో ఇండస్ట్రీ కాంక్లేవ్‌ను నిర్వహించింది. పరిశోధన నుంచి పారిశ్రామిక గమ్యం వైపు అనే థీమ్‌తో ఐఈఈఈ హైదరాబాద్, ఐఈఈఈ డబ్ల్యూఐఈ ఏజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. స్టార్టప్ ఇండియా, నిధి వంటి ప్రభుత్వ పథకాలు సమాజానికి ఎలా ఉపయోగపడుతున్నాయో ఐఈఈఈ హైదరాబాద్ విభాగం చైర్‌పర్సన్ విజయలత వివరించారు. పరిశోధనలను ఆచరణలోకి తీసుకురావటం, పరిశోధకులు, పారిశ్రామికవేత్తల మధ్యన ఉన్న అంతరాన్ని తొలగించేందుకు ఈ కాంక్లేవ్ ఎంతగానో దోహదపడిందన్నారు.

నిట్టనిలువుగా పైకి ఎగిరే విమానం

ఆవిష్కరించిన బ్లూజే ఏరో
2026 నాటికి వాణిజ్య పరంగా అందుబాటులోకి
తొలుత సరుకు రవాణా కోసమే..
రెండేళ్ల తర్వాత ప్యాసింజర్ ప్రొటోటైప్ ఫ్లైట్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బ్లూజే ఏరో స్పేస్.. వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ (వీటీఓఎల్) విమానాన్ని తయారు చేసింది. శుక్రవారం నాడిక్కడ నాదర్‌గుల్ ఎయిర్‌ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రొటోటైప్ వీటీఓఎల్‌ను ప్రదర్శించింది. భారత్‌లో ఈ తరహా విమానాన్ని రూపొందించటం ఇదే మొదటిసారని బ్లూజే ఏరోస్పేస్ కో ఫౌండర్, సీఈఓ మారుతి అమర్‌దీప్ శ్రీ వత్సవాయ, మరో కో ఫౌండర్, సీటీఓ ఉత్తమ్ కుమార్ ధర్మపురి తెలిపారు. నిట్టనిలువునా పైకి ఎగరటమే కాకుండా అలాగే కిందకు దిగటం ఈ విమానం ప్రత్యేకత అని వారు తెలిపారు. పూర్తిగా శుద్ధ ఇంధనాలైన హైడ్రోజన్ (హెచ్2), ఎలక్ట్రిక్ (ఈ) ప్రొపెల్షన్, అటానమస్ ఫ్లైట్ టెక్నాలజీలతో ఈ విమానం నడుస్తుందని వివరించారు. పౌర విమానయానం, రక్షణ రంగాలకు ఉపయోగపడే విధంగా రీచ్ పేరుతో ఈ హెచ్2ఈవీటీఓఎల్ విమానాన్ని రూపొందించినట్లు చెప్పారు. 2026 నాటికి వాణిజ్య పరంగా ఈ విమానాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అమర్‌దీప్, ఉత్తమ్ తెలిపారు. కార్గో, ప్రయాణికుల రవాణా (ఎయిర్ ట్యాక్సీ)లో ఈ విమానం కీలకంగా మారుతుందన్నారు. అలాగే రక్షణ రంగం కోసం అత్యంత ఎత్తులో ఉన్న ప్రదేశాలకు సరుకులు రవాణా చేసేందుకు ప్రత్యేకమైన విమానాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వారు తెలిపారు.


లాజిస్టిక్స్ రంగం కోసం: తొలుత లాజిస్టిక్స్ విభాగం కోసం ఈ విమాన సేవలను ఉపయోగించుకోనున్నట్లు అమర్‌దీప్ వెల్లడించారు. 300 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు అవసరమైన సరుకు రవాణా సహా అత్యవసర ఉత్పత్తులను సరఫరా చేసేందుకు వీటిని ఉపయోగించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం విమాన బరువు 500 కేజీలుగా ఉండగా పేలోడ్ సామర్థ్యం 100 కిలోల వరకు ఉందని ఆయన తెలిపారు. ఒకసారి చార్జింగ్‌తో 300 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. అయితే వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకువచ్చే నాటికి పేలోడ్ సామర్థ్యాన్ని మరింతగా పెంచనున్నట్లు అమర్‌దీప్ చెప్పారు. అలాగే 2026లోనే ప్రయాణికుల రవాణా కోసం అవసరమైన ప్రొటోటైప్ విమానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. అప్పటికల్లా డీజీసీఏ నుంచి అవసరమైన అన్ని అనుమతులను పొందేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అమర్‌దీప్ చెప్పారు.

రూ.18 కోట్ల సమీకరణ: 2022లో కార్యకలాపాలు ప్రారంభించిన బ్లూజే ఏరో.. వెంచర్ క్యాపిటల్ సంస్థలైన ఎండియా పార్ట్‌నర్స్, ఐడియాస్ప్రింగ్ క్యాపిటల్, జీరోధా నేతృత్వంలోని రెయిన్‌మ్యాటర్ క్యాపిటల్ నుంచి రూ.18 కోట్ల నిధులను సమీకరించిందని ఉత్తమ్ తెలిపారు. కాగా సిరీస్ ఏ రౌండింగ్‌లో భాగంగా వచ్చే మూడేళ్లలో వివిధ ఇన్వెస్టర్ల నుంచి మరో రూ.250 కోట్ల వరకు నిధులను సమకూర్చుకోవాలని చూస్తున్నట్లు ఉత్తమ్ చెప్పారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 26-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 209
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
వరంగల్

ఇతరుల తప్పుల్ని భుజాన వేసుకోవద్దు



సమస్యలు కొని తెచ్చుకోవద్దు!.. మౌఖిక వివరాలిస్తే చర్యలు తప్పవు
మాజీ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లుకు కాళేశ్వరం కమిషన్ హెచ్చరిక
ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో రూ. 14 వేల కోట్ల వ్యయం
రూ. 13,250 కోట్లు కాళేశ్వరంలో వినియోగం.. వృథా 750 కోట్లే!
2019–22 దాకా బ్యారేజీల్లో సమస్యలు: వెంకటేశ్వర్లు
మహారాష్ట్రలో చెక్‌డ్యామ్‌లకు సీకెంట్‌పైల్స్ వాడారు: సీఈ చంద్రశేఖర్
9

పటేల్ తరహాలో గాంధీ విగ్రహం

గుజరాత్‌లోని వల్లభ్‌భాయ్ విగ్రహం స్థాయిలో హైదరాబాద్ బాపూఘాట్‌లో ఏర్పాటు

గాంధీ ఐడియాలజీ కేంద్రంగా రూపకల్పన
మూసీ పునరుజ్జీవం, తెలంగాణ అభివృద్ధికి
బీఆర్ఎస్, బీజేపీలు అడ్డు తగులుతున్నాయ్
గుజరాత్‌కు పోటీ ఇవ్వబోతున్నామనే..!
ప్రజల ఆలోచనను పట్టించుకోకుంటే
ఆ రెండు పార్టీలకు ప్రతిపక్ష హోదా దక్కదు
భావోద్వేగ రాజకీయాలు తప్ప..
పదేళ్ల ప్రధానిగా మోదీ చేసిందేంటి?
ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో రేవంత్
దేశంలోనే అత్యుత్తమ క్రీడా పాలసీ కావాలి
వర్సిటీ బిల్లులపై అధికారులకు ఆదేశాలు



తెలంగాణ క్రీడా విధానంపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, జితేందర్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గుజరాత్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం తరహాలోనే బాపూఘాట్‌లోనూ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని చెప్పారు. శుక్రవారం ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం సీఎం మాట్లాడారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమాన్ని, బాపూఘాట్ అభివృద్ధిని బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. గుజరాత్‌లో బీజేపీ వాళ్లు సబర్మతి రివర్ ఫ్రంట్

మిగతా 11వ పేజీలో...

నేడు క్యాబినెట్ భేటీ
11

ఎజెండాలో రైతుభరోసా, ఉద్యోగుల డీఏలు,
317జీవో, కులగణన, ధరణి, ఆర్ఆర్ఆర్ చట్టం!
మూసీ, హైడ్రా ఇందిరమ్మ ఇళ్లపైనా నిర్ణయం!

భయపడాల్సింది లేదు..



అనుమతులు పొందిన నిర్మాణాలు కూల్చివేత ఉండదు
హైడ్రా చర్యలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
రియల్టర్లకు అండగా ఉంటాం
ఫ్యూచర్ సిటీలో భాగమవ్వాలి
నరెడ్కో ప్రాపర్టీ షో
ప్రారంభంలో మంత్రి ఉత్తమ్
11



మంత్రిగా ఉండి అలా మాట్లాడటం తగదు

ఆ వ్యాఖ్యలు సమాజంపై
చెడు ప్రభావం చూపే అవకాశం ఉంది
కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాలో
మంత్రి కొండా సురేఖపై కోర్టు ఆగ్రహం
ఈ విషయమై మరోసారి కేటీఆర్‌పై
ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సూచన
మంత్రి మాట్లాడిన వీడియోలు, వార్తలు
తొలగించాలని సోషల్ మీడియాకు ఆదేశాలు
9



ఐఏఎస్ అమోయ్ కుమార్
3

రిటైర్డ్ ఐఏఎస్.. సీనియర్ ఐఏఎస్

భూ బదలాయింపుల కేసులో 2 పేర్లు తెరపైకి
9 గంటల పాటు అమోయ్ కుమార్ విచారణ
పాత కలెక్టర్లకే తీసుకెళ్లి ప్రశ్నించిన ఈడీ
త్వరలో మరికొందరికి నోటీసులిచ్చే అవకాశం
తట్టి అన్నారంలో వెయ్యి కోట్ల భూమికి టెండర్
అమోయ్ కుమార్‌పై ఈడీకి మరో ఫిర్యాదు

సైబర్ వల.. బతుకులు విలవిల!
2

ఆగ్నేయాసియాలో 29 వేల మంది
భారతీయ యువతీ యువకుల మిస్సింగ్
ఉద్యోగాలపై సోషల్ మీడియాలో ప్రకటన
వెళ్లిన వారితో బలవంతపు సైబర్ నేరాలు

ఎల్ఏసీ నుంచి వెనక్కి

2020 ఏప్రిల్ ముందు నాటి
స్థానాలకు భారత్, చైనా బలగాలు
సరిహద్దుల్లో గస్తీపై ఒప్పందం అమలు
2

రాయడం.. చదవడం చాలు

నీటిపారుదలశాఖలో నియామకాలు
1597 మంది లష్కర్లు,
281 మంది హెల్పర్ల అవసరం
అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
9



ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో బండి, కిషన్‌రెడ్డి

పేదల ఇళ్లు కూల్చడం సిగ్గుచేటు

ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే పోరాటం తీవ్రం
మూసీపై రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా..
మూడు నెలలు పేదల ఇళ్లలో ఉంటా
సీఎం వచ్చి బాధితుల్ని పరామర్శించగలరా?
పేదల జోలికి వెళ్లకుంటే మద్దతిస్తాం: కిషన్‌రెడ్డి
కాంగ్రెస్ అగ్రనేత అల్లుడి కోసమే ఈ తతంగం!
గుడి పేరుతో ఆయన ఇక్కడికొచ్చి
కాంట్రాక్టు మాట్లాడుకున్నారు: బండి సంజయ్
మూసీ సుందరీకరణ నిర్వాసితులకు అండగా
ఇందిరాపార్కు వద్ద బీజేపీ మహాధర్నా
9



ఒకే పోలీస్ విధానం అమలు చేయాలి

టీజీఎస్పీ పోలీస్ కుటుంబాల డిమాండ్
సచివాలయ ముట్టడికి యత్నం.. ఉద్రిక్తత
కొండాపూర్, యూసు‌ఫ్‌గూడలో ధర్నా
టీజీఎస్పీ సర్క్యులర్ తాత్కాలికంగా నిలిపివేత

గ్రూప్-1కు తగ్గుతున్న పోటీ

1:50 నుంచి 1:37కి పడిన నిష్పత్తి.. పరీక్షలు ముగిసేసరికి మరింతమంది గైర్హాజరు

కొత్త ఉపాధ్యాయులు వచ్చాక చాలా స్కూళ్లలో మిగులు టీచర్ల సమస్య

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పోస్టులకు పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతోంది. 1:50 నిష్పత్తితో మొదలైన ఈ పోటీ ప్రస్తుతం 1:37 నిష్పత్తికి చేరుకుంది. పరీక్షలు ముగిసే నాటికి ఈ నిష్పత్తి మరింత తగ్గే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.. ఇందులో భాగంగా ప్రస్తుతం మెయిన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 21న ప్రారంభమైన ఈ పరీక్షలు 27వ తేదీతో ముగుస్తాయి. ప్రతి అభ్యర్థి అన్ని పరీక్షలను రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్ష రాయకపోయినా... సదరు అభ్యర్థిని పరిగణనలోకి తీసుకోరు. మొదటి రోజు ఇంగ్లిష్ క్వాలిఫై పరీక్షలను నిర్వహించారు. తర్వాత వరుసగా సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు జరుగుతున్నాయి. మొదటి రోజు 74 శాతం ఉన్న అభ్యర్థుల హాజరు శాతం ఈ నెల 25వ తేదీ నాటికి 67.4 శాతానికి పడిపోయింది.



ప్రిలిమనరీ పరీక్షలో ప్రతిభ చాటిన అభ్యర్థులను 1:50 నిష్పత్తిలో మెయిన్ పరీక్షలకు ఎంపిక చేశారు. ఇలా 31,403 మంది అభ్యర్థులను మెయిన్ పరీక్షకు ఎంపిక చేశారు. ఇందులో శుక్రవారం 21,195 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. అంటే.. ఒక్కో పోస్టుకు 37 మంది మాత్రమే

మిగతా 10వ పేజీలో...

వాస్తవాధీన రేఖ వెంబడి సేనలు వెనక్కి!

» 2020 ఏప్రిల్ ముందు నాటి స్థానాలకు భారత్, చైనా బలగాలు.. ఒప్పందం అమలు

న్యూఢిల్లీ, అక్టోబరు 25: నాలుగేళ్లుగా నెలకొన్న ఉద్రిక్తతలకు తెరదించుతూ సరిహద్దుల్లో గస్తీపై భారత్, చైనా మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం అమలు విషయంలో ఇరుదేశాలు కలిసి పని చేస్తున్నాయి. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి.. తూర్పు లద్దాఖ్‌లో కీలక ప్రాంతాలైన డెమ్చోక్, డెస్పాంగ్‌లో ఉంచిన సేనలను ఇరుదేశాలు వెనక్కి రప్పిస్తున్నాయి. 2020 ఏప్రిల్‌కు ముందు(గల్వాన్ లోయలో ఘర్షణలకు ముందు) సేనలు ఎక్కడ ఉండేవో అక్కడికి తిరిగి చేరుతున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగా వాస్తవాధీన రేఖకు ఇరువైపులా ఉన్న 12 తాత్కాలిక నిర్మాణాలు, 12 గుడారాలను ఆయా సైన్యాలు తొలగించాయి. చైనా ఆర్మీ తమకు చెందిన కొన్ని వాహనాలను వెనక్కి తీసుకెళ్లగా, భారత ఆర్మీ కొంత సైన్యాన్ని వెనక్కి రప్పించింది. చార్డింగ్ నుల్లా నదికి పశ్చిమ దిశగా భారత బలగాలు, తూర్పు వైపుగా చైనా సైన్యం వెనక్కి వెళుతోంది. బలగాల ఉపసంహరణ ప్రక్రియ 29వ తేదీ వరకు కొనసాగనుంది. మరో నాలుగైదు రోజుల్లో డెమ్చోక్, డెస్పాంగ్ ప్రాంతాల్లో గస్తీ తిరిగి ప్రారంభమవుతుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే, గల్వాన్ సహా నాలుగు ప్రాంతాల్లో సైనిక ఉపసంహరణపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

రేసులో ట్రంప్ ముందంజ!

» మాజీ అధ్యక్షుడికి 48% మంది మద్దతు.. సీఎన్‌బీసీ సర్వే

» ట్రంప్ గెలిస్తే భారత్‌కు ఐటీ కష్టాలు!

న్యూఢిల్లీ, అక్టోబరు 25: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్.. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ మధ్య నువ్వానేనా అన్నట్టుగా పోటీ నెలకొన్నా.. రేసులో ట్రంప్ కాస్త ముందంజలో ఉన్నారట! మరో రెండు వారాల్లో అధ్యక్ష ఎన్నికలకు తెరలేవనున్న నేపథ్యంలో సీఎన్‌బీసీ సంస్థ 'ఆల్-అమెరికన్ ఎకనామిక్ సర్వే'లో ఇది తేలింది. అక్టోబరు 15-19 మధ్య ఈ సర్వే జరిపారు. అమెరికా వ్యాప్తంగా 1000 మంది ఓటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ మేరకు ట్రంప్‌కు 48%, కమలా హారిస్‌కు 46% మంది మద్దతు పలికారు. అయితే ఇది 3.1శాతం అటూ ఇటూ కావొచ్చని సర్వే సంస్థ పేర్కొంది. మరోవైపు.. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధిస్తే మన దేశానికి ఐటీ పరంగా కష్టాలు ఎదురవుతాయని ఫిలిప్ క్యాపిటల్ సంస్థ ఓ నివేదిక విడుదల చేసింది. ఆయన విజయం సాధిస్తే ఇప్పుడున్న వీసా నిబంధనలు కఠినంగా మారతాయని, ఫలితంగా భారత ఐటీ కంపెనీలకు సవాళ్లు ఎదురవుతాయని ఆ కంపెనీ పేర్కొంది.

అమిత్ షా విదేశీ పర్యటనల సమాచారం
చెప్పేవారికి మిలియన్ డాలర్ల బహుమతి

» ఖలిస్థాన్ ఉగ్రవాది పన్నున్ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ఖలిస్థాన్ ఉగ్రవాది, నిషేధిత సంస్థ సిఖ్స్ ఫర్ జస్టిస్ అధినేత గురుపత్వంత్ సింగ్ పన్నున్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా జరిపే విదేశీ పర్యటనలపై ముందుగా సమాచారం ఇస్తే ఒక మిలియన్ డాలర్లు (సుమారు రూ.8.50 కోట్లు) బహుమతిగా ఇస్తామని ప్రకటించాడు. నవంబరు 26 నుంచి సీఆర్‌పీఎఫ్ పాఠశాలలను మూసివేయాలని ఓ ప్రకటనలో హెచ్చరించాడు. సీఆర్‌పీఎఫ్ దారుణాలకు పాల్పడుతున్నందున ఆ పాఠశాలలను బహిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరాడు. ఉత్తర ఢిల్లీలోని రోహిణిలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పాఠశాల బయట ఇటీవల బాంబు పేలిన సంఘటన నేపథ్యంలో పన్నున్ హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకొంది.

ఢిల్లీ మద్యం కేసులో ఆఖరి నిందితుడికీ బెయిల్

» అమన్‌దీప్‌కు సుప్రీంకోర్టులో ఊరట

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో చివరి నిందితుడైన వ్యాపారవేత్త అమన్‌దీప్‌సింగ్ ధాల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. శుక్రవారం ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఆప్ నేతలు కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులు ఇప్పటికే బెయిల్‌పై బయటికొచ్చిన సంగతి తెలిసిందే. అమన్‌దీప్.. ఈ కేసులో గత ఏడాది మార్చిలో అరెస్టయ్యారు. అనంతరం ఆయన బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. నిరాశే ఎదురైంది. దీంతో హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఈ ఏడాది జూన్‌లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. అమన్‌దీప్‌ను కస్టడీలో ఉంచడం వల్ల ఏ ప్రయోజనము ఉండదని అభిప్రాయపడ్డ ధర్మాసనం.. ట్రయల్ కోర్టు నిబంధనలకు లోబడి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

దళితులపై దాడి కేసులో.. 98 మందికి యావజ్జీవం, ముగ్గురికి ఐదేళ్ల జైలు

» శిక్షలు ఖరారు చేసిన కొప్పళ జిల్లా సెషన్స్ కోర్టు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కొప్పళ జిల్లా గంగావతి తాలూకా మరగుబ్బి గ్రామంలో దళితులపై దాడికి పాల్పడిన కేసులో దోషులకు సెషన్స్ కోర్టు శిక్షలను ఖరారు చేసింది. పదేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై ఈ నెల 22న కొప్పళ జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. ముద్దాయిలలో 101 మందిని దోషులుగా ప్రకటించింది. వీరికి గురువారం సాయంత్రం శిక్ష ఖరారు చేసింది. 98 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధించింది. ముగ్గురికి అట్రాసిటీ కేసు వర్తించని కారణంగా ఐదేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధించింది. మరో ముద్దాయి రామణ్ణ లక్ష్మణ భోవి కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. ఆయన్ను పోలీసులు అలాగే కోర్టుకు తీసుకొచ్చారు. తీర్పు వెలువడిన అనంతరం కోర్టు ఆదేశాలతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రామణ్ణ మృతి చెందారని పోలీసులు తెలిపారు.

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు?

» రేపు ఖతార్ ప్రధానితో దోహాలో చర్చలు

» హాజరుకానున్న సీఐఏ చీఫ్, మొసాద్ చీఫ్

గాజా, టెల్ అవీవ్, బీరుట్ అక్టోబరు 25: గాజాలో హమాస్-ఇజ్రాయెల్ మధ్య ఏడాదికి పైగా జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు సంధి కుదిర్చే యత్నాలు మళ్లీ ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా ఇజ్రాయెల్ ఇంటలిజెన్స్ సంస్థ మొస్సాద్ చీఫ్ డేవిడ్ బర్నియా, అమెరికా ఇంటలిజెన్స్ సంస్థ సీఐఏ చీఫ్ బిల్ బర్న్స్.. ఖతార్ రాజధాని దోహాలో ఆదేశ ప్రధాని అల్ థానీతో ఈ నెల 27న చర్చలు జరుపుతారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా ఖతార్ ప్రధాని అల్ థానీతో సమావేశమయ్యారు. హమాస్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపే విషయంపై ప్రాథమిక చర్చలు జరిపారు. హమాస్ చీఫ్ యహ్యా సిన్వర్ ఇటీవలే ఇజ్రాయెల్ దాడిలో మృతి చెందడంతో చర్చల ప్రక్రియ వేగం చేసి యుద్ధానికి ముగింపు పలకాలని నిర్ణయించినట్లు సమాచారం. కాగా, గాజాలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 60మందికిపైగా చనిపోయారు. మరోవైపు.. లెబనాన్‌లోని హాస్‌బయ్యాలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు మృతిచెందారు.

పాక్‌లో సరికొత్త 'ఉగ్ర' ఫ్యాక్టరీ!

న్యూఢిల్లీ, అక్టోబరు 25: పాక్ నుంచి వస్తున్న ఉగ్రవాదులు కొద్దిరోజులుగా జమ్మూకశ్మీర్లో స్థానికేతరులను, సైన్యాన్ని టార్గెట్ చేస్తున్నారు. వీరంతా పాక్ నెలకొల్పిన సరికొత్త టెర్రరిస్టు ఫ్యాక్టరీలో శిక్షణ పొందిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. అబోటాబాద్‌లోని పాక్ సైనిక కార్యాలయం పక్కనే దీనిని ఏర్పాటుచేశారు. ఇక్కడ లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మొహమ్మద్ సంస్థలకు సంయుక్తంగా శిక్షణ ఇస్తున్నారని నిఘా వర్గాలు వెల్లడించాయి. పాక్ గూఢచార సంస్థ (ఐఎస్ఐ)లో పనిచేస్తున్న ఓ జనరల్ స్థాయి అధికారి దీనిని పర్యవేక్షిస్తున్నారు. అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ తలదాచుకున్నది ఇక్కడి రహస్య భవనంలోనే. అమెరికా ప్రత్యేక దళాలు 2011 మేలో లాడెన్‌ను మట్టుబెట్టిన తర్వాత పాక్ ప్రభుత్వం ఆ భవనాన్ని నేలమట్టం చేసింది. దానిపైనే కొత్త ఉగ్రవాద ఫ్యాక్టరీ భవనాన్ని నిర్మించారా.. లేక సమీపంలో ఉందా అనేది తెలియాల్సి ఉంది. ఇక్కడ యువతీ యువకులకు ఆయుధాలు, రకరకాల యుద్ధాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. పై మూడు సంస్థల అధినేతలు హాఫీజ్ సయీద్, సయ్యద్ సలాహుద్దీన్, మసూద్‌ల ఆధ్వర్యంలో శిక్షణ నడుస్తోంది. ఈ ముగ్గురూ ఎన్ఐఏ మోస్ట్-వాంటెడ్ జాబితాలో ఉన్న సంగతి తెలిసిందే.

సైబర్ వల..
బతుకులు విలవిల!



ఆగ్నేయాసియాలో 29 వేల మంది భారతీయ యువతీ యువకులు మిస్సింగ్

» ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని మోసం

» సోషల్ మీడియాలో ప్రకటనలు

» నమ్మి వెళ్లిన వారితో సైబర్ నేరాల పని

» విస్తుగొలిపే విషయాల్ని వెల్లడించిన నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబరు 25: "రూ.లక్షల్లో కాదు.. కోట్లలో వేతనాలు. కూర్చున్న చోట నుంచి కదలాల్సిన పని కూడా లేదు. అలుపెరుగకుండా ఆయాసం లేకుండా పని చేసుకునే వెసులుబాటు. రండి! చేరండి!" ఇవీ.. సోషల్ మీడియాలో తరచుగా కనిపించే ప్రకటనలు. వీటిని నమ్మి.. రూ.కోట్లకు ఆశపడి ఈ ప్రకటనల వలలో చిక్కితే ఇక అంతే!. సైబర్ నేర సామ్రాజ్యంలో బానిసలుగా బతకాల్సిందే. ఇలా.. ఆగ్నేయాసియాలోని సైబర్ ముఠాల వలలో చిక్కుకుని ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 29 వేల మంది భారతీయులు కనిపించకుండా పోయారు. 2022, జనవరి నుంచి 2024 మధ్య వీరంతా మిస్సయినట్టు తాజాగా ఓ నివేదిక పేర్కొంది. ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామంటూ సైబర్ మాయగాళ్లు వీరిని మోసం చేసినట్టు నివేదిక వెల్లడించింది. 'వెబ్ ఆఫ్ డిసీట్; ట్రాన్స్‌నేషనల్ సైబర్ స్లేవరీ, ఆగ్నేయాసియాలో వ్యవస్థీకృత నేరాలు' పేరిట విడుదలైన ఈ నివేదిక పలు విషయాలను వివరించింది. వ్యవస్థీకృత నేరగాళ్ల ముఠా ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని.. యువతీ యువకులను ఉద్యోగాల పేరిట ఆకర్షించింది. నమ్మి వెళ్లినవారితో బలవంతంగా సైబర్ నేరాలను చేయించడం ఈ ముఠా ప్రధాన లక్ష్యం. ఈ ముఠా ప్రధానంగా కాంబోడియా, లావోస్‌లను కేంద్రంగా చేసుకుని పనిచేస్తున్నట్టు నివేదిక పేర్కొంది. భారత్, నేపాల్, బంగ్లాదేశ్‌లకు చెందిన యువతను అత్యధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు ఇస్తామంటూ ఆకర్షించింది.

ఇలా వల!

సైబర్ నేరగాళ్ల ముఠాలు.. సామాజిక మాధ్యమాలను, జాబ్ పోర్టళ్లను వేదికలుగా చేసుకుని తమ పన్నాగాలను అమలు చేస్తున్నాయి. ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సాప్‌లలో ఉద్యోగాలకు సంబంధించి నకిలీ ప్రకటనలు గుప్పిస్తాయి. భారీ వేతనాలంటూ ఆకర్షణీయమైన ప్రకటనలతో యువతను ఆకట్టుకున్నాయి. వినియోగదారుల సేవలు, క్రిప్టో కరెన్సీ వాణిజ్యం వంటి ఉద్యోగాలే మీరు చేయాల్సిందని నమ్మబలుకుతాయి. అంతేకాదు.. ఈ ముఠా 20 నుంచి 39 ఏళ్ల వయసున్న వారినే లక్ష్యంగా చేసుకుని ప్రకటనలు గుప్పిస్తాయి. ఇలా ఈ ప్రకటనలకు ఆకర్షితులై.. భారత్ నుంచి వేలాది మంది యువతీ యువకులు ఈ ముఠాల బారినపడ్డారు. ఇక, ఇలా వెళ్లిన వారి నుంచి ముందుగా పాస్‌పోర్టు, గుర్తింపు కార్డులు, కీలకమైన పత్రాలను ముఠా సభ్యులు స్వాధీనం చేసుకుంటారు. అనంతరం.. వారిని రహస్య ప్రాంతాల్లో నిర్బంధిస్తారు. వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తారు. ఫిషింగ్ కుంభకోణాలు, క్రిప్టో కరెన్సీ మోసాలు, నకిలీ రుణ యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేయిస్తారు. ఈ ముఠాల వెనుక.. నేరాలకు పాల్పడే అనేక సంస్థలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. వీటిలో అత్యంత కరడుగట్టిన నేర ముఠాలుగా పేరున్న జిన్ బీ గ్రూప్, ది కింగ్స్ రోమన్స్ గ్రూప్, ది ప్రిన్స్ గ్రూప్ ఉన్నట్టు తెలిపింది. ఇవన్నీ ఆగ్నేయాసియా నుంచే తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. బాధితుల్లో ఎక్కువ మంది ఈ గ్రూపుల్లోనే బలవంతపు బానిసలుగా ఉన్నారని తెలిపింది. ఎక్కువ మంది భారతీయులు విజిటర్స్ వీసాపై థాయ్‌లాండ్, కాంబోడియా, లావోస్, వియత్నాంలకు వెళ్లారని.. ఇప్పటి వరకు తిరిగి రాలేదని పేర్కొంది.

ప్రత్యక్ష నరకం!

సైబర్ ముఠాల బారిన చిక్కుకున్న వారు బానిసలుగా బతకాల్సిందేనని నివేదిక తెలిపింది. ఏమాత్రం వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానం కలిగినా.. భౌతిక దాడులతో పాటు ప్రత్యక్ష నరకం ఎలా ఉంటుందో రుచిచూపిస్తారు. రక్తాలు కారేలా కొట్టడంతోపాటు, కాళ్లు, చేతులు కూడా విరగ్గొట్టేస్తారు. రోజుల తరబడి తిండి, నీరు లేకుండా చేసి దారిలోకి తెచ్చుకుంటారు. వీరిపై ముఠా సభ్యుల నిరంతర పర్యవేక్షణ కూడా ఉంటుంది. అంతేకాదు.. రోజువారీ కుంభకోణాలు, మోసాలకు సంబంధించి లక్ష్యాలు విధిస్తారు. వాటిని సాధించకపోతే తీవ్రంగా హింసిస్తారు. ఆర్థిక మోసాలను ఎన్ని రూపాల్లో చేయొచ్చో అన్నీ చేయిస్తారు. యువతులతో అర్ధనగ్నంగా ఫోన్లు చేయించి వలపు వల విసిరేలా చేస్తారు.

4 నెలల్లో రూ.1750 కోట్ల మోసం

ఈ ఏడాది తొలి నాలుగు మాసాల్లో సైబర్ నేరాల బారిన పడిన భారతీయులు రూ.1,750 కోట్లకు పైగా మోస పోయారని నివేదిక వెల్లడించింది. ఇదంతా ఆగ్నేయాసియా సైబర్ ముఠా పనేనని పేర్కొంది. అదేవిధంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలలోనూ బాధితులు భారీ సంఖ్యలోనే ఉన్నారని తెలిపింది.

భారత ప్రభుత్వం స్పందించాలి

సైబర్ నేరగాళ్ల ముఠాలను అరికట్టేందుకు భారత్ సహా అంతర్జాతీయ సమాజం స్పందించాలని 'వెబ్ ఆఫ్ డిసీట్; ట్రాన్స్‌నేషనల్ సైబర్ స్లేవరీ, ఆగ్నేయాసియాలో వ్యవస్థీకృత నేరాలు' నివేదిక కోరింది. సమగ్రమైన చర్యలకు దిగాలని సూచించింది. దీనిలో భాగంగా వీసా నిబంధనలను మరింత కఠినతరం చేయాలని, సరిహద్దుల వద్ద నియంత్రణలను పెంచాలని ప్రభుత్వాలను కోరింది. నకిలీ ఉద్యోగ ప్రకటనలను తొలగించేలా టెక్ కంపెనీలను అప్రమత్తం చేయాలని సూచించింది. భారత్ వంటి దేశాలు ఇలాంటి నకిలీ ప్రకటనలు, సైబర్ నేరగాళ్ల ముఠాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించింది.

7 సెకన్ల వ్యవధిలో 5 సార్లు నమస్కారాలు



» బీజేపీ నేతకు యువ ఐఏఎస్ అధికారిణి గౌరవం

జైపూర్, అక్టోబరు 25: ఓ రాజకీయ నాయకునికి యువ ఐఏఎస్ అధికారిణి ఏడు సెకన్ల వ్యవధిలో అయిదు సార్లు నమస్కారం చేయడం చర్చనీయాంశంగా మారింది. రాజస్థాన్ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సతీష్ పునియా ఎస్‌యూవీ యూలో దిగగానే బర్మేర్ జిల్లా కలెక్టర్ టీనా దాబి తలవంచి వెంటవెంటనే నమస్కారం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'నవో బర్మేర్' పేరుతో జిల్లాలో ఆధునిక పద్ధతుల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతూ టీనా పేరు తెచ్చుకోవడం గమనార్హం. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పునియా కారు దిగుతుండగానే ఆమె చేతులు జోడించి ఆయనకు నమస్కరించారు. ఆయన ఇంకా ఫోన్‌లో మాట్లాడుతుండగానే ఆమె తలవంచి నమస్కారాలు చేశారు. 'థ్యాంక్యూ! బాగా పనిచేస్తున్నారు. పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. చెత్తకుండీలు ఏర్పాటు చేస్తున్నారు' అంటూ కొనియాడారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో నాయకుల పట్ల ఇంత విధేయత ప్రదర్శించాల్సిన అవసరం ఉందా అన్న చర్చ నడుస్తోంది.

లోకం తీరు



వలసలకు కెనడా కళ్లెం!

వచ్చే మూడేళ్లలో ఏటా లక్ష మందికి పైగా కోతలు

న్యూఢిల్లీ/అట్టావా, అక్టోబరు 25: దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్యను భారీగా తగ్గించినట్లు కెనడా ప్రకటించింది. దేశంలో జనాభా పెరుగుదలకు అడ్డుకట్టవేయడంతోపాటు వలసలపై స్థానికుల్లో వ్యతిరేకత పెరుగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. 2023-24 మధ్య కాలంలో కెనడా జనాభా 3.2శాతం పెరిగి 4.1 కోట్లకు చేరుకుంది. వలసదారుల సంఖ్య అనూహ్యంగా పెరగడమే దీనికి కారణంగా పేర్కొంది. వలసలపై ఆంక్షలను ప్రకటించిన ప్రధాని జస్టిన్ ట్రూడో మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో వలసదారుల సంఖ్యను గణనీయంగా తగ్గిస్తామని ప్రకటిస్తున్నాం. ఈ నిర్ణయం వచ్చే రెండేళ్లలో జనాభా పెరుగుదలలో విరామానికి దోహదపడుతుంది' అన్నారు. ఆరోగ్య సంరక్షణ, గృహనిర్మాణం, సామాజిక సేవల్లో అవసరమైన పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వానికి తగిన సమయం ఇవ్వడంతోపాటు భవిష్యత్తులో ఎక్కువ మందికి వసతి కల్పించడానికి కెనడా జనాభాను స్థిరీకరించాల్సిన అవసరం ఉంద న్నారు. కాగా 2025, 2026 సంవత్సరాల్లో 5లక్షల మంది చొప్పున దేశంలో కొత్తగా శాశ్వత నివాసానికి అనుమతించాలని కెనడా ఇమ్మిగ్రేషన్ శాఖ గతంలో ప్రణాళికలు సిద్ధంచేసింది. అయితే ప్రస్తుతం ఆ లక్ష్యాలను వచ్చే ఏడాది 3,95,000కు, 2026లో 3,80,000కు, 2027లో 3,65,000గా నిర్ణయించారు. ఇటీవల వలస వచ్చిన ప్రతి ఐదుగురిలో ఒకరు భారత్ నుంచి వచ్చారని స్టాటిస్టిక్స్ ఏజెన్సీ తెలిపింది. కాగా ఉన్నత విద్యను అభ్యసించడానికి కెనడా వెళ్లే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని భారత దౌత్యవేత్త సంజయ్ వర్మ హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కెనడా పంపేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించారు.

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో
శాంతిస్థాపనకు కృషి చేస్తాం

యుద్ధాలతో సమస్యలు పరిష్కారం కావు

» జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్‌తో భేటీలో మోదీ



జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్‌తో మోదీ కరచాలనం

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ఈ ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. భారత్- జర్మనీ 7వ 'ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్ (ఐజీసీ)' చర్చల్లో భాగంగా మూడు రోజుల భారత పర్యటనకు వచ్చిన జర్మన్ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్‌తో శుక్రవారం మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఉక్రెయిన్, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. వీలైనంత త్వరగా వీటికి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా కృషి చేసేందుకు భారత్ సిద్ధంగా ఉంది. యుద్ధాల వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని భారత్ ఎప్పటికీ విశ్వసించదు" అని చెప్పారు. ప్రపంచవ్యాప్తం గా ఉద్రిక్తతలు, విభేదాలు ముసురుకున్నప్పటికీ భారత్, జర్మనీల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఇరుదేశాల అభివృద్ధికి బలమైన పునాదిగా మారిందని పేర్కొన్నారు. ఈ రెండు దేశాల మధ్య భాగస్వామ్యం కేవలం లావాదేవీలకే పరిమితం కాలేదన్నారు. రెండు బలమైన ప్రజాస్వామ్య దేశాల పరివర్తనకు నిదర్శనంగా నిలిచిందని చెప్పారు. జర్మనీ ప్రకటించిన 'ఫోకస్ ఆన్ ఇండియా'ను మోదీ స్వాగతించారు. ఇరుదేశాల భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. 18వ ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్-2024 సదస్సులో మోదీ మాట్లాడుతూ.. ఓ వైపు సీఈవో ఫోరం సమావేశం జరుగుతుండగా, మరోవైపు ఇరుదేశాల నౌకాదళాలు సంయుక్త విన్యాసాలు చేస్తున్నాయని చెప్పారు. జర్మనీ, భారత్ దేశాల మధ్య ఉన్న స్నేహ బంధం అన్ని రంగాల్లోనూ మరింత బలోపేతం అవుతోందని తెలిపారు. భారతీయ నిపుణులకు ఏటా ఇచ్చే వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలన్న జర్మనీ నిర్ణయంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది జర్మనీ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్న విశ్వాసం తనకుందన్నారు. భారత్, జర్మనీల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఈ ఏడాదితో 25 ఏళ్లు పూర్తవుతాయని.. మరో 25 ఏళ్లలో ఇది మరింత ఉన్నత శిఖరాలకు చేరుతుందని పేర్కొన్నారు. ఐరాస భద్రతామండలితో సహా పలు అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

భారత ప్రయత్నాలు అభినందనీయం: ఒలాఫ్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేలా చూసి, శాంతిని నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను ఒలాఫ్ అభినందించారు. అన్ని భాగస్వామ్యపక్షాలతో చర్చించి శాంతిస్థాపనకు భారత్ ఎంతగానో ప్రయత్నిస్తోందని కొనియాడారు. ఈ విషయంలో భారత్‌కు మద్దతుగా నిలుస్తామన్నారు. కాగా, మహారాష్ట్రకు చెందిన భవేశ్, ధారా షా దంపతుల కుమార్తె అరిహా షా (3)ను మూడేళ్లుగా జర్మనీలోని ఫోస్టర్ కేర్‌లో ఉంచుతున్న విషయాన్ని ఒలాఫ్‌తో భేటీలో ప్రధాని మోదీ ప్రస్తావించినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. శారీరకంగా హింసించారన్న ఆరోపణలతో బాలికను 36 నెలలుగా తల్లిదండ్రులకు అప్పగించకుండా ఫోస్టర్ కేర్‌లోనే ఉంచుతున్నారు. ఈ అంశాన్ని తాను పరిశీలిస్తానని ఒలాఫ్.. మోదీకి హామీ ఇచ్చినట్లు మిస్రీ వెల్లడించారు.

'బాంబూ'చోళ్లు ఎవరు?

మరో 25కు పైగా సర్వీసులకు బెదిరింపులు

» హైదరాబాద్-చండీగఢ్ విమానానికి కూడా..

న్యూఢిల్లీ, శంషాబాద్ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేశంలో విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు ఆగడం లేదు. రోజూ ఇలాంటి హెచ్చరికలు వస్తుండడం అధికారవర్గాల్లో అయోమయం సృష్టిస్తోంది. శుక్రవారం వివిధ సంస్థలకు చెందిన 25కుపైగా సర్వీసులకు బెదిరింపులు వచ్చాయి. వీటిలో ఇండిగో 8, విస్తారా 7, స్పైస్ జెట్, ఎయిర్ ఇండియాలకు చెందిన 6 సర్వీసులున్నాయి. ఢిల్లీ, ముంబై నుంచి తుర్కియే రాజధాని ఇస్తాంబుల్ వెళ్లే విమానాలూ ప్రభావితమయ్యాయి. మొదటి బెదిరింపు ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరే విమానానికి వచ్చింది. తర్వాత ముంబై, చెన్నై వంతు. కాగా, హైదరాబాద్ శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయం నుంచి పంజాబ్‌లోని చండీగఢ్ వెళ్తున్న ఇండిగో సర్వీసుకూ ఈ బెడద తప్పలేదు. పోలీసులు తెలిపినదాని ప్రకారం.. ఉదయం 10.50గంటలకు చండీగఢ్ వెళ్లే విమానంలో బాంబు పెట్టామని ట్వీట్ వచ్చింది. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బాంబు, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబులేదని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాల్‌రాజు తెలిపారు. బాంబు బెదిరింపులపై శంషాబాద్ విమానాశ్రయంలో జనవరి నుంచి 11 కేసులు నమోదయ్యాయి. కాగా, దేశంలో 11 రోజుల్లో బెదిరింపులు వచ్చిన సర్వీసుల సంఖ్య 275 దాటింది. గత 24 గంటల్లోనే వివిధ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి 70పైగా విమానాలకు హెచ్చరికలు అందాయి. వీటిలో ఎయిర్ ఇండియా, ఇండిగో, విస్తారాలవే 20 చొప్పున ఉన్నాయి. కాగా హెచ్చరికలు పంపుతున్నది ఎవరో నిఘా, భద్రతా వర్గాలు తెలుసుకోలేకపోయాయి. అయితే, కేంద్రం మల్టీ నేషనల్ టెక్నాలజీ సంస్థల సాయం కోరినట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికల నుంచే బెదిరింపులు రావడంతో మెటా, ఎక్స్‌లను వివరాలు కోరింది. ఈ సంస్థలు ఇంకా స్పందించాల్సి ఉంది. దుండగులు వీపీఎన్ లేదా డార్క్ వెబ్‌ను ఉపయోగిస్తున్నారని, విదేశం నుంచి ఈ చర్యకు పాల్పడుతున్నారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అంతర్జాతీయ కుట్రపైనా ఆరా తీస్తున్నామని ఒక అధికారి చెప్పారు. కీలక రంగాల్లో 35 మంది ఎయిర్ మార్షల్స్‌ను నియమించామని, వీరి సంఖ్యను వందకు పెంచుతామని తెలిపారు. కాగా, అన్నీ ఆకతాయి హెచ్చరికలేనని, దీనివెనుక కుట్ర ఏమీ లేదని పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగుతున్న 'డంకీ'!

» అనుమతి లేకుండా అమెరికాలోకి వెళ్లటానికి భారతీయుల యత్నాలు

» ఈ ఏడాది 90,415 మంది అరెస్టు

» వెల్లడించిన అమెరికా కస్టమ్స్ విభాగం

న్యూఢిల్లీ, అక్టోబరు 25: ఆ మధ్య వచ్చిన డంకీ సినిమా.. ఉపాధి కోసం బ్రిటన్‌లోకి అనధికారికంగా ప్రవేశించటానికి నిరుపేద భారతీయులు పడే బాధలను కళ్లకు కట్టింది. తీవ్రమైన అవమానాలు, సవాళ్లు, ఆటంకాలు, మార్గమధ్యంలోనే ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితులు ఉన్నా కూడా.. కూటి కోసం కోటి కష్టాలకు ఎదురీదుతూ విదేశాలకు అక్రమంగా వెళ్తున్న వారి సంఖ్య ఏమాత్రం తగ్గటం లేదు (ఈ చట్టవిరుద్ధ ప్రయాణమార్గాన్ని డంకీ ఫ్లైట్ అని వ్యవహరిస్తుంటారు). ఈ ఏడాది ఈ విధంగా అమెరికాలోకి ప్రవేశించటానికి ప్రయత్నించి అరెస్టయిన భారతీయుల వివరాలను 'అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్' తాజాగా వెల్లడించింది. 2023 అక్టోబరు 1 - 2024 సెప్టెంబరు 30 మధ్యకాలంలో (అమెరికా ఆర్థిక సంవత్సరం-2024లో) మెక్సికో, కెనడా సరిహద్దుల నుంచి అమెరికాలోకి అనధికారికంగా ప్రవేశించటానికి యత్నించి 29 లక్షల మంది దొరికిపోయారని ఈ వివరాలు తెలిపాయి. అరెస్టయిన వారిలో 90,415 మంది భారతీయులు కాగా.. వీరిలో దాదాపు సగం మంది గుజరాతీలే ఉండటం గమనార్హం. సగటున ప్రతీ గంటకు పది మంది భారతీయులు అమెరికాలోకి ప్రవేశించటానికి ప్రయత్నించి అధికారులకు దొరికిపోతున్నారు. ఎక్కువగా అమెరికా-కెనడా సరిహద్దు వద్దే అరెస్టవుతున్నారు. ఈ ఏడాది ఆ సరిహద్దు వద్ద 43,764 మంది దొరికిపోయారు.

తప్పుడు కేసు పెట్టి.. నిర్బంధించి..

ఉగాండాలో ఓస్వాల్ గ్రూపు కంపెనీల వారసురాలు వసుంధర అరెస్టు

» వంటమనిషి 'హత్య' కేసులో ప్రమేయం ఉందంటూ ఆరోపణలు

» ఖండించిన ఓస్వాల్ కుటుంబం

» వంట మనిషి బతికే ఉన్నాడని వెల్లడి



వసుంధర ఓస్వాల్

లండన్, అక్టోబరు 25: ఆఫ్రికా వ్యాప్తంగా పేరొందిన ఓస్వాల్ గ్రూపు కంపెనీల వారసురాలు వసుంధర ఓస్వాల్ అరెస్టు వ్యవహారం.. ఇప్పుడు అక్కడ సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల వయసున్న వసుంధర.. ఈ నెల 1వ తేదీన ఉగాండాలోని తమ ఫ్యాక్టరీని సందర్శించిన సమయంలో దాదాపు 20 మంది పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఓస్వాల్ కుటుంబంలో సహాయకుడిగా పని చేసిన ముఖేశ్ మేనరియా హత్యకు గురయ్యాడని, దీంట్లో వసుంధర ప్రమేయం ఉందని అభియోగాలు మోపారు. దాంతోపాటు పలు కార్పొరేట్ మోసాలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఆమె సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. లండన్‌లో ఉన్న ఓస్వాల్ గ్రూపు కంపెనీల అధిపతి పంకజ్ ఓస్వాల్.. కుమార్తె అరెస్టు విషయం తెలిసి హతాశుడయ్యారు. వసుంధరను సురక్షితంగా విడిపించటం కోసం ఆయన తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. ఉగాండా అధ్యక్షుడు యొవేరి ముసెవేనికి లేఖ రాశారు. ముఖేశ్ మేనరియా తమ వద్ద వంట మనిషిగా పని చేసేవాడని, దాదాపు రెండు లక్షల డాలర్లు అప్పు తీసుకున్నాడని, తమ ఇంట్లో విలువైన వస్తువులను దొంగిలించాడని లేఖలో పేర్కొన్నారు. అప్పు ఎగ్గొట్టే ఉద్దేశంతో ఉద్యోగం మానేసి, తమ మీద కిడ్నాప్, హత్య ఆరోపణలు చేశాడని తెలిపారు. పోలీసులు చెబుతున్నట్లుగా ముఖేశ్ హత్యకు గురి కాలేదని, టాంజానియాలో ఉన్నాడని తెలిపారు. వసుంధరను చట్టవ్యతిరేకంగా నిర్బంధించారని, ఆమెను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఐక్యరాజ్యసమితికి కూడా ఈ విషయమై విన్నవించారు. అయినప్పటికీ, వసుంధర విడుదల విషయంలో ముందడుగు పడకపోవటంతో పంకజ్ కుటుంబం తీవ్ర ఆందోళన చెందుతోంది. వసుంధరను అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితులు ఉన్న జైళ్లలో నిర్బంధిస్తున్నారని, తరచూ జైళ్లు మారుస్తున్నారని, సురక్షిత తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించటం లేదని వసుంధర చెల్లెలు రిధి ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన తర్వాత కొన్ని రోజులపాటు స్నానం చేయటానికి, బట్టలు మార్చుకోవటానికి కూడా ఆమెకు అనుమతి ఇవ్వలేదని తెలిపారు. వసుంధరను ఉగాండాకు ఎందుకు పంపించామా అని తమ తల్లిదండ్రులు తీవ్రంగా బాధపడుతున్నారని తెలిపారు. ఉగాండాకు వెళ్తే వారినీ అక్కడి అవినీతి అధికారులు అరెస్టు చేసే అవకాశం ఉందని, అందుకనే ఒక రహస్య ప్రదేశంలో ఉంటూ వసుంధర విడుదల కోసం శాయశక్తులా కృషి చేస్తున్నారని వెల్లడించారు. భారతీయ మూలాలున్న అభయ్ కుమార్ ఓస్వాల్.. ఓస్వాల్ కంపెనీని స్థాపించి పలు ఆఫ్రికా దేశాల్లో విస్తరించారు. ఆయన కుమారుడే పంకజ్ ఓస్వాల్. వీరి కుటుంబం స్విట్జర్లాండ్‌లో నివసిస్తోంది.

రిటైర్డ్ ఐఏఎస్.. సీనియర్ ఐఏఎస్

భూ బదలాయింపుల కేసులో 2 పేర్లు తెరపైకి.. 9 గంటల పాటు అమోయ్ కుమార్ విచారణ

- త్వరలో మరికొందరికి నోటీసులిచ్చే అవకాశం?
- అమోయ్ కుమార్‌పై ఈడీకి మరో ఫిర్యాదు



హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం భూదాన్ భూముల బదలాయింపు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. కుంభకోణం జరిగినపుడు కలెక్టర్‌గా ఉన్న సీనియర్ ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను శుక్రవారం వరుసగా మూడోరోజు తన కార్యాలయానికి పిలిపించి సుదీర్ఘంగా విచారించింది. విచారణలో భూదాన్ భూముల బదలాయింపు కేసులో రెండు కొత్త పేర్లు తెరపైకి వచ్చాయి. అందులో ఒకరు ఉన్నతాధికారిగా రిటైర్ అయిన ఐఏఎస్ కాగా, మరొకరు ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా ఉన్నారు. దాంతో కేసు ఎప్పుడు ఏ మలుపు తీసుకుంటుందోననే ఆసక్తి నెలకొంది. అమోయ్ కుమార్‌ను శుక్రవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారించిన ఈడీ అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కొన్ని ప్రశ్నలకు అమోయ్ నుంచి సరైన సమాధానాలు రాలేదని, కొన్నింటికి తెలియదని, మరి కొన్నింటికి గుర్తులేదని చెప్పినట్లు సమాచారం. రూ.వందల కోట్లు విలువైన భూదాన్ భూములు ఎవరి ప్రమేయంతో, ప్రోద్బలంతో బదలాయించాల్సి వచ్చిందనే అంశంపైనే ఈడీ ప్రధానంగా ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. అమోయ్‌ను మధ్యలో పాత రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌కు తీసుకెళ్లి, నిమిషాల వ్యవధిలోనే తిరిగి ఈడీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని చెప్పి పంపించారు. ఇప్పటి వరకు లభించిన సమాచారం, వివరాల ఆధారంగా ఈ కేసులో ఈడీ మరికొందరికి నోటీసులు పంపించేందుకు రంగం సిద్ధం చేసింది.

తహసీల్దార్ జ్యోతి ఇచ్చిన వివరాలతో ప్రశ్నలు

మహేశ్వరం పోలీస్‌లు గత ఏడాది మార్చిలో నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. ఎఫ్ఐఆర్ నెం.83/2023లో మహేశ్వరం తహసీల్దార్ జ్యోతితో పాటు మరికొందరిపై పోలీస్‌లు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. వాటి ఆధారంగా మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ జ్యోతితో పాటు మరికొందరిని పిలిపించి ప్రశ్నించింది. వారు చెప్పిన అంశాల ఆధారంగా ప్రత్యేక ప్రశ్నావళి రూపొందించి, అమోయ్‌ను ప్రశ్నించి, సమాధానాలు రాబట్టారు. గతంలో జ్యోతి చెప్పిన అంశాలు, ఇప్పుడు అమోయ్ ఇచ్చిన సమాచారాన్ని విశ్లేషిస్తున్నారు. అమోయ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగిన భూ లావాదేవీలపై ఈడీ ఆరా తీస్తోంది. ఇప్పటికే విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రమేయంపై కొంత స్పష్టత వచ్చినట్లు తెలిసింది. సీనియర్ ఐఏఎస్ ప్రమేయం కూడా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది.

అమోయ్‌పై ఫిర్యాదు

పశు సంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్‌పై ఈడీకి మరో ఫిర్యాదు అందింది. రంగారెడ్డి జిల్లా తట్టిఅన్నారం గ్రామం మధురానగర్ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అమోయ్ కుమార్‌పై ఈడీకి ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 108, 109, 110, 111లో సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన భూముల విషయంలో అక్రమాలు జరిగినట్లు ఈడీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 800 ప్లాట్లు తయారు చేసి, వేర్వేరు వ్యక్తులకు విక్రయించారని ఈ విషయంలో విచారణ జరిపి వాస్తవాలు నిగ్గు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు, ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకుడు రామ్మోహన్ గౌడ్, ఉపాధ్యక్షుడు బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి కంటెస్టెడ్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బాధితులు ఈడీకి ఫిర్యాదు చేశారు. 70 ఎకరాల 39 గుంటల భూమి మట్టాదారుడు సత్యనారాయణ రెడ్డి 1982లో 840 ప్లాట్లతో వెంచర్ చేసి విక్రయించాడన్నారు. భూమి ధరలు పెరగడంతో కొందరు ఆక్రమించుకున్నారని, వారితో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హోదాలో అమోయ్ కుమార్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఇదే విషయమై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించామని, ఆయనపై ఈడీ విచారణ కొనసాగుతున్నందున ఇక్కడ కూడా ఫిర్యాదు చేశామని చెప్పారు.

29న ఎన్ఐసీ చేతికి ధరణి

ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను ప్రస్తుతం టెర్రాసిస్ అనే సర్వీస్ ప్రొవైడర్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఆ సంస్థతో ఒప్పందం ఈ నెల 29తో ముగుస్తుంది. అదే రోజున ఎన్ఐసీ చేతికి అప్పగించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం సచివాలయంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ధరణి పోర్టల్ పర్యవేక్షిస్తున్న రెవెన్యూ సిబ్బంది, ఎన్ఐసీ అధికారులు, టెర్రాసిస్ సర్వీస్ ప్రొవైడర్ ప్రతినిధులతో సమావేశం జరిగింది. రికార్డుల నిర్వహణ, అన్ని రకాల క్రెడెన్షియల్స్ అప్పగింతలపై అధికారులు చర్చించారు.

రూ.2 వేల కోట్లపైనే!

అమోయ్ చేసిన భూ బదలాయింపుల విలువ రూ.2 వేల కోట్లపైనే ఉంటుందని ఆయన తోటి అధికారుల్లో చర్చ జరుగుతోంది. ఆయన గతంలో పని చేసిన ప్రాంతాల్లో తనతో పనిచేసిన కింది స్థాయి రెవెన్యూ ఉద్యోగులు, ఆయన తర్వాత సదరు జిల్లాలకు కలెక్టర్లుగా పని చేసిన ఐఏఎస్ అధికారులు తమ మెడకు ఏం చుట్టుకుంటుందోనని హడలిపోతున్నారు. మరోపక్క అమోయ్ చేతుల మీదుగా జరిగిన భూబదలాయింపుల మీద ఈడీకి ఫిర్యాదులు అందుతున్నాయి. ఖాజాగూడలో ఓ ప్రముఖ బిల్డర్‌కు 27 ఎకరాల ప్రభుత్వ భూమిని పట్టా చేయించడంపైన, శంషాబాద్ దగ్గర సుల్తాన్‌పల్లిలో 40 ఎకరాలు, నార్సింగ్ సమీపంలో పుప్పాలగూడ వద్ద ఓ చెరువును ప్రైవేటు భూమిగా చూపి రియల్టర్ల చేతిలో పెట్టారనే అంశాల మీద ఈడీకి ఫిర్యాదులు అందినట్లు చర్చ జరుగుతోంది. అబ్దుల్లాపూర్‌మెట్‌లో అంధుల పాఠశాలకు చెందిన 30 ఎకరాలను ఓ వ్యక్తి పేరు మీద పట్టా చేశారని, దివ్యాంగులు తిరుగుబాటు చేయడంతో ఆయన తర్వాత కలెక్టర్‌గా వెళ్లిన మరొకరు రద్దు చేశారని ఈడీకి సమాచారం అందింది. గండంగూడలో ఓ వ్యక్తి పేరుతో 9 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టా ఇచ్చారని, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో తరువాత రద్దు చేశారనే విషయాలు చర్చకు వచ్చాయి.

పాతకక్షలతోనే గంగారెడ్డి హత్య

- జీవన్‌రెడ్డి అనుచరుడి హత్య కేసు నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు.. కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ నేత మారు గంగారెడ్డి హత్య కేసు నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భూతగాదాలు, పాత కక్షల నేపథ్యంలోనే గంగారెడ్డిని సంతోష్ అనే వ్యక్తి దాడి చేసి చంపాడని ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు. కేసు వివరాలను ఓ ప్రకటనలో తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన మారు గంగారెడ్డి(58), అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్‌కు మధ్య భూతగాదాలున్నాయి. 2020లో గ్రామంలో జరిగిన ఓ గొడవ విషయంలో సంతోష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. అయితే గంగారెడ్డి ప్రమేయంతోనే తనపై కేసు నమోదైందని సంతోష్ పగ పెంచుకున్నాడు. ఇదే కక్షతో ఈనెల 22న జాబితాపూర్‌లో బైక్‌పై వెళ్తున్న గంగారెడ్డిని కారుతో ఢీ కొట్టి కత్తితో పొడిచి హత్యకు పాల్పడ్డాడు. అనంతరం నిందితుడు సంతోష్ సంఘటన స్థలంలోనే కారుతో పాటు మొబైల్, కత్తి వదిలి పారిపోయాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ టీవీ కెమెరాల్లోనూ రికార్డయ్యాయి. గంగారెడ్డి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు అదే రోజు సంతోష్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడు సంతోష్‌ను శుక్రవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ హత్య కేసులో ఇతరుల ప్రమేయం ఉందా లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఒక్కసారి చార్జ్ చేస్తే.. 170 కి.మీ ప్రయాణం

బైక్‌ను విడుదల చేసిన ప్యూర్ ఈవీ.. ఐఐటీ-హెచ్‌లో స్టార్టప్ ఇన్వెస్టర్ల సదస్సు


ప్యూర్ ఈవీ తయారు చేసిన ఇట్రిస్ట్-ఎక్స్ బైక్

కంది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ-హెచ్ స్టార్టప్ సంస్థ ప్యూర్ ఈవీ ఇట్రిస్ట్-ఎక్స్ ఎలక్ట్రిక్ బైక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది 5-6 గంటలు చార్జింగ్ పెడితే 90 కి.మీ. వేగంతో 171 కి.మీ. వెళుతుందని ప్యూర్ ఈవీ వ్యవస్థాపకుడు నిశాంత్ దొంగరి తెలిపారు. ఈ బైక్‌లోని బీఎల్‌డీసీ హబ్ మోటారు తక్కువ వోల్టేజీ కరెంటు ఉన్నా.. చార్జ్ అవుతుందని చెప్పారు. బండి పంక్చర్ అయితే సెన్సార్లు గుర్తిస్తాయని.. రైడర్ బండి దిగి బ్యాటరీ సహాయంతో బండిని నెమ్మదిగా తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. దీనికి రివర్స్ మోడ్ కూడా ఉందని వెల్లడించారు. ఈ బైక్ ధర రూ.1.40 లక్షలు ఉంటుందని తెలిపారు. స్టార్టప్ సంస్థలు, వ్యాపార పెట్టుబడిదారులను ఒక వేదికపైకి తీసుకురావడానికి సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శుక్రవారం ప్యూర్‌ఈవీ-వీసీ సర్కిల్ సంస్థలు సంయుక్తంగా ది పిచ్ పేరుతో స్టార్టప్ ఇన్వెస్టర్ల సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 35 మంది విదేశీ పెట్టుబడిదారులతో పాటు 130 మంది వ్యవస్థాపకులు, 60 స్టార్టప్ సంస్థలు హాజరయ్యాయి. స్టార్టప్ సంస్థలకు నిధుల సమీకరణ లక్ష్యంగా నిర్వహించిన ఈ సమ్మిట్‌లో ఆటోమొబైల్ రంగంలో స్టార్టప్ సంస్థలకు ఉన్న అవకాశాలు, పెట్టుబడిదారులు తదితర అంశాలపై స్టార్టప్ సంస్థల ప్రతినిధులు చర్చలు జరిపారు. అనంతరం వీసీ సర్కిల్ ప్రతినిధులతో కలిసి ప్యూర్‌ఈవీ వ్యవస్థాపకుడు నిశాంత్ ఐఐటీహెచ్ ఆడిటోరియంలో దేశవ్యాప్త ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన వైట్ కాలర్‌ను విడుదల చేశారు.

ఇంకెంతకాలం మాలలను అణచివేస్తారు?

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్
- భద్రాద్రిలో మాలల మహాపాదయాత్ర ప్రారంభం


ర్యాలీని ప్రారంభిస్తున్న మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి రమేష్

భద్రాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దళితులకు రాజ్యాంగ అధికారం దక్కకూడదనే కుట్రతోనే ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగలేదని, న్యాయస్థానాలు.. మనువాదుల జేబు సంస్థలుగా మారాయని ఆయన విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శుక్రవారం మాలల మహాపాదయాత్ర ప్రారంభమైంది. భద్రాద్రి నుంచి హైదరాబాద్ వరకు చేపడుతున్న ఈ యాత్రను జాతీయ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ జెండా ఊపి ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ, న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్రంలో అమలు సాధ్యమా, కాదా అనే విషయాన్ని పరిశీలించకుండా.. వర్గీకరణ వెంటనే అమలుచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్రంలో మాదిగలు, మాలలు జనాభాపరంగా సమానంగా ఉన్నారని, అయినా మాలలను తక్కువ చేసి చూపుతున్నారని వాపోయారు. ఏ రీతిన వర్గీకరణ చేపడుతుందో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. 38 రోజుల పాటు కొనసాగే మాలల మహాపాదయాత్ర డిసెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించబోయే మాలల మహాసంగ్రామ సభతో ముగియనుంది.

మాలలతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కు

- అందుకే వర్గీకరణలో తీవ్రజాప్యం: మందకృష్ణ

ఖమ్మంటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మాలలతో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కై ఎస్సీ వర్గీకరణ అమలులో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. దీనివల్ల మాదిగలకు ఉద్యోగ నియామకాలలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన మాదిగల ధర్మ యుద్ధ సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని ప్రకటించిన రేవంత్‌రెడ్డి, మాలలతో కుమ్మక్కై అమలుకు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మాలలకు వ్యతిరేకంగా పని చేస్తే పదవి కోల్పోవలసి వస్తుందని ఆయన భయపడుతున్నారని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాల సామాజిక వర్గానికి చెందినవారు కావటమే దీనికి కారణమని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా వర్గీకరణను అమలుచేయకపోవటంతో ఇటీవల జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఈ నెల 30 వరకు తెలంగాణలోని జిల్లాల్లో ధర్మయుద్ధం సభలు నిర్వహిస్తామని చెప్పారు.

అటవీ శాఖ ఉద్యోగిపై దాడి

కాకతీయఖని, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అటవీ భూమిలో పోడును అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్టు ఉద్యోగిపై దాడి జరిగింది. భూపాలపల్లి జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎఫ్ఆర్వో నరేష్ బస్వ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి- చెల్పూరు రేంజ్‌ల పరిధిలోని కమలాపూర్, పెద్దాపూర్ మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో కొందరు పోడు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఫారెస్టు సిబ్బంది గురువారం అర్ధరాత్రి అక్కడికి వెళ్లారు. కొందరు వ్యక్తులు డోజర్ల ద్వారా భూమిని చదును చేస్తుండగా అడ్డుకున్నారు. మూడు డోజర్లను స్వాధీనం చేసుకొని వస్తున్న క్రమంలో మార్గమధ్యలో పోడుదారులకు చెందిన కొందరు చీకట్లో దాడి చేసి, అక్కడి నుంచి పరారయ్యారు. ఈదాడిలో చెల్పూరు బేస్ క్యాంపు ఉద్యోగి సురేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన వ్యక్తులను ఇంకా గుర్తించలేదని ఎఫ్ఆర్వో తెలిపారు. అటవీ భూమిని చదును చేస్తున్న కమలాపూర్ గ్రామానికి చెందిన డోజర్ అజ్మీరా దినేష్, ఓనర్లు శ్రీను, సంపత్, సంతోష్‌ను ఘటన స్థలంలోనే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఇదే కేసులో పిత్ర సమ్మయ్య అనే వ్యక్తిని కూడా ఆ తర్వాత అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ నలుగురిపై అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వివరించారు.

శ్రీనివాస్ గౌడ్ సోదరుడి లొంగుబాటు

- శ్రీకాంత్ గౌడ్‌ను ఠాణా వద్ద వదిలి వెళ్లిన మాజీ మంత్రి


శ్రీకాంత్ గౌడ్

మహబూబ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నకిలీ పట్టాలు సృష్టించి ఇళ్ల పట్టాలు విక్రయించారనే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ సోదరుడు శ్రీకాంత్ గౌడ్ శుక్రవారం సాయంత్రం పోలీసులకు లొంగిపోయారు. శ్రీనివాస్ గౌడ్ తన కారులోనే సోదరుడిని తీసుకొచ్చి మహబూబ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్ వద్ద వదిలి వెళ్లారు. మహబూబ్‌నగర్‌లోని క్రిష్టియన్‌పల్లి 523 సర్వే నెంబర్‌లోని భూములకు నకిలీ పట్టాలు సృష్టించి, ఇంటి పట్టాలు అమ్ముకున్న కేసులో మహబూబ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్‌లో రెండు నెలల క్రితం నలుగురిపై కేసు నమోదైంది. ఈ కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న శ్రీకాంత్‌గౌడ్ మినహా మిగతా ముగ్గురు ఇప్పటికే రిమాండ్ అయ్యారు. కేసు నమోదైనప్పటి నుంచి పరారీలో ఉన్న శ్రీకాంత్ గౌడ్ ముందస్తు బెయిల్ కోసం తొలుత హైకోర్టు, ఆ తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. దీంతో మరో దారి లేక పోలీసులకు లొంగిపోయారు. శ్రీకాంత్ గౌడ్‌ను విచారించిన తర్వాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని సీఐ గాంధీ నాయక్ తెలిపారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శుక్ర, శనివారాల్లో సెలవులో ఉండటంతో శ్రీకాంత్ గౌడ్‌ను అచ్చంపేట ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట శనివారం హాజరు పరిచే అవకాశం ఉంది.

కేయూలో హాస్టల్స్ విద్యార్థినుల ఆందోళన

కేయూక్యాంపస్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం రాత్రి పద్మాక్షి హాస్టల్స్ విద్యార్థినులు వర్సిటీ మొదటి గేటు ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమను ఉన్నపళంగా వర్సిటీ హాస్టల్స్ నుంచి ఖాళీ చేసి వెళ్లి పోవాలని వర్సిటీ హాస్టల్స్ అధికారులు చెప్పడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వర్సిటీ హాస్టల్స్ సిబ్బంది తమ వస్తువులను గదుల నుంచి బయటి వేసి వెళ్లి పోవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై గంటకు పైగా బైఠాయించి వర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలకు ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్, ఇతర విద్యార్థి సంఘాల నేతలు మద్దతు ప్రకటించి ఆందోళనల్లో పాల్గొన్నారు. విద్యార్థుల నిరసన ఆందోళనలతో వర్సిటీ ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చిలివేరు రాజ్‌కుమార్, వర్సిటీ ఇన్స్‌పెక్టర్, ఎస్సై రవీందర్‌లు పోలీస్ సిబ్బందితో విద్యార్థుల వద్దకు వచ్చి సముదాయించారు. శనివారం విద్యార్థినీల హాస్టల్స్ ఖాళీ విషయంపై చర్చిద్దామని ఇప్పుడూ నిరసన ఆందోళనలు విరమించాలని కోరారు. దీంతో విద్యార్థినీలు తాత్కాలికంగా శాంతించి ఆందోళన విరమించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అమెరికా అధ్యక్ష ఎన్నికలు మరింత దగ్గరకొచ్చిన తరుణంలో, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మీద వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనాన్ని ప్రచురించింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో రెండేళ్ళనుంచి ఎలాన్ మస్క్ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారని, వ్యక్తిగత అంశాలనుంచి వ్యాపార వాణిజ్యాలు, యుద్ధాలు, అంతర్జాతీయ సంబంధాలు కూడా వారిద్దరూ చర్చించుకుంటున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆరోపించింది. మస్క్‌తో వ్లాదిమిర్ పుతిన్ ఒక సందర్భంలో చైనాకు అనుకూలంగా మాట్లాడారని, స్టార్‌లింక్ శాటిలైట్ నెట్‌వర్క్‌ను తైవాన్ మీద యాక్టివేట్ చేయకుండా చైనాకు సహకరించమని చెప్పారని సదరు పత్రిక రాసింది. పుతిన్‌తో మస్క్ సాన్నిహిత్యం పతాకస్థాయిలో ఉన్నదని ఈ కథనం సారాంశం. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు తన స్టార్‌లింక్ ద్వారా ఎలాన్ మస్క్ సహకరిస్తున్నాడని ఇప్పటికే ఆరోపణలు రావడం, అవన్నీ అబద్ధాలని ఈ టెస్లా అధినేత ఖండించడం తెలిసిందే. ఈ కొత్త కథనాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి కొట్టిపారేశారు. గతంలోనూ పుతిన్‌తో మస్క్ మాట్లాడారన్న ఆరోపణలు రావడం, అవి నిజం కాదని రష్యా అనడం తెలిసిందే. 2022లో ఒకే ఒక్కసారి వారిద్దరి మధ్యా అది కూడా అంతరిక్ష రంగానికి సంబంధించి మాత్రమే సంభాషణ జరిగిందని రష్యా అప్పట్లో చెప్పింది. అయితే, రష్యా అధ్యక్షుడితో మస్క్ సంబంధాల గురించి, కీలకమైన అంశాలతో వెలువడిన ఈ వాల్‌స్ట్రీట్ కథనం దేశ భద్రతకు సంబంధించి అమెరికా ప్రభుత్వానికి పరోక్షంగా ఓ సవాల్ విసిరింది. స్పేస్ ఎక్స్ సహా మస్క్‌కు చెందిన చాలా సంస్థలు అమెరికా సైన్యంతోనూ, ప్రభుత్వ సంస్థలతోనూ భాగస్వామ్యంలోనూ, విస్తృతమైన లావాదేవీల్లోనూ ఉన్న విషయం తెలిసిందే. దాదాపు మూడువందలకోట్ల డాలర్ల ఒప్పందాల కారణంగా, మస్క్ సంస్థల వద్ద అత్యంత కీలకమైన సమాచారం ఉంటుంది. ప్రభుత్వ విభాగాలన్నీ ఆయన స్టార్‌లింక్ సేవలను వినియోగించుకుంటున్నాయి. కనుక, పుతిన్‌తో సాన్నిహిత్యం మీద ఈ కొత్త కథనం చిన్న విషయమేమీ కాదు.

ఎన్నికల వేళ...!

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నూ, ఆయన మళ్ళీ అధ్యక్షుడు కావడానికి కోట్లు కుమ్మరిస్తున్న ప్రపంచ కుబేరుడు మస్క్‌నీ ఏకకాలంలో గురిపెట్టిన కథనం ఇది. అమెరికా బద్ధశత్రువు పుతిన్‌తో ట్రంప్‌కు అవధులు లేని దోస్తీ ఉన్నదని, ట్రంప్ తొలి విజయంలోనూ పుతిన్ హస్తం ఉన్నదని అప్పట్లోనే అనేక కథనాలు వచ్చాయి. గత ఎన్నికల్లో ఆఖరుక్షణం వరకూ ఆయనను నిలబెట్టేందుకు పుతిన్ రహస్య కుట్రలు చేశారన్న విమర్శలూ వచ్చాయి. అమెరికా అధ్యక్షుడుగా దిగిపోయిన తరువాత కూడా ట్రంప్–పుతిన్ మధ్య రహస్యబంధం కొనసాగుతోందని చాలా కథనాలు వచ్చాయి. పాత్రికేయుడు బాబ్‌వుడ్‌వర్డ్ తన పుస్తకంలో, పుతిన్‌కు ట్రంప్ కొవిడ్ టెస్ట్ కిట్లు పంపించారని, ఇద్దరూ రోజూ చాటింగ్ చేసుకుంటారని రాశారు. కొవిడ్ కిట్లు పంపిన మాట నిజమే కానీ, టచ్‌లో ఉండటం మాత్రం అబద్ధమని రష్యా అంటోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా సాగుతున్న పలువిచారణల్లో అమెరికా అంతర్గత వ్యవహారాల్లో పుతిన్ జోక్యం, పదవీచ్యుతుడైన తరువాత పుతిన్‌తో సంబంధాల అంశం కూడా ఉన్నాయి. ఇప్పుడు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడైన మస్క్ సైతం శత్రువు చేయి కలిపాడని అంటోంది. తాను రేపు అధికారంలోకి వస్తే మస్క్‌కు సమస్త వ్యవస్థలను ప్రక్షాళించే కీలకమైన పదవిని కట్టబెడతానని ట్రంప్ గతంలోనే ప్రకటించారు. మంత్రికావచ్చు లేదా సలహాదారుగా చక్రం తిప్పవచ్చు అని ముందే ప్రకటించారు. ట్రంప్ అధ్యక్షుడైతే సెల్ఫ్ డ్రైవింగ్ కార్లకు సంబంధించిన నిబంధనల సడలింపు సహా తాను ఏయే ప్రతిపాదనలు చేయబోతున్నానో మస్క్ కూడా సెలవిచ్చారు. తాను అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుందని ట్రంప్ హామీ ఇవ్వడం, ఉక్రెయిన్ కొన్ని భూభాగాలను రష్యాకు వదులుకొని, నాటోలో చేరనని హామీ ఇవ్వాలంటూ మస్క్ ప్రతిపాదించడం తెలిసిన విషయాలే. ఉక్రెయిన్‌తో యుద్ధంలో తన స్టార్‌లింక్ సాటిలైట్ సర్వీసుల ద్వారా రష్యాకు కీలకమైన సమయాల్లో మస్క్ సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ప్రస్తుతం ట్రంప్ పక్షాన మస్క్ స్వయంగా ఎన్నికల ప్రచారంలోకి దిగడమే కాక, వందలకోట్ల డాలర్ల విరాళాలు ఇస్తున్నారు. కీలకమైన రాష్ట్రాల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఏవేవో పథకాలు, ప్రతిపాదనలతో డబ్బు ఎరవేస్తున్నారు. అమెరికా ఓటర్లమీద మస్క్ విన్యాసాలు, ఈ సరికొత్త కథనం ఏ మేరకు ప్రభావితం చూపుతాయో తెలియదు. కానీ, పరుగుపందెంలో విజేత ఎవరో తేలిపోతున్న ఈ ఆఖరుక్షణంలో ప్రత్యర్థుల పక్షాన ఇటువంటి కుట్రకథనాలు రావడంలో ఆశ్చర్యమేమీ లేదు అని రష్యా చేసిన వ్యాఖ్య మాత్రం విచిత్రమైనది.

సరిహద్దుపై సయోధ్య సాధ్యమేనా?

చైనా మహా నాయకుడడు మావో గురించి అనేక ఐతిహ్యాలు ఉన్నాయి. నాకు బాగా ఇష్టమైనది: అమెరికా పాత్రికేయుడు, సుప్రసిద్ధ 'రెడ్‌స్టార్ ఓవర్ చైనా' గ్రంథకర్త ఎడ్గార్ స్నో కాబోలు ఒకసారి మావోను 'మానవాళి చరిత్రపై ఫ్రెంచ్ విప్లవం ప్రభావం ఏమిటి?' అని ప్రశ్నించగా ఆయన కొంచెంసేపు ఆలోచనామగ్నుడై 'ఇప్పుడే చెప్పలేము' అని అన్నారట.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

చైనా వేచి ఉంది. చాలా ఓర్పు గల దేశమది. ప్రపంచంలో రెండో పెద్ద ఆర్థిక వ్యవస్థ తమది అని గొప్పలు చెప్పుకోదు. ప్రపంచ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ప్రభవించేందుకు ఒక నిర్దిష్ట తేదీని చైనా నిర్దేశించుకోలేదు. ప్రపంచ అగ్రగామిగా ఆవిర్భవిస్తున్న దేశంలో అటువంటి గుణ విశేషాలు అరుదు. మరో పార్శ్వం నుంచీ చైనాను చూద్దాం. అది ప్రజాస్వామిక వ్యవస్థ కాదు. ప్రజాస్వామిక దేశాలలో అందరికీ లభించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు చైనా ప్రజలకు లేవు. చైనాకు భిన్నంగా భారత్ చాలవరకు ఒక ప్రజాస్వామిక దేశం. నిత్యం ఒక క్రమబద్ధమైన అరాచకంతో కోలాహలంగా ఉంటుంది. జగడాలకు జనులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. భారత్‌లో చిన్న చిన్న సాఫల్యాలకే పెద్ద ఎత్తు విజయోత్సవాలు జరుపుకోవడం పరిపాటి. ఉదాహరణకు ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో మన దేశానికి లభించిన పతకాలు ఎన్నో చూడండి: అమెరికా 40 స్వర్ణ, 44 రజత, 42 కాంస్య పతకాలను గెలుచుకున్నది. చైనాకు 39 స్వర్ణ, 27 రజత, 24 కాంస్య పతకాలు లభించాయి మరి మనకో? ఒలింపిక్ పతకాలను గెలుచుకోవడంలో 71వ స్థానంలో ఉన్న భారత్‌కు స్వర్ణ పతకాలు పూజ్యం, 1 రజత, 5 కాంస్య పతకాలు లభించాయి. అమెరికా, చైనాలో కంటే మన దేశంలోనే వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి!

హిమాలయ పొలిమేరలో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) వెంబడి గస్తీ ఏర్పాట్ల విషయమై కొద్ది రోజుల క్రితం కుదిరిన ఒప్పందాన్ని భారత్, చైనాలు ప్రకటించిన తీరును గమనిస్తే రెండు దేశాల మనోవైఖరులలో వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. మే 2020లో సంభవించిన ఘర్షణల అనంతరం ఉభయ దేశాల మధ్య చోటుచేసుకున్న తొలి సానుకూల పరిణామం ఆ ఒప్పందమే. భారత్ తరఫున మన విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు; విదేశాంగమంత్రి ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు; సైనిక దళాల ప్రధానాధికారి ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆ ఒప్పందం గురించి ప్రస్తావించారు. 'మే 2020కు ముందు నాటి పరిస్థితులకు మళ్లామని' విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. అయితే సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ మనోజ్ పాండే ఇలా చెప్పారు: 'ఏప్రిల్ 2020 నాటి యథా పూర్వస్థితి తిరిగి నెలకొనాలని మనం కోరుకుంటున్నాం. ఆ పరిస్థితులు నెలకొన్న తరువాత ఉద్రిక్తతల సడలింపు, బలగాల ఉపసంహరణ, వాస్తవాధీన రేఖ వెంబడి మామూలు పరిస్థితుల నిర్వహణ మొదలైన అంశాలపై శ్రద్ధ చూపుతాం'. చైనా తరఫున ఆ దేశ విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ ఒప్పంద యథార్థాలను తెలుపుతూ ఒక ప్రకటన చేశారు. 'సరిహద్దులకు సంబంధించిన వ్యవహారాలపై దౌత్య, సైనిక వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నాయి. సరిహద్దు సంబంధిత వివాదంపై రెండు దేశాలు ఇప్పుడు ఒక పరిష్కారానికి వచ్చాయి. దాని పట్ల చైనా సానుకూల వైఖరితో ఉన్నది. తదుపరి దశలో చైనా ఆ పరిష్కారాన్ని అమలుపరిచేందుకు భారత్‌తో కలిసి చైనా పని చేస్తుంది'. అయితే ఎలా పని చేస్తుందనే విషయమై వివరాలు వెల్లడించేందుకు ఆయన నిరాకరించాడు.

సరే, గత ఆదివారం (20, అక్టోబర్) దాకా ఉన్న పరిస్థితిని గుర్తు చేసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. మార్చి–ఏప్రిల్ 2020లో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ దళాల వాస్తవాధీన రేఖను దాటి భారత భూభాగాల్లోకి చొరబడ్డాయి. ఈ దురాక్రమణ మే 5, 2020న భారత్ దృష్టికి వచ్చింది చొరబాటుదారులను వెనక్కి తిప్పికొట్టే క్రమంలో 20 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చైనా పక్షాన కచ్చితంగా తెలియని సంఖ్యలో సైనికులు చనిపోయినట్టు తెలుస్తుంది. జూన్ 19, 2020న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. తన ముగింపు సమావేశంలో ఆయన ఈ అప్రతిష్ఠాకర వ్యాఖ్యలు చేశారు: 'బయటి వ్యక్తులు ఎవరూ భారత భూభాగంలోకి చొరబడలేదు. బయటివారు ఎవరూ భారత్ లోపల లేరు'. అయితే మన సైనిక దళాలు మే 2020కు పూర్వం నిత్యం గస్తీ తిరిగిన దాదాపు 1000 చదరపు కిలోమీటర్ల ప్రాంతంపై భారత్‌కు ఇంకెంత మాత్రం ఎలాంటి నియంత్రణ లేదని పలువురు సైనికాధికారులు, రక్షణ వ్యవహారాల నిపుణులు ఘంటాపథంగా చెప్పుతున్నారు.

కఠోరమైన విషయమేమిటంటే గల్వాన్ లోయ అంతా తమదేనని చైనా వాదిస్తోంది. వాస్తవాధీనరేఖ విషయమై భారత్‌లో స్పష్టత లోపించిందని విమర్శిస్తోంది. హాట్ స్ప్రింగ్స్ ప్రాంతానికి సంబంధించి ఒక్క అంగుళం కూడా భారత్‌కు చెందదని చైనా నిక్కచ్చిగా అంటోంది. డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాలపై చర్చలు జరపాలని భారత్ డిమాండ్ చేస్తుండగా చైనా నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. భారత్‌తో 3,448 కిలోమీటర్ల పొడవునా ఉన్న సరిహద్దులోని అక్సాయిచిన్ ప్రాంతంలో సైనిక స్థావరాలను చైనా భారీ ఎత్తున ఏర్పాటు చేస్తోంది. వాస్తవాధీన రేఖ దాకా 5జి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తోంది. పాంగోంగ్ సో నదిపై ఒక వంతెనను నిర్మించింది. పెద్ద ఎత్తున సైనిక సామగ్రి, సైనిక దళాలను పెద్ద ఎత్తున వాస్తవాధీన రేఖ వెంబడి మోహరించింది.

మన అధికారిక వైఖరి ఏమిటో చూద్దాం. ఇంతకు ముందున్న పరిస్థితి అంటే మే 2020కు పూర్వ స్థితిని పునరుద్ధరించినట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది సైనిక దళాల ఉపసంహరణ, ఉద్రిక్తతల సడలింపు మొదలైన పదాలు ప్రభుత్వ ప్రకటనలలో ఉంటున్నాయి. ఏమైనా మన ప్రభుత్వం గొప్ప ఓర్పు, గట్టి పట్టుదల చూపిందని చెప్పవచ్చు. అయినా గస్తీ సంబంధిత ఒప్పందం నిజంగా ఉంటే అందులో 'ఇంతకు ముందున్న పరిస్థితి' అనే మాటకు బదులు 'కీలకమైన పురోగతి' అనే మాటను వాడాలని చైనా పట్టుబట్టి ఉండేది కాదా? చైనా ఎప్పుడు ఏ విధంగా ప్రవర్తిస్తుందనేది ఒక సందిగ్ధ విషయం. అయినప్పటికీ మన ప్రభుత్వం దృఢ వైఖరితో నిలబడడం వల్ల అంతిమంగా మనకు మేలు జరిగేందుకు ఎంతైనా ఆస్కారమున్నది.



> గత నాలుగు సంవత్సరాలుగా పార్లమెంటులో ఒక్కసారి కూడా భారత్–చైనా ఘర్షణలపై చర్చించేందుకు అనుమతించకపోవడం మన ప్రజాస్వామ్యానికి ఒక కళంకం. సరిహద్దుల్లో గస్తీపై ఒప్పందం విషయంలో అత్యంత జాగరూకతతో ఉండాలని రక్షణ వ్యవహారాల నిపుణులు ముక్తకంఠంతో చెప్పుతున్నారు. భారత్ చైనాలు సరిహద్దు వివాదాన్ని సంప్రదింపుల ద్వారా సమగ్రంగా పరిష్కరించుకునేందుకు ఆ ఒప్పందం దారితీస్తుందా? ఇప్పుడే ఇదమిత్థంగా చెప్పలేము.

మొత్తం మీద హిమాలయ సరిహద్దుల్లో గస్తీ ఏర్పాట్ల విషయమై భారత్, చైనాలు ఒక అంగీకారానికి వచ్చినట్టు కనిపిస్తోంది. అంతకుమించి ఏమీ లేదు అని అనుకోవచ్చు. చైనా వైపు, మన వైపు గస్తీ దళాల మధ్య సమన్వయముంటుంది. నెలకు రెండుసార్లు సమావేశమవుతాయి. గస్తీ బృందాలు ఒక్కో దానిలో ఉండే సైనికుల సంఖ్య 15కు మించదు. ఈ గస్తీ ఏర్పాట్లు డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాలకు సైతం వర్తిస్తాయా అన్నది స్పష్టంగా తెలియదు. తూర్పు లద్దాఖ్‌లోని డెమ్‌చోక్ విషయంలో 2017లో ఉభయ దేశాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అయితే ఆ తరువాత చైనా సైనిక దళాలు ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాయి. అక్కడ తమ సైనిక స్థావరాలను పటిష్ఠం చేసుకున్నాయి. డెప్సాంగ్ మైదాన ప్రాంతాలలో వై జంక్షన్‌కు ఆవల ప్రదేశాలలోకి భారత సైనికులు ప్రవేశించేందుకు చైనా అనేక అవరోధాలు కల్పిస్తోంది. ఏనాటి నుంచో ఉన్న 10, 11, 11ఎ, 12, 13 గస్తీ కేంద్రాల పరిధిలోని ప్రదేశాలలోకి కూడా అనుమతించడం లేదు. గల్వాన్ లాంటివి ఇరు దేశాల మధ్య ఘర్షణలకు కారణమవుతున్నాయి. అలాగే పాంగోంగ్ సో నది ఉత్తర, దక్షిణ తీర ప్రాంతాలు, హాట్‌స్ప్రింగ్స్ మొదలైన వాటిపై కూడా చైనా నియంత్రణ కొనసాగుతోంది. ఉభయ దేశాల మధ్య తీవ్రస్థాయిలో ఉన్న ఈ వివాదాస్పద అంశాలకు నిజంగా పరిష్కారం లభించిందా? భవిష్యత్తులో లభించగలదా? లభించిందని లేదా లభించగలదని విశ్వసించడం చాలా కష్టం. చెప్పవచ్చినదేమిటంటే భారత్, చైనాల మధ్య సంబంధాలలో పరస్పర అపనమ్మకం ఇప్పటికీ ఒక అంతర్వాహినిగా ఉన్నది.

గత నాలుగు సంవత్సరాలుగా పార్లమెంటులో ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా భారత్–చైనా ఘర్షణలపై చర్చించేందుకు అనుమతించకపోవడం మన ప్రజాస్వామ్యానికి ఒక కళంకం. సరిహద్దుల్లో గస్తీపై ఒప్పందం విషయంలో అత్యంత జాగరూకతతో ఉండాలని రక్షణ వ్యవహారాల నిపుణులు ముక్తకంఠంతో చెప్పుతున్నారు; కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన, ఉపయుక్తమైన ప్రశ్నలు లేవనెత్తింది; ఇతర విపక్షాలు మౌనంగా ఉండిపోయాయి. భారత్, చైనాలు సరిహద్దు వివాదాన్ని సంప్రదింపుల ద్వారా సమగ్రంగా పరిష్కరించుకునేందుకు అక్టోబర్ ఏకాభిప్రాయం (అక్టోబర్ కన్సెన్సస్) పురిగొల్పుతుందా? ఇప్పుడే ఇదమిత్థంగా చెప్పలేము.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఇది కూల్చివేతల ప్రభుత్వం!

పేదల సంక్షేమమే ధ్యేయమని ఎన్నికల్లో హామీ ఇచ్చి తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ పేదల మీదే ప్రతాపాన్ని చూపుతోంది. హైడ్రా పేరిట, మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూల్చివేసే తతంగం చేపట్టి వారిని భయాందోళలకు గురిచేస్తోంది. తమది ప్రజాప్రభుత్వం అని ఘనంగా చాటుకుంటున్న కాంగ్రెస్ ఆచరణ మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వం ఏదైనా ఒక పథకాన్ని, కార్యక్రమాన్ని, ప్రాజెక్టును చేపట్టినప్పుడు దాని మంచి చెడుల గురించి పూర్తిగా ఆలోచించాలి. సమగ్ర అధ్యయనంతో పాటు నిపుణుల సలహాలు సూచనలు తీసుకోవాలి. రాజకీయ సమస్యలు లేకుండా అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి తమ ఉద్దేశాలను వెల్లడించాలి. కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణి అందుకు భిన్నంగా ఉంది.

చెరువుల పరిరక్షణ కోసం అంటూ హైడ్రాను ప్రారంభించింది. దానికి చట్టబద్ధత కల్పించకముందే, విధివిధానాలను నిర్దేశించకముందే నేరుగా రంగంలోకి దిగి కూల్చివేతలను ప్రారంభించింది. తొలుత భవన సముదాయాలు అంటూ ఆ తర్వాత చెరువుల పూర్తిస్థాయి మట్టం (ఫుల్‌ట్యాంక్ లెవెల్ – ఎఫ్‌టీఎల్), దానిని ఆనుకొని ఉన్న ప్రవాహ ప్రాంతం (బఫర్ జోన్)లో ఉన్న నిర్మాణాలు అక్రమంగా ఉన్నాయంటూ బుల్డోజర్లను పంపించింది. ముందుగా ఒక ఎమ్మెల్యే, మరో సినీ నటునికి సంబంధించిన భవనాలు కూల్చివేత జరగడంతో ప్రభుత్వం పెద్దవారిపైనే దృష్టి సారించిందనే భావన ఏర్పడింది. అయితే అది నివాస అపార్ట్‌మెంట్లపైనా దృష్టి పెట్టి కూల్చివేతలను చేపట్టడంతో అందులో నివసిస్తున్న వారిపై తీవ్ర ప్రభావం పడింది. ఊళ్లలో పొలాలు అమ్మి, బ్యాంకుల్లో అప్పులు చేసి కొనుగోలు చేసిన నివాస ప్లాట్లను హైడ్రా కూల్చివేసింది. మరో వైపు పేదల ఇళ్ల కూల్చివేతలను చేపట్టింది. తాము దీర్ఘకాలికంగా నివసిస్తున్న ఇళ్లను, షెడ్లను కూల్చివేస్తున్నారని పేదలు కన్నీళ్ల పర్యంతమైనా వినలేదు. వాస్తవానికి ఆయా ప్లాట్లలో, ఇళ్లలో నివసిస్తున్నవారు అన్ని అనుమతులు, ధ్రువీకరణలతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని, నెలనెలా కిస్తీలు చెల్లిస్తున్నారు. ఆస్తిపన్ను, నీరు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. వీటికి అన్నింటికీ ప్రభుత్వ శాఖలే అనుమతులు ఇస్తున్నాయి. తద్వారా ఛార్జీలను పొందుతున్నాయి. కూల్చివేతల ద్వారా ప్రభుత్వానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందోగానీ పేదలకు మాత్రం తీరని వేదన కలిగింది. కూల్చిన ఇళ్లకు బీమా రాదు. బ్యాంకులకు కిస్తీలు చెల్లించాల్సిందే. వారికి రుణభారం తీరదు. ఈ కోణంలో ప్రభుత్వం ఆలోచించలేదు. భవన సముదాయాలు కట్టి విక్రయించిన బిల్డర్లకు, అనుమతులు ఇచ్చిన అధికారులకు ఎలాంటి నష్టం కలగలేదు. బాధితుల గోస అరణ్య రోదనగానే మిగిలింది.



> హైడ్రా కింద నిజంగా ఆక్రమణల తొలగింపే లక్ష్యమయితే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల చుట్టూ ఉన్న ఫాంహౌస్‌లను తొలగించాలి. వీటిలో ఎక్కువ అధికార పార్టీకి సంబంధించినవి ఉండగా ఒక్కదాని మీదా సర్వే జరగలేదు. రాజకీయంగా వైరి పక్షానికి చెందిన ఫాంహౌస్‌ల వద్ద హడావిడి చేశారు. కేంద్ర ప్రభుత్వం విపక్షాలను లక్ష్యంగా చేసుకొని ఆదాయపన్ను, ఈడీ, సీబీఐ దాడులు చేయడం ఆనవాయితీ కాగా హైడ్రా, మూసీల ప్రాజెక్టుల లక్ష్యం కూడా ఇదేనని విమర్శలు వస్తున్నాయి.

ఒకవైపు హైడ్రా బీభత్సం కొనసాగుతుండగానే ప్రభుత్వం రూ. లక్షన్నర కోట్ల అంచనాతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టును చేపట్టింది. మొత్తం ఆక్రమణలు తొలగించి మూసి నదిని ప్రక్షాళన చేస్తామని, నగరానికి ముంపును నివారిస్తామని ప్రకటించింది. తీరా అది హైడ్రా దారిలోనే కూల్చివేతల దారిపట్టింది. మూసీ ఒడ్డున ఉన్న ఇళ్లకు మార్కింగ్ నంబర్లు వేసి కూల్చివేతలు ప్రారంభించింది. దీనిపై ప్రజల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తంకావడంతో అక్కడ ఉన్న వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించినట్లు ప్రకటించి, వారిని హడావిడిగా తరలించే ప్రక్రియను చేపట్టింది. మూసీ ప్రాజెక్టు ప్రక్షాళనకు ఆది నుంచి ప్రభుత్వాలు ఆలోచనలు చేస్తున్నాయి. 2021లో మూసీపై బీఆర్ఎస్ ప్రభుత్వం సమావేశాలు నిర్వహించి మూసీకి 50 మీటర్ల దూరంలో బఫర్ జోన్‌ను నిర్ణయించింది. అప్పట్లో మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. బీఆర్ఎస్ హయాంలోనే మూసీ సరిహద్దులను ఫిక్స్ చేశారు. కొత్తగా ఆక్రమణలకు అవకాశం ఇవ్వకుండా ఎలాంటి కూల్చివేతలు లేకుండా నాగోలు తదితర ప్రాంతాల్లో సుందరీకరణను అది చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు కొత్త రూపుతెచ్చింది. నేరుగా ఇళ్లను కూల్చివేయడమనే భావన కలిగించడంతో అన్ని పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమయింది. ఎన్నో ఏళ్లుగా తమకు నీడనిచ్చిన గూడును కూల్చేస్తుంటే నిర్వాసితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

హైడ్రా, మూసీ ప్రాజెక్టుల తీరు రాష్ట్రవ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. ఇదే మాదిరిగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కూల్చివేతలు జరుగుతున్నాయి. రెవెన్యూ, పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు కొత్తగా అనుమతులకు వెనుకాడుతున్నాయి. కూల్చివేతలకు ముందుకొస్తున్నాయి. హైడ్రా కింద నిజంగా ఆక్రమణల తొలగింపే లక్ష్యమయితే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల చుట్టూ ఉన్న ఫాంహౌస్‌లను తొలగించాలి. వీటిలో ఎక్కువ అధికార పార్టీకి సంబంధించినవి ఉండగా ఒక్కదాని మీద సర్వే జరగలేదు. రాజకీయంగా వైరి పక్షానికి చెందిన ఫాంహౌస్‌ల వద్ద హడావిడి చేశారు. మరోవైపు విద్యాసంస్థల భవన సముదాయాలపైనా ప్రత్యర్థి పార్టీలను లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విపక్షాలను లక్ష్యంగా చేసుకొని ఆదాయపన్ను, ఈడీ, సీబీఐ దాడులు చేయడం ఆనవాయితీ కాగా హైడ్రా, మూసీల ప్రాజెక్టుల లక్ష్యం కూడా ఇదేనని విమర్శలు వస్తున్నాయి. ఇతర పార్టీల మీదే గాకుండా కాంగ్రెస్ పార్టీ నేతల ఫాంహౌస్‌లు, విద్యాసంస్థల అక్రమ భవన సముదాయాల కూల్చివేతలను చేపడితే ప్రభుత్వం నిష్పాక్షికంగా ఉందని నిరూపితం అవుతుంది.

హైడ్రాగానీ, మూసీ ప్రాజెక్టు గానీ కూల్చివేతలే లక్ష్యమయితే ముందు బాధితుల గురించి ఆలోచించాలి. అన్యాయంగా వారు నష్టపోకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. మూసీ బాధితులకు రెండు పడకగదుల ఇళ్లను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బాధితుల సంఖ్యతో పోలిస్తే రెండు పడకగదుల ఇళ్లు చాలా తక్కువే. దీంతో బాధితులకు భరోసా లేనట్లే.

రాష్ట్రంలో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరగడం లేదు కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా ఆసరా పెన్షన్లు పెరగలేదు. ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం ఇవ్వడం లేదు. బడిపిల్లలకు అల్పాహారం ఇవ్వడం లేదు. మురికివాడలను అభివృద్ధి చేయడం లేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మురికివాడల్లోని ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసింది. ఇప్పుడు గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ వంటివి మురికివాడల్లో అమలు కావడం లేదు. మరోవైపు నిరుద్యోగ సమస్య తాండవిస్తోంది. గత ప్రభుత్వ నోటిఫికేషన్లకు పరీక్షలు జరిగాయి తప్ప కొత్తగా ఉద్యోగ నియామకాలను చేపట్టలేదు. మూసీ ప్రక్షాళన వాంఛనీయమే. అయితే దానికి రూ. లక్షన్నర కోట్లను వెచ్చించాల్సిన అవసరం లేదు. మురుగునీటి పారుదల వ్యవస్థను చక్కదిద్దితే మూసీ సమస్య పరిష్కారమవుతుంది. ప్రభుత్వానికి కూల్చివేతలే లక్ష్యమయితే ఏ ఒక్కరు నష్టపోకుండా వారికి పరిహారం, పునరావాసం, శాశ్వత ఉపాధి కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

• డాక్టర్ బీఎస్‌రావు
బీఎస్‌రావు ఫౌండేషన్

అమెరికా, కెనడాల శ్రీరంగనీతులు

ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య స్వంత అవసరాలే మిత్రత్వానికైనా, శత్రుత్వానికైనా ఏకైక ప్రాతిపదిక అవుతున్నాయి. ఈ ధోరణి ఎంతో కొంత ముందు నుండే ఉన్నప్పటికీ, సైద్ధాంతికతనో, ఉమ్మడి ప్రయోజనాలో కొంత భూమికను పోషించేవి. ఇప్పుడా మొహమాటాల తెర తొలగి స్వార్థ ధోరణి పెచ్చరిల్లింది. నిన్నటి విధానం మార్చుకుని నేడు కొత్తపాట అందుకోడానికి ఏ మాత్రమూ జంకు చూపించడం లేదు. శాశ్వత స్నేహాల వరకూ ఎందుకు, నిలకడైన స్నేహాలు కూడా ఉండడం లేదు.

అమెరికా తన పౌరుడు, భారత వ్యతిరేకి, ఖలిస్థాన్ వేర్పాటువాది పన్నున్‌పై హత్యాప్రయత్నం జరిగినట్టు, దాంట్లో ప్రథమ నిందితుడు భారత్ ప్రభుత్వ అధికారి వివేక్ యాదవ్ అని, అతన్ని అప్పగించమని న్యూఢిల్లీని కోరింది. ఆయనిప్పుడు ప్రభుత్వంలో పనిచెయ్యడం లేదంటూ, అమెరికా ఆరోపణని ఖండించింది మన దేశం. ఇప్పటికే భారతీయ వ్యాపారి నిఖిల్ గుప్తను ఈ కేసులోనే అమెరికా ఖైదులో ఉంచింది. అమెరికా ప్రతిష్ఠాత్మంగా భావించి కాపాడుతున్న ఆ మహా నాయకుడు పన్నున్ ఒక ప్రకటన చేశాడు. ఏమనంటే నవంబర్ మొదటి వారంలో భారత్ విమానాల్లో బాంబులు పెడతామని! భారత్‌కి వ్యతిరేకంగా తీవ్రవాద ప్రకటనల్ని బహిరంగంగా చేస్తున్న వాడిని అమెరికా కట్టడి చెయ్యదుగానీ వాడిపై కుట్ర పన్నారని భారత్ అధికారుల్ని అప్పగించమని కోరుతుంది. అది మళ్లీ మన మిత్రదేశం. ఇదనే కాదు ముంబై పేలుళ్ల సూత్రధారి హెడ్లీని కూడా అడిగినా అప్పగించకుండా దశాబ్దాలుగా తన దగ్గరే దాచుకుంది. తీవ్రవాదంపై పోరులో మనకు సహకరిస్తే దానికి పోయేదేమిటి?

కెనడా ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివింది. మరో భారత్ వ్యతిరేకి, ఖలిస్థాన్‌వాది నిజ్జార్ హత్య వెనుక భారత ప్రభుత్వం ఉందంటూ ఆ దేశ ప్రధాని బహిరంగ ప్రకటన చేశారు. ఋజువులు లేవట. కానీ దర్యాప్తులో తేలిందట. వివాదం ముదిరి దౌత్యవేత్తల బహిష్కరణ దాకా వచ్చింది. చర్చలు మాని రచ్చ చెయ్యడానికి కారణం కెనడా ఎన్నికలకు వెళ్లబోతుంది. ఆ ప్రధానికి, అధికారిక పార్టీకి ఎదురుగాలి. అక్కడి నుండి బయట పడడానికి ఇదో ఎత్తు.

కాబట్టి భారత్ కూడా తన స్వంత బలమే తన నిజమైన మిత్రుడు అని భావించాలి. స్వప్రయోజనాలకు పెద్దపీట వెయ్యాలి. అవసరానికి, సమయానికి తగిన దౌత్యనీతి ప్రదర్శించి అందరితో ఉభయతారకంగా ప్రవర్తించాలి. స్నేహ హస్తంలోనే ఉక్కు సంకల్పం కనబడాలి.

– డి.వి.జి. శంకరరావు

'కగార్ అంతిమ యుద్ధం'తో శాంతి నెలకొంటుందా?

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవులపై క్రమంగా పట్టు సాధిస్తున్నామని భారత సైనిక, భద్రతా బలగాల అధిపతులు చెబుతున్నారు. తాజాగా అబూజ్‌మడ్ కొండల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 32 మంది చనిపోయారు. వెంటనే ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్ష సమావేశం జరిపారు. 2026 నాటికి మావోయిస్టు సమస్య రూపుమాపడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. దేశంలో మావోయిస్టు సమస్య లేకుండా చేయడమే ప్రస్తుత లక్ష్యమని ఇప్పటికే అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే.

అభివృద్ధికి మావోయిస్టులు అడ్డుపడుతున్నారని భారత పాలకులు అంటున్నారు. మావోయిస్టు పార్టీ మాత్రం– ఆదివాసులను ఒక్కటి చేయగలిగాం, బయటి సమాజంలో వారికి గుర్తింపును తేగలిగాం; అడవులను పరిరక్షిస్తున్నాం, వ్యవసాయాన్ని అభివృద్ధి చేశాం; విద్య, వైద్యం మెరుగుపడింది, శుభ్రత పెరిగింది; ప్రజలు సంతోషంగా బతకగలుగుతున్నారు. మైనింగ్ మాఫియా భూతాలపై పోరుకు గిరిజనులను ఏకం చేస్తున్నాం... అని చెబుతోంది. ఛత్తీస్‌గఢ్ అడవి తల్లి ఒడిలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాలున్నాయి.. వాటిని సాగు చేసేందుకు జనం నిర్మించిన చెరువులు ఉన్నాయి! అక్షరం ముక్క రాని గోండు బిడ్డలకు చదువు నేర్పేందుకు పాఠశాలలున్నాయి! పల్లెల్లో ప్రబలే రోగాల చికిత్సకు సంచార వైద్యశాలలున్నాయి.

ఒకవైపు పట్టణాలు, మైదాన ప్రాంతాలు ప్రభుత్వ బలగాల ఆధీనంలో ఉంటే.. అటవీ గ్రామాలన్నీ మావోయిస్టుల గైడెన్స్‌లో స్వయంపాలన జనతన సర్కార్లు కొనసాగుతున్నాయి. దాదాపు పదివేల చదరపు కిలోమీటర్ల ప్రాంతం గెరిల్లా స్థావరాలుగా ఉంది.


కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సమాధాన్ పేరుతో 2017 నుంచి 2022 వరకు దాడిని కొనసాగించాయి. డిసెంబర్ 2022లో కేంద్ర హోం శాఖ మాడ్ విముక్తి కార్యచరణ పథకాన్ని రూపొందించి, 2024 పార్లమెంటరీ ఎన్నికల వరకు నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే గత రెండు సంవత్సరాలుగా అర్బన్ నక్సల్ పేరిట పట్టణాల్లో హక్కుల కార్యకర్తలపై, ప్రగతిశీల రచయితలు, కవులు, కళాకారులపై ఎన్ఐఏ దాడులను తీవ్రం చేసింది. కేంద్ర హోంశాఖ సమీక్ష చేసి 2024 జనవరిలో మావోయిస్టులపై ఆఖరి యుద్ధం... 'కగార్ ఆపరేషన్ (నిర్ణయాత్మక యుద్ధం) ప్రకటించింది. ఈ దాడి ప్రధాన కేంద్రీకరణ మాడ్ ప్రాంతాన్ని మావోయిస్టుల నుంచి విముక్తి చేయడం. అందులో భాగంగానే సెంట్రల్ రీజియన్, ఈస్టర్న్ రీజియన్లలోని మావోయిస్టు పార్టీ బలమైన కేంద్రాలన్నింటిపై దాడులు కొనసాగుతున్నాయి.

ఒడిశాలో ఉన్న మూడు బీఎస్ఎఫ్ బెటాలియన్లను మాడ్ ప్రాంతానికి తరలించి, ఆరు చోట్ల ఫార్వర్డ్ ఆపరేషన్ బేస్ క్యాంపుల్ని ఏర్పాటు చేసారు. ఒక్కో క్యాంపులో 500 బలగాలున్నాయి. రాజ్‌నందగావ్, నారాయణ్‌పూర్, కొండగావ్ జిల్లాల్లో 8 ఐటీబీపీ బెటాలియన్ల నుంచి మొదట ఒక బెటాలియన్‌ను, ఆ తర్వాత మరో రెండు బెటాలియన్లను మాడ్‌పై మోహరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బలగాలపై ఆధారపడి డ్రోన్లతో, అధునాతన ఆయుధాలతో, నూతన టెక్నాలజీతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రా, ఒడిస్సా బోర్డర్లతో కూడిన దాదాపు 92,300 చదరపు కిలోమీటర్ల పరిధిలోని దండకారణ్యంలో దాడి చేస్తున్నారు. ఇక్కడ 50 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో రెండు నుంచి మూడు కోట్ల మూలవాసులున్నారు. ఇక్కడ ప్రజల మీద భారత ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. దీనిని వారు కూడా యుద్ధంతోనే ఎదుర్కొంటున్నారు. ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించిన బలగాలు, సైనిక శిక్షణ పేరిట సైన్యం, ఇప్పటికే అర్ధ సైనిక బలగాలు దిగి యుద్ధాన్ని తీవ్రం చేస్తున్నాయి. విసిగి వేసారి చివరకు మావోయిస్టుల గైడెన్స్‌లో స్వయంపాలనకు పూనుకుంటే మాత్రం వెంటనే భద్రతా బలగాల పేర వాయుసేన, సైనిక పాఠశాల పేరున సైన్యాన్ని దించి డ్రోన్లతో బాంబింగ్ చేస్తూ బలప్రయోగం చేసే ఎత్తుగడ ఫలిస్తుందా?

> మావోయిస్టుల నిర్మూలన గురించి మాట్లాడుతున్న భారత పాలకులు ఈ ప్రపంచం నుంచి ప్రతి భావజాలాన్ని, ఈ దేశం నుంచి నిరుద్యోగాన్ని, ఆకలి చావులను, పేదరికాన్ని, సకల అసమానతలకు కారణమైన దోపిడీ–పీడనల నుంచి విముక్తి చేయడమెలాగో ఆలోచన చేస్తే బాగుంటుంది. ఒకవేళ ఈ పాలకులకు చేతకాకపోతే మావోయిజం మరో పేరుతో ఈ దేశంలో అభివృద్ధి చెందుతుంది.

రెండు ప్రపంచ యుద్ధాల తరువాత ప్రపంచ దేశాలన్నీ అంగీకరించిన 1949 జెనీవా ఒప్పందం ప్రకారమైనా భారత ప్రభుత్వం నడుచుకోవాలి. ఇటీవల ఎకనామిక్ పొలిటికల్ వీక్లీ తన నెలవారీ రివ్యూలో బస్తర్ అడవుల్లో భారత ప్రభుత్వం జెనీవా ఒప్పందాలను మించి హింసకు పాల్పడుతోందని పేర్కొన్నది. అక్కడ ఏం జరుగుతోందో జర్నలిస్టులకు, పౌర సమూహాలకు, డాక్టర్లకు పర్యటించి తెలుసుకునే హక్కు ఉన్నదని అంతర్జాతీయ న్యాయసూత్రాలు చెబుతున్నాయి. కానీ వాటిని భారత పాలకులు పాటించాలి కదా!

భారత రాజ్యాంగం ఇచ్చిన సంవిధానం ద్వారా పార్లమెంట్, శాసనసభల ద్వారా చట్టాలు చేసి ఈ దేశ అంతర్గత భద్రత కోసమే చేపట్టిన గ్రీన్‌హంట్ అయిన పహార్. కగార్ పేరుతో ఆఖరి యుద్ధమని నిర్ణయాత్మక దాడికి దిగుతూ అన్నంలో విషంపెట్టి పడిపోయిన వాళ్లను కాల్చి చంపడం, వాళ్లకు అన్నం



పెట్టారని సమాచారం ఇస్తున్నారని గ్రామాలకు గ్రామాలను తీసుకుపోయి చంపడం, జైళ్లలో నిర్బంధించడం అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం కూడా యుద్ధ నేరమే. అక్కడ ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి పోయే జర్నలిస్టులను, హక్కుల సంఘాలను ఎందుకు పోతున్నారో రికార్డు రాసుకుని పంపించవచ్చు. ఇవేవీ పాటించకుండా అక్కడి జనాన్ని చంపడం, దొరికిన మహిళలను సామూహిక అత్యాచారాలు చేయడం ఏమి యుద్ధనీతి?

మావోయిస్టుల నిర్మూలన గురించి మాట్లాడుతున్న భారత పాలకులు ఈ ప్రపంచం నుంచి ప్రతి భావజాలాన్ని, ఈ దేశం నుంచి నిరుద్యోగాన్ని, ఆకలి చావులను, పేదరికాన్ని, సకల అసమానతలకు కారణమైన దోపిడీ–పీడనల నుంచి విముక్తి చేయడమెలాగో ఆలోచన చేస్తే బాగుంటుంది. ఒకవేళ ఈ పాలకులకు చేతకాకపోతే మావోయిజం మరో పేరుతో ఈ దేశంలో అభివృద్ధి చెందుతుంది.

ఈ యుద్ధం రాజ్యాంగ వ్యతిరేకమని హక్కుల సంఘాలు, మేధావులు, బుద్ధిజీవులు ఘోషిస్తున్నారు. ఇక్కడ యుద్ధ రంగంలో ఉన్న భారత అర్ధ సైనిక బలగాలకు, అక్కడి జనతన సర్కార్ (ప్రజాప్రభుత్వం)లోని పౌరులకు ఎటువంటి రిలేషన్ ఉండాలన్న దానిపై చర్చ జరగాలి. జనతన సర్కార్‌లను భారత పాలకులు, ప్రభుత్వం ఎలా గుర్తిస్తుందనేది జాతీయవాదం పేరుతో వస్తున్న ప్రశ్నలు. అసలు జనతన సర్కార్ అనేది భారతదేశంలో నక్సల్‌కు సంబంధించిన ఏరియా కాదు. శతాబ్దాలుగా కడు దీనావస్థలో బతుకుతున్న ఆదివాసులను ఏనాడూ పట్టించుకోని ప్రభుత్వాలు, వాళ్లు ఉద్యమిస్తే మాత్రం యుద్ధప్రాతిపదికన స్పందిస్తున్నాయి. కూలి రేట్లు పెంచాలని, కాంట్రాక్టర్ల దౌర్జన్యాలు అరికట్టాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని ఎన్నోసార్లు సభలు పెట్టినా, ర్యాలీలు తీసినా, బంద్‌లు నిర్వహించినా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. అక్కడి ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేసుకున్న తమ ప్రజా ప్రభుత్వాలను రక్షించుకునేందుకు యుద్ధంలో భాగం అవుతున్నారు. దానికి మావోయిస్టు పార్టీ గైడెన్స్ ఉంటే ఉండవచ్చు. రాజ్యాంగం ప్రకారమైనా అది 5వ షెడ్యూల్ ఏరియా, పెస చట్టం, ఆదివాసీల రక్షణకు ఇచ్చిన హక్కులను భారత రాజ్యమే పాటించకుండా, అక్కడి ఖనిజ సంపదను మల్టీ నేషన్ కంపెనీలకు రాసిచ్చింది. దానిపై వారు పోరాడుతున్నారు.

భారత రాజ్యాంగం ప్రకారం పాలకులు, ప్రభుత్వాలు నడుచుకోవాలి. భారతదేశాన్ని కాపాడుకునేందుకే ఈ యుద్ధానికి దిగామని, ఇది అంతర్గత భద్రత సమస్య అని చెబితే... అక్కడి జనం ఏం కోరుకుంటున్నారు? అక్కడి గిరిజన యువకుల ఆకాంక్షలేంటి? వారు ఆయుధం పట్టడానికి దారి తీసిన పరిస్థితులేమిటి? ఆయుధం వదలాలంటే వారు కోరుతున్న మార్గం ఏమిటో చర్చించాలి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు ప్రత్యామ్నాయ మార్గంలో జనతన సర్కార్‌లు నడుస్తున్నాయని అంటున్నారు కదా! ఇందుకు కారణమైన మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించాలి. ప్రతి వ్యక్తికి కూడు–గుడ్డ–భూమి, బతికేందుకు ఉపాధి చూపించడమే స్వావలంబన కాదా? మావోయిస్టుల ఎజెండా ఇదే కనుక వెంటనే కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు చొరవచూపాలని దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు కోరుతున్నారు. అందుకు ఎం.ఎల్, వామపక్ష పార్టీలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, వైసీపీ, టీడీపీ, డెమొక్రటిక్ పార్టీలు కూడా ఆలోచించి, కేంద్రంలో ఉన్న ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, దేశంలో జరుగుతున్న రక్తపాతాన్ని ఆపాలి. శాంతి వాతావరణం నెలకొల్పాలి.

▪ బండి దుర్గాప్రసాద్
జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



టాస్క్‌ఫోర్స్‌పై సీపీ కొరడా


- ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పై అధికారుల పాత్రపై అంతర్గత విచారణకు ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

టాస్క్‌ఫోర్స్ విభాగంలోని అక్రమార్కులపై వరంగల్ నగర కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా కొరడా ఝుళిపించారు. ఏళ్ల తరబడి ఇక్కడే పాతుకపోయిన సిబ్బందిపై బదిలీ వేటు వేశారు. ఈ నెల 23వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఖాకీలు కన్నేస్తే.. టాస్క్‌ఫోర్సులో ఆ నలుగురు వసూల్ రాజాలు' కథనం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. ఇంతకీ ఎవరా నలుగురు? అనే చర్చ జరిగింది. దీనిపై కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రెండు రోజుల పాటు అంతర్గతంగా విచారణ జరిపించారు. పలు ఎస్‌హెచ్‌వోలతో పాటు నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్సులో ప్రక్షాళన చేపట్టారు. అందులో భాగంగా గురువారం అర్ధరాత్రి టాస్కుఫోర్సులో పని చేస్తున్న కానిస్టేబుళ్లు పి.శ్రావణ్‌ను పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు, ఎస్.భిక్షపతిని కొడకండ్ల పీఎస్‌కు, జి.శ్రీనివాస్‌ను బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో టాస్కుఫోర్సులో ప్రక్షాళన మొదలైందనే చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతుంది.

అక్రమ వ్యాపారుల్లో దడ

టాస్కుఫోర్స్ ప్రక్షాళనపై సీపీ అంబర్ కిషోర్‌ఝా దృష్టిపెట్టడంలో అక్రమ వ్యాపారుల్లో దడ మొదలైంది. టాస్కుఫోర్సులో 52మంది సిబ్బంది ఉండగా, చాలా మంది పని లేకుండా ఉన్నారని భావించిన సీపీ 12 మందిని ఇటీవల ఇతర విభాగాలకు బదిలీ చేశారు. గురువారం రాత్రి మరో ముగ్గురికి స్థాన చలనం చేశారు. దీంతో పాటు టాస్క్‌ఫోర్సులో ఆ నలుగురు ఎవరెవరికి ఏ విధంగా సహకరించారనే కోణంలో సీపీ విచారణ జరిపించినట్టు తెలిసింది. త్వరలో పూర్తిస్థాయిలో టాస్కుఫోర్సును ప్రక్షాళణ చేసేందుకు సీపీ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. కాగా, టాస్కుఫోర్సు ప్రక్షాళణ చేస్తుండటంతో అక్రమ వ్యాపారుల్లో దడ మొదలైంది. ఇటీవల నెక్కొండలోని ఓ రైస్‌మిల్లులో పీడీఎఫ్ రైస్ ఉందనే సమాచారంతో టాస్కుఫోర్సు అధికారులు అక్కడికి వెళ్లి తనిఖీ చేస్తుండగా, మిల్లర్ గొడవకు దిగినట్లుగా సమాచారం. ఇటీవలే ఓ పోలీస్ అధికారికి రూ.2లక్షల వరకు ఇచ్చానని, మళ్లీ తనిఖీలు చేస్తే ఎట్లా అంటూ మిల్లర్ టాస్క్‌ఫోర్సు అధికారులతో వాదులాటకు దిగినట్లుగా తెలిసింది. అయితే సదరు పోలీస్ టాస్కుఫోర్స్ నుంచి నగర పరిధిలోనే వేరే స్టేషన్‌కు బదిలీపై వెళ్లటంతో ఈ దాడులు జరిగినట్టు తెలిసింది. ఇలా రేషన్ బియ్యం, నల్ల బెల్లం, గుట్కా అమ్మకదారులు, గుడుంబా, బెల్టు షాపులు తదితర అక్రమ వ్యాపారాలు చేసే వారికి కొత్త అధికారులు, సిబ్బంది వస్తే దాడులు తప్పవనే భయం మొదలైనట్టు సమాచారం.



- ఏడేళ్లుగా నిలిచిన నియామకాల ప్రక్రియ
- కొన్ని శాఖల్లో పూర్తిగా ఆగిన వైనం
- ఉమ్మడి జిల్లాలో 550 దరఖాస్తుల పెండింగ్
- వయసు మీరుతుండడంతో ఆందోళనలో ఆశావహులు
- 'మెడికల్ అన్‌ఫిట్' విషయంలోనూ తీవ్ర జాప్యం

కారుణ్యమేదీ?

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉండి.. అనారోగ్య కారణాలు, రోడ్డు ప్రమాదాలు ఇతరత్రా కారణాల వల్ల మరణించిన వారి వారసులు కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. ఏడేళ్లుగా ఈ నియామకాల ప్రక్రియను పట్టించుకోకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 550 మంది దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ధరఖాస్తులు చేసుకున్న వారిలో పంచాయతీరాజ్, విద్యాశాఖలకు సంబంధించినవారే ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 550 దరఖాస్తుల్లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించినవి సుమారు 175 ఉండగా విద్యాశాఖకు చెందినవి 190. రెవెన్యూలో 140 ఎక్సైజ్ శాఖకు సంబంధించినవి 45 ఉన్నాయి. వీరంతా కారుణ్య నియామకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ ఆయా శాఖల్లో వీటి గురించి పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే పంచాయతీరాజ్, విద్య, ఎక్సయిజ్, రెవెన్యూ శాఖల్లో కారుణ్య నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలీసు, విద్యుత్, నీటిపారుదల తదితర శాఖల్లో అలాగే ఆర్‌టీఈలో మాత్రం రెండేళ్ల క్రితం కొంత మేర నియామకాలు జరిపారు. ఈ నియామకాల గురంచి గత ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుత సర్కార్ కూడా ఇప్పటి వరకు దృష్టి సారించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులు చేసుకున్నవారు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా, పలుమార్లు కలెక్టర్లను కలిసి వినతి పత్రాలను అందజేసినా, ప్రజాప్రతినిధులను కలిసి వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది. కొవిడ్ సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 180 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులున్నారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కొవిడ్ వల్ల చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల పిల్లలకు ఆరు నెలల్లో కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించనున్నట్టు అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. దీనితో చనిపోయినవారి స్థానంలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దరఖాస్తు చేసుకున వారిలో వయసు పెరుగుతుండటంతో తమకు కొలువులు దక్కుతాయా లేదా అన్న ఆందోళన కనిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కారుణ్య నియామకాలపై దృష్టి పెట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

నోటిఫికేషన్లలో చేర్చి...

గతేడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం వివిధ నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. పలు శాఖల్లో ఖాళీలను అధికారులు ఇండెంట్ రూపంలో ఇవ్వడంతో వాటిని నోటిఫికేషన్లలో చేర్చారు. ఆయా జిల్లాలో కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టులను పక్కకు పెట్టకపోవడంతో ఆ పోస్టులు కూడా భర్తీ అయ్యే అవకాశం ఉంది. దీంతో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తులు పెట్టుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. అయితే ఆయాశాఖల్లో ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చినందు వల్ల కారుణ్య నియామకాలతో పాటు ఇతర కోట కింద పోస్టులు భర్తీ చేయవద్దని కలెక్టర్లకు సీఎస్ నుంచి ఆదేశాలు అందినట్టు సమాచారం.

నీటిపారుదల శాఖలో నో చాన్స్

నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్, స్టెనో, టైపిస్టు ఉద్యోగాలను గ్రూప్ 4 ద్వారా మాత్రమే భర్తీ చేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేటగిరి పోస్టులను డిపెండెంట్, కారుణ్య నియామకాల ద్వారా భర్తీ చేయరాదని ఇటీవల జారీ అయిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీంతో నీటిపారుదల శాఖలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లినట్లయింది.

మెడికల్ అన్‌ఫిట్ పరిస్థితీ అంతే..

సర్వీస్‌లో ఉండి తీవ్ర అనారోగ్యానికి గురై ఉద్యోగం చేయలేని స్థితిలో ఉన్నవాళ్లు మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు పెట్టుకుంటారు. వారికి బదులు కుటుంబంలో ఎవరికైనా ఉద్యోగం ఇవ్వాలని కోరుతారు. ఇలాంటి దరఖాస్తులు కూడా ఉమ్మడి జిల్లాలో 43 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిశీలించడానికి జీఏడీతో పాటు ఉన్నతాధికారుల కమిటీ ఉంటుంది. ఆ కవిటీ కాలపరిమితి ఎప్పుడో ముగిసింది. కొత్త కమిటీని ఇప్పటి వరకు వేయలేదు. ఈ దరఖాస్తులను పరిశీలించేవారే లేరు. ఈ పోస్టుల భర్తీ అనుమానమే.

నేరుగా రిక్రూట్‌మెంట్ చేస్తే ఎలా!

వాస్తవానికి ఆయా ప్రభుత్వ శాఖల వారీగా కారుణ్య నియామకాల కోసం వచ్చిన ధరఖాస్తులను అధికారులు పరిశీలించి ఆ పోస్టులను మినహాయించి మిగిలిన పోస్టులను నోటిఫికేషన్‌లో చూపాల్సి ఉంటుంది. కానీ హడావుడిగా ఖాళీలను లెక్కించి సమాచారం ఇవ్వడంతో ఆ మేరకు జారీ అవుతున్న నోటిఫికేషన్ల వల్ల ఖాళీ పోస్టులు లేకుండా పోతున్నాయని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. ఇప్పుడు పరిస్థితుల్లో శాంక్షన్ పోస్టులే చాలా తక్కువగా ఉన్నాయి. వాటిని డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తే ఇక ఏండ్ల తరబడి ఖాళీలు ఉండకపోవచ్చని, ఫలితంగా కారుణ్య నియామకాలు జరగకపోవచ్చనే ఆందోళన వ్యక్తం అవుతోంది.



ఇరిగేషన్ శాఖలో

ఏసీబీ గుబులు

- పట్టించేందుకు పథకం ప్రకారం ఫోన్లు చేస్తున్న కాంట్రాక్టర్లు!
- ఓ అధికారి మాట్లాడిన ఆడియో వైరల్
- నీటిపారుదల అధికారులు అప్రమత్తం

బాలసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 60 మందికి పైగా ఇరిగేషన్ శాఖలో పనిచేసిన అవినీతి అధికారులు ఏసీబీకి పట్టుబడడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇరిగేషన్ అధికారులు ఎప్పుడు ఏ అధికారి ఏసీబీకి పట్టుబడుతారోనని భయంతో వణికిపోతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎక్కువగా ఇరిగేషన్ శాఖ అధికారులే ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ చింతగట్టు నీటిపారుదల శాఖలోని అధికారులు భయంతో వణికిపోతున్నారు. ఇప్పటివరకు నీటిపారుదలశాఖలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో బిల్లులు ఆలస్యం చేస్తూ ఎక్కువ డబ్బులు ఇవ్వాలని కొందరు ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్లను ఇబ్బందులకు పెడుతున్న ఆడియో వైరల్‌గా మారింది.

నీటిపారుదల శాఖలో పనులు చేపట్టక ముందే కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజీలు తీసుకున్నట్లు చెబుతున్నారు. అధికారులకు

మిగతా 6వ పేజీలో..

పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు

- సీపీ అంబర్ కిశోర్ ఝా
- కమిషనరేట్‌లో ఓపెన్ హౌజ్

పోలీసు అమర వీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని పోలీసులు ప్రజల భద్రత కోసం నిరంతరం పని చేస్తూ.. శ్రేయోభిలాషులని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్ ను ప్రారంభించిన ఆయన.. అక్కడకు వచ్చిన విద్యార్థులకు పోలీసుల విధులు, వారు ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరు, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ విభాగాల గురించి వివరించారు. 6


ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న సీపీ

క్రీడలతో మానసిక ఉల్లాసం

- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ నగరంలో పర్యటన 6


రామన్నపేటలో విద్యార్థినితో కలిసి సైకిల్ తొక్కుతున్న మంత్రి సురేఖ

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ప్రారంభమైన జిల్లా స్థాయి ఏస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీలు


క్రీడాపోటీల ప్రారంభంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా జిల్లా స్థాయి అండర్- 19 జూనియర్ కళాశాలల క్రీడా ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమైయ్యాయి. ఈప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. సగటు మనిషి మానసిక ఉల్లాసంతో జీవన ఆరోగ్య ప్రమాణాలు క్రీడలతోనే సాధ్యపడుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల దేహదారుడ్య ధృడత్వానికి, మానసిక ప్రశాంతతకు దోహదపడుతాయన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తన వంతు సహాయసహకారాలు ఎల్లప్పు డు ఉంటాయన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పట్టుదల క్రమశిక్షణతో సాధన చేసి క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూచించారు. క్రీడా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటలో ఉద్యోగ అవకాశాలు సాధించే అవకాశాలు ఉంటాయన్నారు.

హనుమకొండ జిల్లా డివైఎస్‌వో, ఎస్‌జీఎఫ్ఐ అండర్ - 19 కార్యదర్శి అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 29వ అండర్-19 జూనియర్ కళాశాలల స్థాయి బాలబాలికల ఖోఖో, టైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ ఫెన్సింగ్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఓలం పిక్ అసోసియోషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఐఈవో గోపాల్‌రావు, డాక్టర్ శ్రీధర్, పీడీ, పీఈటీ, వివిధ క్రీడాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

తనిఖీ


కాపుల కనపర్తిలో భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

మీరైతే... ఈ భోజనం చేస్తారా?

- కాపుల కనపర్తి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు 6
- భోజనం నాణ్యత లేదని వరంగల్ కలెక్టర్ ఆగ్రహం


ర్యాలీగా వస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే)

వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి

- ప్రభుత్వాలను గద్దె దింపిన చరిత్ర పీడీఎస్‌యూది 6
- ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే
- ఘనంగా పీడీఎస్‌యూ 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ

ఏనుమాములలో నిలిచిన

పత్తి కొనుగోళ్లు

- రైతు సంఘం నాయకుల రాకతో వివాదం
- వారుంటే పంటను కొనేది లేదన్న వ్యాపారులు
- పరస్పర వాగ్వాదంతో రెండు గంటల పాటు లావాదేవీలు బంద్ 6
- ఇరువర్గాలతో చర్చల అనంతరం ప్రారంభం


పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో గుమిగూడిన రైతులు

చెత్త సమస్య లేకుండా చేస్తున్నాం..

డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, బల్దియా చీఫ్ మెడికల్ ఆఫీసర్

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: చెత్త సేకరణపై మా నిటరింగ్ ఏవిధంగా చేస్తున్నారు ?

సీఎంహెచ్‌వో: ప్రతీ ఇంటి నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్తను సేకరిస్తున్నాం. కమిషనర్, మేయర్ ఆదేశాల మేరకు ప్రజలకు చెత్త సమస్య రాకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: తడి, పొడి చెత్తను ఎలా సేకరిస్తున్నారు ?

సీఎంహెచ్‌వో : ప్రతీ ఇంటికి రెం డు చెత్త బుట్టలను ఇవ్వడం జరిగిం ది, ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి రెండో ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద విభజించడం జరుగుతుంది. అక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తాం.

ఆంధ్రజ్యోతి: వంద శాతం ట్రేడ్ లైసెన్స్ వసూలు ఏ విధంగా చేస్తున్నారు ?

సీఎంహెచ్‌వో : ప్రతీ సంవత్సరంలో ట్రేడ్ లైసెన్స్ వసూలు అనేది 85 శాతం మాత్రమే జరుగుతుంది. ఎందుకంటే కొన్ని షాపులు పూర్తిస్థాయిలో నడవకపోవడం వల్ల మధ్యలోనే నిలిచిపోతాయి. ఈ కారణం వల్ల ట్రేడ్ లైసెన్స్ వసూలు వంద శాతం జరగవు.

ఆంధ్రజ్యోతి: డంపింగ్ యాడ్ వద్ద చెత్త దిగుమతి సమస్య తరుచుగా జరుగుందనే ఆరోపణలపై మీ అభిప్రాయం ?

సీఎంహెచ్‌వో: వరంగల్ ట్రైసిటీస్ నుంచి అనుకున్నదానికంటే ఎక్కువ మొత్తంలో చెత్త ప్రొడక్షన్ జరుగుతుంది. బయోమైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద అనుకున్న ప్రకారం పని జరగడం లేదు. దీంతో స్వచ్ఛ ఆటోల ద్వారా సేకరించిన చెత్త తరలింపు కాస్త ఆలస్యం అవుతుంది. ఐనా ప్రత్యేక శ్రద్ధతో మూడు ఇటాచీలతో ఎప్పటికప్పుడు రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో చెత్త దిగుమతి సమస్య రాకుండా చూస్తున్నాము.

- వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

విధి నిర్వహణలో అలసత్వం వద్దు : సీపీ



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని వరంగల్ పోలీసు కమిషనర్ పోలీసు అధికారులను హెచ్చరించారు. శుక్రవారం నెలవారీ నేర సమీక్షలో భాగంగా వరంగల్ పోలీసు కమిషరేట్ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. డీసీపీ, ఏసీపీ, ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో ముందుగా పోలీసు కమిషనర్ పెండింగ్ కేసులు నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు కమిషనర్ పలు సూచనలు చేస్తూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై స్టేషన్ అధికారులకు ముందస్తు సమాచారం ఉండాలని, సోషల్ మీడియాలో ప్రచారం అయ్యే కథనాలపై అధికారులు దృష్టి సారించాలని అలాగే వదంతులు వ్యాప్తి చేసే వ్యక్తులు, సంస్థలపై కన్నేసి ఉంచాలని సీపీ సూచించారు.

శాంతి భద్రతల అంశంపై పోలీసు కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, బాధితుల నుంచి ఫిర్యాదులతో పాటు, సీపీ కార్యాలయం ద్వారా వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, యాంటీ డ్రగ్స్ విభాగానికి పోలీసు కమిషనర్ చేతుల మీదుగా రివార్డులు అందచేశారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, రవీందర్, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీ రవితో పాటు ఏసీపీలు ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి

ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే

ఘనంగా పీడీఎస్‌యూ 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి) : సమాజంలోని వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ)50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ఆవరణలో శుక్రవారం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా పీడీఎస్‌యూ నాయకులు బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ పార్కు నుంచి వేలాది మంది విద్యార్థులతో స్ఫూర్తిప్రదర్శనగా కాళోజీ జంక్షన్, అమరవీరుల జంక్షన్, సుబేదారి మీదుగా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం వరకు వచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్

అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం 70వ దశకంలో స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వం కోసం ప్రపంచవ్యాప్తంగా పోరాడుతున్న విద్యార్థి ఉద్యమాల స్ఫూర్తితో 1974లో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌ల నాయకత్వంలో ఏర్పడి విద్యార్థుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో మెడికల్ కాలేజీల ఏర్పాటును వ్యతిరేకించి ప్రభుత్వాలను గద్దె దింపిన చరిత్ర పీడీఎస్‌యూకు ఉందన్నారు.

ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పేద, దళిత, గిరిజన వెనుకబడిన, అణగారిన వర్గాల విద్యార్థుల మెస్‌ఛార్జీలు, స్కాలర్‌షిప్‌ల కోసం పీడీఎస్‌యూ రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. ప్రొఫెసర్ సీ.హెచ్ దినేష్ కుమార్, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి , ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి ప్రతాప్ రెడ్డి, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నున్న అప్పారావు, పీడీఎస్‌యూ జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఈడంపాక విజయ్‌ఖన్నా, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సరళ, పీడీఎస్‌యూ నాయకులు సతీష్, గణేష్, సైదులు, అర్జున్, మిశ్రిన్ సుల్తానా, రాచకొండ రంజిత్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజల శ్రేయోభిలాషులు

సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రత కోసం నిరంతరం పని చేస్తున్న పోలీసులు వారి శ్రేయోభిలాషులని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్‌ను సీపీ ప్రారంభించారు. ఈ ఓపెన్ హౌజ్‌ను వీక్షించేందుకు నగరంలోని పలు విద్యా సంస్థల నుంచి వచ్చిన విద్యార్థులకు పోలీసులు వారి విధులు, వివిధ రకాల ఆయుధాలు, వాటి పనితీరు, అలాగే బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ విభాగాల పనితీరును వివరించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ చిన్నారులకు పోలీసు తుపాకుల పని తీరును వివరించారు. ఈ ఓపెన్ హౌజ్‌కు తరలి వచ్చిన కాలేజీ విద్యార్థులు ప్రధానంగా పోలీసు జాగిలాలతో అధిక సమయం గడపడం కోస మెరుపు. ఈ కార్యక్రమంలో డీసీపీ సలీమా, రవీందర్, అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, దేవేందర్ రెడ్డి, ఆర్‌ఐలు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, శ్రీధర్, సతీష్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, సతీష్‌తో పాటు ఆర్‌ఎస్‌లు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధాలను పరిశీలిస్తున్న సీపీ

క్రీడలతో మానసికోల్లాసం

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

కరీమాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ఉర్సు గుట్ట బైపాస్ రోడ్డులో సిమ్ అండ్ సామ్స్ ప్లే టౌన్ గేమింగ్ జోన్‌ను మంత్రి కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ పిల్లలకు, పెద్దలకు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో అవసరమన్నారు. నేటి పోటీ యుగంలో ఆరోగ్య పరిరక్షణకు శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నగరంలోని గేమింగ్ జోన్‌ను ఏర్పాటు చేయడం మంచి పరిణామన్నారు. తన చిన్ననాటి ఆటలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గేమింగ్ జోన్ అందిస్తున్న డిస్కౌంట్ కార్డులు, ఫుడ్, ఇతర సౌకర్యాలపై వివరాలను నిర్వహకులు మంత్రి కొండా సురేఖకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డాక్టర్ ఉషస్వీ, వంశీ ఇమ్మడిశెట్టి, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ అత్యున్, డాక్టర్ విక్రమ్, సింధు, డాక్టర్ సందీప్, డాక్టర్ కీర్తి, డాక్టర్ వశిష్ఠ, డాక్టర్ మానస సౌమ్య, పాల్గొన్నారు.



గేమింగ్ జోన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ, మేయర్ గుండు సుధారాణి

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని రామన్నపేటకు చెందిన ఆంధ్ర బాలిక పాఠశాల ఇద్దరు విద్యార్థినులకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్లు అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సైకిల్ తొక్కి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటా

వరంగల్ సిటీ, అక్టోబరు 25: (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్ ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో సుమారు నాలుగు గంటల పాటు మంత్రి సురేఖ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ప్రజలే దేవుళ్లని నిత్యం వారికి అందుబటులో ఉంటానన్నారు. ఇక్కడ కాకపోతే హనుమకొండలో, హైదరాబాద్ గాంధీభవన్, సెక్రటేరియెట్, జూబ్లీహిల్స్‌లోని తన నివాసం, మెదక్ ఇలా ఎక్కడైన ప్రజలతో కలిసేందుకు తాను ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. తాను అందుబాటులో లేనప్పుడు తన సిబ్బందికి సమస్యను తెలియజేస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. తాను మంత్రి అయిన తరువాత తన కాన్వాయికి పైలెట్‌గా వ్యవహరించిన ఓ మహిళా ఏఎస్‌ఐ ఉద్యోగ విరమణ చేయడంతో ఆమెను మట్టెవాడ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి మంత్రి సత్కరించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదిన సందర్భాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి క్రిష్ణ మూడు సైకిళ్లను మంత్రి చేతుల మీదుగా బాలికలకు పంపిణీ చేశారు. అనంతరం బాలికలతో కలిసి మంత్రి కొంతదూరం సైకిల్ తొక్కారు.

మీరైతే ఈ భోజనం చేస్తారా?

కాపుల కనపర్తి హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

సంగెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాపులకనపర్తి, కొత్తగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాపుల కనపర్తి ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ పర్యటన సమయంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఈ క్రమంలో భోజనంలో నాణ్యత లేదని గమనించిన కలెక్టర్ పాఠశాల హెచ్ఎం శోభారాణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరైతే..ఈ భోజనం చేస్తారా' అంటూ ప్రశ్నించారు. వెంటనే హెచ్ఎంకు షోకాజు నోటీసు జారీ చేయాలని డీఈవో జ్ఞానేశ్వర్‌కు ఆదేశించారు. కొత్తగూడెం పాఠశాలలో నలుగురు విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండడంతో ఒకరిని వెంటనే డిప్యూటేషన్‌లో ఇతర పాఠశాలకు బదిలీ చేయాలని ఆదేశాలిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించి బియ్యం, కూరగాయలు, సరుకులను కలెక్టర్ పరిశీలించారు. గురు, శనివారం రోజుల్లో విద్యార్థులకు తప్పనిసరిగా భోజనంలో మునిగాకు కలిపి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంఈవో సుజన్ తేజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపావళికి కొత్త నోములు నోముకోవచ్చు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రజలు పెద్ద ఎత్తున ఇంటింటా లక్ష్మీదేవి నోములు, కేదారేశ్వర స్వామి వ్రతాన్ని ఆచరించుకుంటారు. కొన్ని కారణాల వల్ల నోములు పడిపోయి ఆచరించుకోకుండా నిలిచిపోయిన వారు కొత్త దంపతులకు నోము పట్టించే కార్యక్రమాన్ని నిర్వహించుకోవడానికి ఈ దీపావళికి అనుకూలమైన ముహర్తమని ఊకల్ నాగేంద్రస్వామి దేవస్థానం అర్చకులు, ప్రముఖ జ్యోతిష పండితులు డాక్టర్ సముద్రాల సుదర్శనాచార్యులు తెలిపారు. నోములు పడిపోయిన వారు కొత్తగా నోము పట్టుకోవాలనుకునే వా రు నవంబరు 1న నోములు నోముకోవచ్చని ఈ నెల 31న దీపావళి పండుగను జరుపుకోవచ్చని తెలిపారు. ధన్ తేరాస్ నరక చతుర్థశి వేడుకలను కూడా జరుపుకోవచ్చని తెలిపారు. నవంబరు 1న ధనలక్ష్మి పూజలు, దీపావళి సందర్భంగా వ్యాపార సంస్థల్లో పుస్తకాల మూరతులు పూజలు ఆచరించుకోవచ్చని అన్నారు.

మార్కెట్ బైలా ప్రకారమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు

మార్కెట్ కార్యదర్శికి వినతిప్రతం

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు25: (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మార్కెట్ బైలా ప్రకారమే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ప్రతినిధులతో కలిసి శుక్రవారం మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంటను సీసీఐ ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు.

తేమ పేరుతో సీసీఐ కొనుగోలు చేయపోవడంతో ప్రయివేటు వ్యాపారస్తులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతును నష్టాల పాలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా పత్తిపంటకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.11 వేలు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రైతుల గన్నీబ్యాగులకు వ్యాపారులు రూ.60ల చొప్పున చెల్లించాలని, మార్కెట్ సజావుగా సాగేందుకు వీలుగా ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాషపాక రమేష్, బల్బుకూరి నర్సయ్య, కూస సంపత్, వజ్ర శ్రీనివాస్, మోర్తాల రవిందర్, గోనె లింగమూర్తి, పెంతల రాజు, ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏనుమాములలో నిలిచిన పత్తి కొనుగోళ్లు

రైతు సంఘం నాయకుల రాకతో వివాదం

ఇరువర్గాలతో చర్చల అనంతరం ప్రారంభం

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 25 : (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం సుమారు రెండు గంటల పాటు పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పత్తి వేలం పాటపాడే సమయంలో రైతు సంఘం నాయకులు అక్కడకు చేరుకున్నారు. దీంతో వ్యాపారులు రైతు సంఘం నాయకులుంటే మేం కొనుగోలు చేయమంటూ కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో వివాదం మొదలై సుమారు రెండు గంటల పాటు పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రోజు మాదిరిగానే పత్తి యార్డులో పత్తి వేలం పాట మొదలైంది. అదే సమయంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం అక్కడకు చేరుకుని వేలం పాటలను గమనిస్తున్నారు. ఈ క్రమంలో రైతు సంఘం నాయకులను గమనించిన వ్యాపారులు వేలం పాటల వద్ద మీకేం పని అంటూ రైతు సంఘం నాయకులను ప్రశ్నించారు. మేం ఉంటే మీకేం నష్టమని రైతు సంఘం నాయకులు వ్యాపారులను ఎదురు ప్రశ్నించారు.



పత్తిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఇలా రైతు సంఘం నాయకులకు, వ్యాపారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో వ్యాపారులు పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. విషయం చిలికి చిలికి పెద్దదిగా మారుతుండడంతో విషయం తెలుసుకున్న ఏనుమాముల సీఐ రాఘవేందర్, ఎస్‌ఐలు పోలీసులు, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, గ్రేడ్ 2 కార్యదర్శులు పత్తి యార్డుకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మార్కెట్ కార్యదర్శి నిర్మల కలెక్టర్, మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

మార్కెట్ ప్రధాన కార్యాలయంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శి పోలెపాక నిర్మల రైతు సంఘం నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్లే సీసీఐ కొనుగోలు చేయడం లేదని అయినప్పటికీ రైతు ఇబ్బంది పడకూడదని వ్యాపారులు ధైర్యం చేసి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కొనుగోళ్లు చేసే సమయంలో వచ్చి పత్తికి ధర తగ్గిందని రైతులను రెచ్చగొట్టడం మంచిపద్ధతి కాదని అన్నారు. మీకు ఏమైన ఇబ్బందులుంటే మార్కెట్ కార్యాలయానికి వచ్చి అధికారులను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని తెలిపారు. రైతు సంఘం నాయకుడు మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ..రైతులకు మేలు చేయాలనే తపనే తప్పా.. వ్యాపారులపై మాకు ఎలాంటి కోపం లేదని, మార్కెట్ సజావుగా సాగాలనే మేం కోరుకుంటున్నామని తెలిపారు. దీంతో మార్కెటింగ్‌శాఖ డీడీ పద్మావతి, కార్యదర్శి నిర్మల మోర్తాల చందర్‌రావు తో మాట్లాడి రైతు సంఘం నాయకులను కార్యాలయంలోనే ఉంచి పత్తి యార్డులో వేలం పాటలు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పత్తి యార్డులో కొనుగోళ్లు యథావిధిగా సాగడంతో సమస్య సదుదమనిగింది. పత్తికి గరిష్ఠ ధర క్వింటాశ్‌కు రూ.7000లు పలికింది.

ఈఈఈ విభాగం బీవోఎస్ చైర్‌పర్సన్‌గా సుమలత

కేయూక్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ఈఈఈ విభాగం పాఠ్యప్రణాళిక విభాగం చైర్‌పర్సన్‌గా (బీవోఎస్) అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుమలతను నియామిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఈఈ ఈ విభాగం చైర్సన్‌గా వ్యవరించిన డాక్టర్ కె.చి నా నుంచి ఆమె పదవీ బాధ్యతలు చేపడు తారు. సుమలత రెండేళ్ళ పాటు పదవీలో కొనసాగుతారు. సుమలతకు 14 ఏళ్ళ బోధన అనుభవంతో పాటు జర్నల్ పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. ఎన్ఎస్ఎస్ పీవోగా, వర్సిటీ హాస్టల్స్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈఈఈ విభాగం ఇన్‌చార్జిగా విభాగాధిపతిగా కూడా విధులు నిర్వహించారు. బీవోఎస్ చైర్‌పర్సన్‌గా నియామితులైన సుమలతను బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

15 నుంచి 18 శాతం తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు25 : (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణం, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తేమ శాతం 15 నుంచి 18 వరకు ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రజౌళీశాఖమంత్రి గిరిరాజ్ సింగ్‌కు తెలంగాణ పత్తి రైతుల తరపున తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఇప్పటికే పత్తి సీజన్ ప్రారంభమైందని, పత్తి తీసే సమయంలో అకాల వర్షాలు పడడంతో పత్తి తేమ శాతం 15 నుంచి 18 వరకు ఉంటున్న విషయాన్ని పరిగణలోనికి తీసుకోవాలన్నారు. పత్తిలో తేమశాతం 15 నుంచి 18 వరకు ఉంటోందని దీంతో సీసీఐ పత్తిని సేకరించలేకపోతోందని లేఖలో పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే... రాష్ట్రంలో వచ్చే సీజన్‌లో రైతులు పత్తి పంటను తక్కువగా సాగుచేసే అవకాశం ఉందన్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, అధికారులు పత్తి రైతులకు మద్దతు ఇవ్వకపోతే దాని ప్రభావం వస్త్ర పరిశ్రమపై పడే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకుని తేమ శాతం 15 నుంచి 18వరకు ఉన్న పత్తిని సీసీఐ ఆధ్వర్యంలో ఎంఎస్‌పీ కింద కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ లేఖలో మంత్రి గిరిరాజ్ సింగ్‌ను రవిందర్‌రెడ్డి కోరారు.

ఇరిగేషన్ శాఖ అధికారుల్లో ఏసీబీ గుబులు

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లు ఫోన్ చేసి బిల్లులు ఇవ్వడంలేదని అధికారులను నిలదీస్తున్నారు. దీంతో చింతగట్టు ఇరిగేషన్‌శాఖ పరిధిలో పనిచేస్తున్న అధికారులు వారి అక్రమాలు భయటపడకుండా జాగ్రత్తగా ఉండాలంటూ కిందిస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో కొందరు అధికారులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖలో ప్రాజెక్టులు, చెరువులలో మట్టి తరలింపులో కాంట్రాక్టర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ఇప్పటికే కొందరు అధికారులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్‌శాఖ ప్రాజెక్టుల పరిధిలో అవకతవకలపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

శంభునిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదోన్నతులు పొందిన భాషా పండితులను సత్కరించటానికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న రంగశాయిపేటలోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

ఏసీజీఈ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ కమీషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ (ఏసీజీఈ) పోస్టు దరఖాస్తుకు అర్హులైన హెడ్మాస్టర్లు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఈవో ఎం. జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2505	2080
పల్లికాయ (సూక)	6000	5000
పల్లికాయ (పచ్చిది)	4600	4000
కందులు	7000	6900
పెసళ్లు	6400	4052
పత్తి	7000	5500
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	---	---
పసుపు (గోల)	---	---
తేజ మిర్చి	12500	9000
తేజ ఏసీ	17000	12000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	15000	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

అమ్మవారిని దర్శించుకున్న ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక భద్రకాళి అమ్మవారిని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ-వరద రాజేశ్వర్‌రావు దంపతులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ అర్చకులు భద్రకాళిశేషు ఆశీర్వదించగా ఈవో శేషు భారతి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ఆశా కార్యకర్తల సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు అభినందనీయమని, కొవిడ్ సమయంలో ఏఎన్ఎంలు, ఆశాలు అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వరంగల్ ఐఎంఏ హాలులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు రిజిస్టర్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏఎన్ఎంలు, ఆశాల పని ఒత్తిడిని ప్రభుత్వం గుర్తించిందని, ప్రజా ఆరోగ్యం కోసం పనిచేసే వారికి తాము ఎప్పుడు అండగా ఉంటామని, ఇంకా బాధ్యతతో సమష్టిగా పని చేస్తూ జిల్లా అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. వేతనాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, ముఖ్యమంత్రి ప్రకటించనున్న ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇఫ్తాకర్ అహ్మద్, డాక్టర్ నాగరాజు, వి.అశోక్‌రెడ్డి, ఎల్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస వేడుకలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ప్రసిద్ధ దేవాలయాల్లో కార్తీక మాసోత్సవం, లక్ష దీపోత్సవం పూజలను నిర్వహించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తెలిపారు. శుక్రవారం ప్రముఖ దేవాలయాల ఈవోలతో జరిగిన జూమ్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో అభిషేకాలు, దీపోత్సవాలు, కార్తీక పౌర్ణమి రోజున లక్ష దీపోత్సవం, సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించాలన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

జిల్లా టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ అధ్యక్షులు ఆకుల రాజేందర్ అన్నారు. కలెక్టరేట్‌లోని టీఎన్‌జీఓస్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆకుల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలై మూడు గంటల పాటు రాష్ట్ర జేఏసీతో చర్చించి సమస్యల పరిష్కారానికి తప్పనిసరిగా కృషి చేస్తానని పేర్కొనడం అనేది ఉద్యోగులపై సీఎంకు ఉన్న అభిమానాన్ని తెలియజేస్తుందన్నారు. ముఖ్యంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భట్టి విక్రమార్క చైర్మన్‌గా, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా, ప్రత్యేక ఆహ్వానితులుగా కే. కేశవరావుతో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి దాని ద్వారా ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేస్తామని పేర్కొనడం ఉద్యోగులపై వారికి ఉన్న అభిమానం అర్థమవుతుందన్నారు. ఈ సమావేశంలో టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘం నేతలు శ్యాంసుందర్, సారంగపాణి, జిల్లా నేతలు రాజేష్ ఖన్నా, రాజేశ్వర్ రెడ్డి, రాజీవ్, అనూప్, ఎర్ర ప్రగడ, శివ, సుధాకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయండి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు ఆయా డివిజన్‌ల బల్దియా అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 13 డివిజన్‌లైన 1,2,3,14,43,44,45,46,55,56,64,65,66 డివిజన్‌లలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో పాటు కాంట్రాక్టర్లు పనులు చేయకుండా నిలిపి వేసిన పనులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 2023 నుంచి ఇప్పటి వరకు 60.67 కోట్లతో 409 అభివృద్ధి పనులు మంజూరు కాగా రూ. 18.36 కోట్లతో 119 పనులు పూర్తి చేసినట్టు తెలిపారు. ఇంకా కొన్ని పనులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నిలిచి పోయాయని నిలిచిపోయిన పనులకు మరో కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు చేయిస్తామన్నారు. విలీన గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న శానిటేషన్ సిబ్బంది సరిగా పని చేయకపోవడం వల్ల ప్రజల నుంచి తరుచుగా ఫిర్యాదులు వస్తున్నాయని ఇదే పద్ధతి అని శానిటేషన్ అధికారులపై సీరియస్ అయ్యారు. అధికారులు, సిబ్బంది పద్ధతి మారకపోతే విధుల మార్పు తప్పదని హెచ్చరించారు. ఇంకా అధికారులు ప్రత్యేక చొరవతో విలీన గ్రామాలలో నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్లు, అధికారులు సమన్వయంలో వ్యవహరించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ..పనులు వేగవంతంగా పూర్తి చేయుటకు ఇంజనీరింగ్ అధికారులు ప్రతీ రోజు డివిజన్‌లలో క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గానికి రూ.114 కోట్ల వ్యయంతో 21 ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీసీలు కృష్ణారెడ్డి, రవీందర్‌లతో పాటు బల్దియా ఇంజనీర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, హార్టికల్చర్, ఎన్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

కేయూ న్యాయ కళాశాల విద్యార్థులకు వసతి కల్పించాలి

కేయూక్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేయూ న్యాయ కళాశాల విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించాలని కేయూ న్యాయ కళాశాల విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌ను కలిసి విద్యార్థి నేతలు తమ సమస్యతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ 5 వైడీసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు మెస్ సౌకర్యం మాత్రమే ఉందని వీరికి హాస్టల్స్ వసతిని కల్పించాలని అన్నారు. ఐదేళ్ళు క్యాంపస్ బయట ఉండి రూంలకు అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.అమ్మాయిలు హాస్టల్ లేకపోతే చదువుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్ళుగా గణపతి దేవా హాస్టల్‌ను మరమ్మత్తుల పేరుతో మూసివేశారని ఆయా హాస్టల్‌ను పునరుద్ధరించినట్లయితే 100 నుంచి 150 మందికి హాస్టల్ వసతి కల్పించే అవకాశం ఉందని చెప్పారు. కేయూ వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు చొరవ తీసుకుని హాస్టల్ వసతి కల్పించాలని విన్నవించారు.

రేపు మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 25: నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. శుక్రవారం నయీంనగర్‌లోని ఇనిస్టిట్యూట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షను మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ ప్రధాన కేంద్రమైన రాజస్థాన్ కోటా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.150 కోట్ల స్కాలర్‌షిప్, 2 కోట్ల ప్రైజ్ మనీ, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందివ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా మోషన్ వరంగల్ సెంటర్ నుంచి ఐదుగురికి ఉచిత విద్య, మరో ఐదుగురికి విద్యార్థులకు ఫీజుల్లో 50 శాతం రాయితీతో పాటు రూ 18 లక్షల స్కాలర్‌షిప్, మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండోవ ర్యాంకు సాధించిన విద్యార్థికి ట్యాబ్లెట్, లక్ష రూపాయాల విలువగల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, మిగతా వివరాల కోసం నయీంనగర్ ఇనిస్టిట్యూట్‌లో గానీ, లేదా 9703000850, 51, 52 నెంబర్స్‌కు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మోషన్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, మోషన్ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనిగరపు సుమన్, మార్కెటింగ్ టీం సభ్యులు తాళ్లపల్లి రమేశ్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మండల రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మామునూరు పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్

శంభునిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మామునూరు పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మామునూరులోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు స్టేషన్‌లో సిబ్బంది నిర్వహించే విధులను ఎస్ఐ శ్రీకాంత్ విద్యార్థులకు వివరించారు. ఆయుధాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులతో పాటు ప్రతీ పౌరుడిపై ఉందని విద్యార్థి దశ నుంచే బాధ్యత కలిగిన పౌరులుగా ఉండాలని ఎస్ఐ సూచించారు. స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రామ్‌ప్రకాశ్



మామునూరు క్యాంపులో బైక్ ర్యాలీలో కమాండెంట్ రామ్‌ప్రకాశ్

శంభునిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను నివారించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ బి.రామ్‌ప్రకాశ్ అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మామునూరు ఫోర్త్ బెటాలియన్ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని కమాండెంట్ రామ్‌ప్రకాశ్ ప్రారంభించి మాట్లాడారు. బెటాలియన్‌లోని స్పోర్ట్స్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ ఆర్టీఏ జంక్షన్ గణపతిదేవ మార్గం ద్వారా రంగశాయిపేట జంక్షన్ నుంచి మామునూరు, బొల్లికుంట వాగ్దేవి కళాశాల వరకు కొనసాగింది. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ ధరించాలని కమాండెంట్ ఈ సందర్భంగా వాహనదారులతో అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్‌ఐలు రవి, సర్వర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఏ. గోవిందరావు, కె. యాకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు సమర్పించిన సెలవుపత్రాల్లో సాంకేతిక తప్పులను ఎత్తి చూపుతూ, సెలవు తీసుకోవడానికి వీలులేదని పేర్కొంటూ సస్పెండ్ చేయడాన్ని తప్పుబట్టారు.

మహిళా అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మడికొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్(ఫిమేల్) ఎఎన్ఎం రెండేళ్ల కోర్సులో ఉచిత శిక్షణ కోసం నిరుద్యోగ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరబడుతున్నట్లు ప్రాంగణం డీఎం పి.జయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మహిళలు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ప్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ పేరు మీద రూ. 200 డీడీ తీసి www.chfw,telangana. gov.iవెబ్‌సైట్‌లో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం, MPHW(F) Training institute warangal కాలేజీ పేరు మీద సెలెక్ట్ చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 29 చివరి తేదీ అని డీఎం జయశ్రీ స్పష్టం చేశారు.

గ్రూప్-1లో జీవో 29తోనే నిరుద్యోగులకు న్యాయం

కేయూక్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ -1 పరీక్షల్లో జీవో 29తోనే నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ అన్నారు. శుక్రవారం కేయూ క్యాంపస్ లోని లైబ్రరీలో చదువుతున్న నిరుద్యోగ యువత, విద్యార్థులను నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ మేడారపు సుదాకర్ ఇతర నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి మానవతారాయ్ మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్షల్లో జీవో 29పై విష ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ మేడారపు సుదాకర్, తాళ్లపల్లి నరేశ్‌గౌడ్, పట్ల నాగరాజు, అభిరామ్, గుండేటి సుమన్, సాయి, వికాస్, హేమంత్ చౌదరి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 14 మంది వాహనదారులకు శుక్రవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 14 మంది వాహనదారులకు రూ.13,200 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వాహనదారునికి రూ. 500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

కాజీపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు కిందపడి ఓవివాహిత ఆత్మహత్యకు పాల్పడింది.. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం... సిద్దిపేట జిల్లాకు చెందిన పత్తి లావణ్య(38) కుటుంబం కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామంలో గత 14 ఏళ్లుగా ఉంటోంది. నగరంలో కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆమె శుక్రవారం ఉదయం అయోధ్యపురం రైల్వే గేట్‌వద్ద గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చారు. మృతురాలి బంధువులకు సమాచారం ఇచ్చామని, బంధువులు వస్తేనే ఆత్మహత్యకు పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్పారు. లావణ్యకు భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ పండుగ

శంభునిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శంభునిపేట ఖదీర్‌పురాలో శుక్రవారం ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. శంభునిపేటకు చెందిన గౌస్ ఏ ఆజామ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా ఉర్సు దర్గా పీఠాధిపతులు నవీద్ బాబా, ఉబేద్ బాబాలు హాజరయ్యారు. శంభునిపేట జంక్షన్ నుంచి భారీ ర్యాలీగా ప్రత్యేక వాహనంపై జెండాను ఊరేగించారు. అనంతరం ఖదీర్‌పురాలోని జెండా గద్దె వద్దకు చేరుకున్నారు.

శ్రీభద్రకాళి పరపతి సంఘం అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

వరంగల్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన శ్రీభద్రకాళీ పరపతి సంఘం అధ్యక్షుడిగా గుళ్లపల్లి రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి గోగికార్ కిరణ్ శుక్రవారం తెలిపారు. పరపతి సంఘం 21వ వార్షికోత్సవం గోవాలో సంఘం అధ్యక్షుడు గుల్లపల్లి రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. గత రెండు సంవత్సరాల కాలానికి ఆదాయ వ్యయాలకు సంబంధించిన నివేదికను సభ్యులకు సమర్పించారు.

రిటైర్‌మెంట్ తీసుకున్న వారికి ఉద్యోగాలివ్వొద్దు

కాజీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైల్వేలో రిటైర్‌మెంట్ అయిన వారికి తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కాజీపేట రైల్వే స్టేషన్‌మాస్టర్‌కు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నాయకులు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో దేశవ్యాప్తంగా వివిధ జోన్‌లలో ఖాళీగా వున్న 25 వేల ఉద్యోగాలు రిటైర్‌మెంట్ తీసుకున్నవారికి ఇచ్చేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకుందన్నారు.

భూగర్భజలాల పరిరక్షణ అందరి బాధ్యత

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరానికి ఎలాంటి నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు భూగర్భజలాలల పరిరక్షణ మన అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో భూగర్భ జలాలు, నీటివనరులపై వివిధ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి హోటల్, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో నీటి సరఫరాపై నిరంతర నిఘా ఉండేలా చూడాలన్నారు.

ఎంజీఎంలో మౌలిక వసతులపై అధ్యయనం

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుల ఆదేశాల మేరకు శుక్రవారం వరంగల్ డీఎంఈ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు. కమిటీ సభ్యులు డాక్టర్ నాగేందర్, డాక్టర్ సివి.శారద, డాక్టర్ విమల థామస్‌ల బృందం ఎంజీఎం ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్ని, వార్డులను సందర్శించారు. వంటశాల, మందుల విభాగం, ఓపీలో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ చిలుక మురళీ, ఆర్ఎంవో డాక్టర్ మురళి, అడిషనల్ ఆర్ఎంవో శశికుమార్ పాల్గొన్నారు.

నేడు మాదిగల ధర్మయుద్ధ మహాసభ

న్యూశాయంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ తెలిపారు.

సరైన జీవన శైలిని అలవర్చుకోవాలి

గిర్మాజీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు, సరైన జీవనశైలిని అలవర్చుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని భారతీయ సాంప్రదాయ వైద్యం ఆయుర్వేదం చెబుతోందని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ కే.అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం గిర్మాజీపేట ప్రభుత్వ పాధమిక పాఠశాలలో జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేద బోధన ఆస్పత్రి వైద్య శిబిరం నిర్వహించారు.

పశుగణన పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పశు గణాంకాల నమోదును అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశుగణన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నాలుగు నెలలపాటు 21వ జాతీయ పశుగణన ప్రక్రియ చేపట్టడం జరుగుతోందన్నారు. ఇందుకోసం జిల్లాలో 58 మంది పశుగణకర్తలు, 24 మంది పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. సుమారు 16 రకాల పశువుల సంఖ్యను లెక్కించి వాటి వివరాలను యాప్ నమోదు చేయనున్నట్లు వివరించారు. రైతులు, ప్రజలు పశుగణనకు సహకరించి కచ్చితమైన వివరాలు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాలకృష్ణ, జిల్లా నోడల్ అధికారి బాలాజీ, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నుంచి గుంటూరుకు డీలక్స్ సర్వీసు

బాలసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం నుంచి గుంటూరుకు ఆర్టీసీ డీలక్స్ సర్వీస్ బస్సులను నడుపుతున్నట్లు వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం డి. విజయ భాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు రెండు సర్వీసులు కాళేశ్వరం నుంచి ఉదయం 11:15 గంటలకు ప్రారంభమై రాత్రి 9:15 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. సాయంత్రం 5 గంటలకు మరో సర్వీసు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 11:15గంటలకు గుంటూరు చేరుకుంటుందన్నారు. గుంటూరు నుంచి ఉదయం8 గంటలకు ప్రారంభమై కాళేశ్వరానికి సాయంత్రం 6:20 గంటలకు చేరుకుంటుంది. మరో సర్వీసు సాయంత్రం 6:45 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5:15గంటలకు చేరుకుంటుంది. ఈ సర్వీసుల్లో కాళేశ్వరం నుంచి గుంటూరుకు పెద్దలకు రూ. 660, పిల్లలకు 360 చార్జీలు వసూలు చేయనున్నారు. పరకాల, భూపాలపల్లి, హనుమకొండ, ఖమ్మం, కోదాడ, విజయవాడ మీదుగా గుంటూరుకు వెళ్లనున్నట్లు ఈ పరిసర ప్రాంతాల ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆర్ఎం డి.విజయభాను ఓ ప్రకటనలో తెలిపారు.

కేఎంసీలో ఘనంగా ప్రారంభమైన కృతి సదస్సు

వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వైద్య విద్యార్థులు



సదస్సులో పాల్గొన్న వైద్య విద్యార్థులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీలో రెండు రోజులపాటు నిర్వహించే కృతి-2024 కార్యక్రమం మొదటి రోజు శుక్రవారం ఉద్వేగభరితంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ వైద్య కళాశాలల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు, ఫైనలిస్టులు ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. అలాగే వైద్యపరిజ్ఞానంపై ఆసక్తికరమైన జెపార్డీ శైలీ క్విజ్, వైరస్ వ్యాప్తిని అడ్డుకునే వ్యూహాలపై హ్యాకథాన్ కూడా నిర్వహించారు. అంతర్జాతీయ వైద్య వృత్తివైపు అడుగులు వేయాలని ఆశ పడుతున్న వారికి ఎంబాస్ నిర్వహించిన అనంతరం యూస్మైల్ వర్క్‌షాప్‌లో కీలకమైన అంశాలపై చర్చించారు. కీలకమైన సమాచారం అందించడంతో సదస్సుకు హాజరైన వైద్య విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

శంభునిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కళాశాల అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.రాజన్న ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకులతో కలిసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. అతిథి అధ్యాపకులకు కన్సాలిడేటెడ్ సాలరీ ఇవ్వాలన్నారు. ప్రతీ నెల వేతనాలు అందివ్వటం వలన అధ్యాపకుల ఆర్థిక ఇబ్బందులు కొంత మేరకు తీరుతాయన్నారు. అధ్యాపకులను ప్రతీ ఏడాది రీఎంగేజ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అతిథి అధ్యాపకుల స్థితిగతులను అర్థం చేసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

మూడు దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధికి కృషి

తూర్పు నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నేత ప్రభాకర్



ఖిలావరంగల్, అక్టోబరు 25:(ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఉమ్మడి జిల్లాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకుడు కొయ్యడ(కరాటే) ప్రభాకర్. ఆయన 1997-2002 వరకు యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా కొనసాగారు. 1992-1997 వరకు కల్పలత సూపర్ బజార్ అధ్యక్షుడిగా, 2004-2009 వరకు కాంగ్రెస్ వరంగల్ నగర అధ్యక్షుడిగా రెండోసారి, 2010-2011 వరకు ప్రజారాజ్యం పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. అలాగే మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా, అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లాలలో 150పైగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి వరంగల్ ఎంజీఎం, చిరంజీవి చారిటబుల్‌ట్రస్టు హైదరాబాద్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. నగరంలోని పలువురి నిరుపేద యువతుల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం చేశారు. నిరుపేద మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. 2023 వరంగల్ తూర్పునియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రతిపాదించిన కొండా సురేఖ గెలుపుకోసం నియోజకవర్గంలో అధిష్టానం ఆదేశాలతో నెలరోజుల పాటు గడపగడపకు తిరిగి చేయి గుర్తుకు ఓటు వేయించారు. మూడు దశాబ్దాలుగా పార్టీకోసం కృషి చేసిన ప్రభాకర్‌కు పార్టీ అధిష్టానంతో పాటు, జిల్లా మంత్రి కొండా సురేఖ- మురళీధర్‌రావు దంపతులు రాష్ట్ర, జిల్లా నామినేటెడ్ పోస్టును ఇస్తారని ఆశిస్తున్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

గిర్మాజీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో థానేకు చెందిన ఓవ్యక్తిని అరెస్ట్ చేసి 10 కిలోల ఎండు గంజాయిని జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర థానేకు చెందిన గోవింద్ జాదవ్ ఒడిస్సా రాష్ట్రం బరంపుర్‌లో ఎండు గంజాయి కొనుగోలు చేసి ముంబాయి వెళ్లేందుకు బుధవారం బరంపూర్ నుంచి ముంబాయికి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. గురువారం మధ్యాహ్నం వరంగల్ చేరుకున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసులు తనఖీలు చేస్తుండగా గోవింద్ జాదవ్ పోలీసులను చూసి రైలు దిగి స్టేషన్ నుంచి బయటకు వెళ్లాడు. కొద్ది గంటల తరువాత తిరిగి సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్ చేరుకున్న గోవింద్ జాదవ్ సికింద్రాబాద్ వెళ్లేందుకు నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ కోసం 2వ ప్లాట్‌ఫాంపై వేచి ఉన్నాడు. విధి నిర్వహణలో భాగంగా జీఆర్‌పీ ఎస్సై మోహినుద్దిన్ ఆధ్వర్యంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ బృందం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన గోవింద్ జాదవ్‌ను శుక్రవారం సాయంత్రం అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతడి వద్ద బ్యాగులో 10.200 కిలోల ఎండు గంజాయి లభించిందని సీఐ సురేందర్ తెలిపారు. పట్టుకున్న గంజాయితో సహా నిందితుడు గోవింద్ జాదవ్‌ను వరంగల్ జీఆర్‌పీకి తరలించి కేసు నమోదు చేసి శుక్రవారం కాజీపేట రైల్వే కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2.55లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

చెరువును పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



చెరువులో చేపపిల్లలను పోస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట కోనారెడ్డి చెరువుకు సంబంధించిన భూమిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం కోనారెడ్డి చెరువులో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి చెరువులో చేప పిల్లలను వదిలారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప మత్స్యకారులను ఆదుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో సాగుతున్నామన్నారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల, టౌన్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, ఎద్దు సత్యనారాయణ, మైస సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 37 మంది లబ్ధిదారులకు రూ.37,04,092లు విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అర్హులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీవో వెంకటరమణ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ మత్స్య విభాగం జిల్లా అధ్యక్షుడు జి.సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ దర్శనం

హేమాచల క్షేత్రం
ఆధ్యాత్మిక సౌరభం





హేమాచల క్షేత్ర ముఖద్వారం

గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్

- తిరుమలను తలపించే కొండకోనలు
- ప్రకృతి అందాల మధ్య వేంచేసిన లక్ష్మీనృసింహుడు
- గుహాంతర్భాగంలో కొలువైన స్వామి వారు
- పలు ఉప దేవాలయాల దర్శనంతో పరవశిస్తున్న భక్తులు
- అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా గుర్తింపు కోసం ఎదురుచూపు

మంగపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చుట్టూ పచ్చని చెట్లు. ఎత్తైన కొండలు. గలగలాపారే సేలయేర్లు. తిరుమల ఏడుకొండలను తలపించేలా ఆహ్లాదకర వాతావరణంతో పాటు మనసునిండా ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతోంది హేమాచలక్షేత్రం. స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి విగ్రహం, చుట్టూ ఆరు ఉప దేవాలయాలతో వర్ధిల్లుతోంది ఈ చారిత్రత్మక పుణ్యక్షేత్రం. ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై గుహాంతర్భాగంలో వేంచేసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత స్వయంబు పుట్టుస్వామి.. భక్తుల కొంగుబంగారంగా ఆశీస్సులందిస్తున్నారు. ఆలయానికి ఓ వైపు ఆదిపరాశక్తి ధైతమాత విగ్రహం దర్శనమిస్తుండగా.. మరోవైపు ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి పేరిట చింతామణి జలధారల నుంచి నిత్యం స్వచ్ఛమైన నీరు వస్తుంది. ఈ నీటిలో స్నానాలు చేయడం, 41 రోజుల పాటు పరగడుపున, రాత్రి నిద్రపోయే ముందు తాగడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరమవుతాయని భక్తులు నమ్ముతారు. ఇక గుహ అంతర్భాగంలో 8అడుగుల ఎత్తులో నరసింహ అవతారంలో స్వామివారు దర్శనమి స్తుంటారు. చింతామణి జలధారలకు పర్లాంగు దూరంలో ఎద్దుముక్కు ఆంజనేయస్వామి, గుట్ట పాత కాలి బాటన కిలో మీటరు దూరంలో శిఖాంజనేయా స్వామి దేవాలయాలున్నాయి. ఈ హేమాచలకొండలు అర్ధ చంద్రాకారంలో చూపరులను ఆకట్టుకొంటున్నాయి. తిరుమల తరహాలో ఇక్కడ వేసవికాలంలోనూ చల్లగా ఉంటుంది. ఎంతో ప్రాముఖ్యం కలిగిన ఈ క్షేత్రం అభివృద్ధిపై ప్రభుత్వాలు పట్టించుకోకపోవడాన్ని భక్తులు ఆక్షేపిస్తున్నారు. నిత్యం ఈ దేవాలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున గల ఛత్తీ్‌సగఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు తరలొచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో విడిది చేసేందుకు ప్రత్యేక భవనాలు వసతులు లేవు. అడవి కొండ ప్రాంతం కావడంతో భక్తులకు రాత్రి వేళల్లో రక్షణ ఉండటం లేదు. 2017కు ముందు దుకాణాల సముదాయంతో ఆలయం కళకళలాడుతూ కన్పించేది. ఇప్పుడు ఆ షాపుల వేలం విషయంలోనూ వివాదాలే ఉన్నాయి. దాంతో వేలం పాటలు జరగక రూ.లక్షల్లో ఆదాయం కోల్పోయే పరిస్థితి. గుడి ఆదాయం విషయంలో గిరిజన, గిరిజనేతర వివాదాలు తీవ్ర అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు కేవలం పులిహోర, లడ్డూ ప్రసాదాలు మాత్రమే సిబ్బందితో తయా రు చేయించి విక్రయిస్తున్నారు. ఈ విక్రయాలలో కూడా భక్తులకు సరిగా ప్రసాదాలు అందక నిరుత్సాహం చెందుతున్నారు.

పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి

ప్రకృతి సుందరమైన ఈ ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యటక కేంద్రంగా ప్రకటించి వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు, భక్తులు కోరుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు మల్లూరుకు చేరుకుని అక్కడి నుంచి కొండపైకి ఐదు కిలో మీటర్ల వరకు ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలతో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కొండపైకి రహదారి సౌకర్యం ఉన్నా, ఆర్టీసీ బస్సుల్లేకపోవడం సాధారణ, మధ్యతరగతి భక్తులకు భారంగా మారింది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పూరాతన దేవాలయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించక పోవడంతో భక్తులు ప్రభుత్వం తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.



స్వచ్ఛమైన చింతామణి జలధార



హేమాచల క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



యెర్రంకాని వీరన్‌కుమార్, మల్లూరు

పూర్వ కాలం నుంచి పేరుగాంచిన ఈ దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి. భక్తులకు ఆలయ పరిసరాలతో పాటు ఆలయ దర్శనాలు, రవాణా, వసతి సౌకర్యాలు కల్పించాలి. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని కోల్పోకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

వివాదాలు తొలగాలి



దీకొండ నర్సింహరావు, బోరునర్సాపురం, భక్తుడు

దేవస్థానం విషయంలో ఉన్న పలు వివాదాలు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు తొలగాలి. అప్పుడే భక్తుల ఇబ్బందులను తొలగుతాయి. దేవస్థానం అధికారులు, అర్చక, ఉద్యోగులు భక్తులకు ఎలాంటి అవకతవకలు లేకుండా చూస్తూ, భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

కోర్టు తీర్పు పెండింగ్‌తో ఇబ్బందులు

శ్రవణపు సత్యనారాయణ, మల్లూరు దేవస్థానం ఈవో

గతంలో ఆలయం సజావుగా జరిగేది. దేవస్థానం విషయం కోర్టుకు వెళ్లిన తర్వాత ఆదాయం సరిగా సమకూరడం లేదు. కోర్టు తీర్పు వెలుడినా, లేకున్నా, తమశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సక్రమంగానే అందరి సహాయ సహకారాలతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకొంటున్నాం.

వైభవంగా ముగిసిన సహస్ర చండీయాగం

- పూర్ణాహుతికి వేలాది మంది భక్తుల రాక
- దేవాదాయ శాఖ ఏసీ, ప్రముఖుల హాజరు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం ఐదు రోజుల పాటు 80 మంది రుత్వికులచే అత్యంత వైభవంగా నిర్వహించిన సహస్ర చండీయాగం శుక్రవారం మహా పూర్ణాహుతితో ముగిసింది. నగరంలోని రామన్నపేట పోతన రోడ్డులో గల మణిదీ్‌ప్ గార్డెన్‌లో జరిగిన సహస్ర చండీయాగాన్ని కర్ణాటక రాష్ట్రం ఉడిపికి చెందిన సామవేద పండితులు బ్రహ్మశ్రీ శ్రీకాంత్ అడిగ నేతృత్వంలో జరిగిన సహస్ర చండీయాగానికి దాదాపు 50 హోమ గుండాలను ఏర్పాటు చేసి 80 మంది రుత్వికులచే వేద పారాయణం జరిపించారు. ఆఖరి రోజు శుక్రవారం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా భక్తమండలి ఆధ్వర్యంలో 500 మంది మహిళలు ఐదు రోజుల పాటు సామూహికంగా శ్రీలలిత సహస్ర నామ పారాయణం, శ్రీగీతా పారాయ ణాన్ని నిర్వహించారు. ఈ మహా పూర్ణాహుతి కార్యక్రమానికి దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునిత, చాంబర్ ఆఫ్ కామర్స్, వ్యాపారులు, వైశ్య సంఘం ప్రతినిధులతో పాటు చింతాకుల సునిల్, చింతాకుల అనిల్, పడిశాల సుజాత, ప్రముఖ అర్చకులు, మహిళా మండళ్లు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది మందికి మహా అన్నదానం నిర్వహించారు.



చండీయాగం పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

సౌత్ జోన్ పురుషుల బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక


కేయూక్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈనెల 26 నుంచి 29 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ జట్టు ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం ప్రకటించారు. ఎంపికైన వారిలో పి.సాయి అరవింద్, (వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట), జి.మోహన్‌దాస్, జి.శృతి, ఎం.వేణు(వాగ్దేవి డిగ్రీ కళాశాల, హనుమకొండ), వి.రుపాక్ రామన్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రంగశాయిపేట), కె.తులసి దాస్(మహర్షి డిగ్రీ కళాశాల, ములుగు), సీహెచ్.సాయికృష్ణ, (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి)లు ఎంపికైనట్లు వెంకయ్య తెలిపారు. జట్టుకు మేనేజర్‌గా బొల్లికుంటలోని వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ యు.రవీందర్ వ్యవరిస్తారు. ఎంపికైన జట్టును కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి,స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.



ఎంపికైన బ్యాడ్మింటన్ జట్టు క్రీడాకారులు

అల్లు అర్జున్ పిటిషన్‌పై 6న నిర్ణయం వెల్లడిస్తాం

- అప్పటివరకు ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలు వద్దు: ఏపీ హైకోర్టు
- అది ఎన్నికల కోడ్ ఉల్లంఘున కాదు: అల్లు అర్జున్ తరపు న్యాయవాది



అమరావతి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ నంద్యాల పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సినీనటుడు అల్లు అర్జున్, వైసీపీ మాజీ ఎమ్మెల్యే రవి చంద్రకిశోర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో నవంబర్ 6న నిర్ణయం వెల్లడిస్తామని న్యాయస్థానం ప్రకటించింది. అప్పటివరకు ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలు అన్నింటినీ నిలిపేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. అల్లు అర్జున్ పర్యటన పూర్తి వ్యక్తిగతమని, స్నేహం కారణంగానే కిశోర్‌రెడ్డిని అభినందించేందుకు ఈ ఏడాది మే11న నంద్యాల వెళ్లారని చెప్పారు. అల్లు అర్జున్ వచ్చాడని తెలిసి ఆయన ఫ్యాన్స్ కిశోర్‌రెడ్డి ఇంటి వద్దకు వచ్చారన్నారు. ఇది ఎన్నికల నియమావళి ఉల్లంఘన కాదని, పిటిషనర్లపై డిప్యూటీ తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు చెల్లుబాటు కాదన్నారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ.. కేసులో పోలీసులు ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. అయితే ట్రయల్ కోర్టు ఇంకా నంబర్ కేటాయించలేదన్నారు. ఈ నేపథ్యంలోనే వై.నాగిరెడ్డి స్పందిస్తూ.. ట్రయల్ కోర్టు చార్జిషీట్‌ను కాగ్నిజెన్స్‌లోకి తీసుకోలేదన్నారు. క్వాష్ పిటిషన్‌పై నిర్ణయం వెల్లడించేవరకు ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలన్నింటినీ నిలువరిస్తూ ఉత్తర్వులివ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి.. పిటిషన్‌పై నవంబర్ 6న నిర్ణయం వెల్లడిస్తామన్నారు.

నేడు, రేపు సింహపురి ఎక్స్‌ప్రెస్ రద్దు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : శని, ఆదివారాల్లో సికింద్రాబాద్-గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. శనివారం నాడు సికింద్రాబాద్ నుంచి బయల్దేరే(12710) రైలును ర ద్దు చేయగా, ఆదివారం గూడూరు నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే(12709) రైలు కూడా రద్దయినట్లు అధికారులు పేర్కొన్నారు. దానా తుపాను కారణంగా హౌరా నుంచి సికింద్రాబాద్‌కు రావాల్సిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రద్దు కావడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌కు కనెక్టింగ్ రైలు కావడంతో సింహపురి ఎక్స్‌ప్రెస్ నడిపేందుకు రేక్ కొరత ఏర్పడినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు నేపథ్యంలో ఆయా రోజుల్లో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు పూర్తి సొమ్ము వాపసు చేయనున్నట్లు తెలిపారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యేకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి హైకోర్టులో ఊరట లభించింది. ఆమె ఎన్నిక చెల్లదని పేర్కొంటూ, కాంగ్రెస్ నేత అజ్మీరా శ్యాం దాఖలు చేసిన ఎలక్షన్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన అజ్మీరా శ్యాం బీఆర్ఎస్ అభ్యర్థి కోవా లక్ష్మి చేతిలో ఓటమిపాలయ్యారు. లక్ష్మి తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆదాయపు పన్ను వివరాలను దాచిపెట్టారని, అందువల్ల ఆ ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ ఆయన ఎలక్షన్ పిటిషన్ (ఈపీ) దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. కేసులో మెరిట్స్ లేకపోవడంతో కొట్టేస్తున్నట్లు ప్రకటించింది.

వణికిస్తున్న చలి పులి..!

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి ప్రభావం మొదలైంది. కొన్ని జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం రాత్రి సంగారెడ్డి, వికారాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఉష్ణోగ్రత 16 డిగ్రీలకు చేరుకుంది. మరో డిగ్రీ తగ్గితే చలి తీవ్రతకు యెల్లో అలెర్ట్ జారీ చేస్తారు. అక్టోబరు చివరివారంలోనే ఇలా ఉంటే ముున్ముందు ఇంకెలా ఉంటుందోనని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాగల మూడ్రోజులు కనిష్ట ఉష్ణోగ్రతలు 17-22 డిగ్రీల మధ్య నమోదవుతాయని, పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు 30-33 డిగ్రీల మధ్య నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

నాన్న ఆదేశించారు..
అమ్మ వెయ్యిసార్లు చెప్పింది

అవన్నీ కుటుంబ ఆస్తులే.. నా సోదరుడు జగన్ గార్డియన్ మాత్రమే.. నా బిడ్డలకు రావాల్సిందే అడుగుతున్నా

- కొడుకు నిర్వాకంతో తల్లి క్షోభిస్తోంది
- వైఎస్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించిన అన్నివ్యాపారాలూ కుటుంబ వ్యాపారాలేనని, అందులో తన నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానవాటా ఉండాలన్నది ఆయన ఆదేశమని, అమ్మ కూడా కనీసం వెయ్యిసార్లు ఇదే విషయం చెప్పారని వారి కుమార్తె, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వ్యాపారాలకు, ఆస్తులకు తన సోదరుడు జగన్ గార్డియన్ మాత్రమేనన్నారు. ఆస్తులు ఎగ్గొట్టడానికి కన్న కొడుకే కేసులు పెట్టి కోర్టుకు లాగడంతో తన తల్లి విజయలక్ష్మి క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని వైఎస్ అభిమానులకు శుక్రవారం ఆమె బహిరంగ లేఖ రాశారు. గత కొద్దిరోజులుగా వైఎస్ కుటుంబ ఆస్తుల గొడవల నేపథ్యంలో షర్మిలను నిందిస్తూ జగన్ పత్రిక శుక్రవారం సంచికలో ఒక కథనం ప్రచురించింది. ఈ కథనాన్ని ఖండించడం తోపాటు వైఎస్ అభిమానులకు వాస్తవాలు తెలియాలని లేఖ రాస్తున్నట్టు ఆమె తెలిపారు. జగన్ పత్రిక శుక్రవారం సంచికలో వండి వార్చిన అబద్ధపు కథనంలో తెలిపినట్టు... వైఎస్ బతికుండగా ఏ ఒక్క ఆస్తి పంపకమూ జరగలేదని, ఈరోజుకూ న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా తన చేతుల్లో లేదన్నారు. వైఎస్ కుటుంబ కంపెనీల్లోని వాటాలను పంచుకోవడం వల్ల జగన్ బెయిల్‌కు వచ్చిన ముప్పేం లేదని, అది రద్దయ్యే అవకాశం ఉండబోదన్నారు. ఇంకా షర్మిల ఏమన్నారంటే.. 'మా నాన్న గురించి అమ్మ ఒక పుస్తకం రాసింది. అందులో.. రాజశేఖరరెడ్డికి లోకమంతా ఒక ఎత్తయితే.. షర్మిల ఒక ఎత్తు అంటూ రాశారు. ఆడపిల్లను అని నన్ను ఆయన ఎన్నడూ చిన్నచూపు చూడలేదు. ఆయన బతికున్నంతకాలం తనకు మనవడు, మనమరాళ్లు సమానమేనని చెప్పేవా రు, వ్యాపారాలన్నింటినీ నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా పంచి పెట్ట డం జగన్ బాధ్యత. ఇది మా నాన్న ఆదేశం. నా కు, జగన్‌తోపాటు భారతీరెడ్డి, మనవడు, మనుమరాళ్లు, వైఎస్ స్నేహితులు కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డికి కూడా తెలుసు. సండూర్ మినహా.. సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ.. ఏమైనా నలుగురి బిడ్డలకూ సమానమే. నాన్న బతికుండగా ఏ ఆస్తి పంపకమూ జరగలేదు. ఈరోజుకూ ఒక్క ఆస్తి నా చేతుల్లో లేదు'



జగన్ ఆస్తిని అడిగాననడం అబద్ధం..

'జగన్ ఆస్తుల్లో వాటా నేను అడుగుతున్నాను అనేది హాస్యాస్పదం. అది అవాస్తవం. అవి కుటుంబ ఆస్తులు కావడం వల్లే వాటి గురించి ఇప్పటిదాకా మాట్లాడలేదు. నాకు ఈ ఆస్తులపై మోజులేదు. జగన్ పెట్టిన హింసలకు ఆస్తులు కావాలన్న కోరిక నాకు లేకుండా పోయింది. నాన్న అభిమతం ఒక్కటే నాకు, అమ్మకు ముఖ్యం.ఇప్పటికీ అమ్మ వెయ్యిసార్లు వీళ్లను (జగన్, భారతీ) అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా పట్టించుకోలేదు. కొత్త పార్టీ పెట్టి అధికారంలోకి రావడానికి ముందు పదేళ్లు జగన్ ఇబ్బందులు పడుతుంటే, ఆ ఇబ్బందులు నావిగా భావించా. తోడబుట్టినవాడి కోసం జగన్‌నూ.. వైసీపీనీ నా భుజాలపై మోశాను. ఆ పదేళ్ల పాటు బాగానే చూసుకున్నారు. జగన్ నన్ను తన పెద్ద కూతురునని ప్రకటించారు. మా నాన్న కోరుకున్నట్టే... నా పిల్లలను, తమ పిల్లలను జగన్ ఒకేలా చూశారు. షర్మిలకు ఇచ్చానని జగన్ చెబుతున్న రూ.200 కోట్లు ఈ కాలంలోనే నాకు ఇచ్చారు. అదీ డివిడెండ్‌గానే. వ్యాపారాల్లో నా బిడ్డలకు సమాన వాటా ఉన్నదని గుర్తించి.. కంపెనీల్లోని డివిడెండ్‌లో సగంవాటా నాకు ఇచ్చారు. అప్పుగా దానిని చూపించమని చెప్పారు'

బెజవాడకు పిలిపించి... చెప్పిందిదీ..

'అయితే...2019లో జగన్ సీఎం అయ్యాక గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. సీఎం అయిన నెల రోజులకే 'విడిపోదాం' అని ఇజ్రాయెల్ పర్యటనలో ప్రతిపాదన పెట్టారు. విజయవాడ వచ్చాక భారతీ సిమెంట్స్, సాక్షిలో 60% వాటా కావాలని జగన్ పట్టుబట్టారు. నాకు వాటిలో 40% ఇస్తానన్నారు. ఈ ప్రతిపాదన మాకు నచ్చలేదు. అయితే.. అమ్మ మాటను బుల్డోజ్ చేసి.. సాక్షిలో 40%.. భారతీ సిమెంట్స్‌లో వాళ్లకు చెందిన 49%లో 40%, సరస్వతి పవర్‌లో 100%, యలహంక ప్రాపర్టీలో 100%, వైఎస్ నివాసమున్న ఇల్లు, ఇంకా కొన్ని ఆస్తులు... నా భాగం కింద చూపించారు. ఆ మేరకు ఎంఓయూ తయారైంది. సరస్వతి సిమెంట్స్ వాటాలు, యలహంక ప్రాపర్టీ ఈడీ అటాచ్‌మెంట్‌లో లేవని, అవి వెంటనే రాసిస్తామని.. మిగతా ఆస్తులు కేసుల వ్యవహారం తేలాక బదిలీ చేస్తామని ఆ ఎంవోయూలో పేర్కొన్నారు. ఇదంతా నా ఆస్తిని నాకు ఇవ్వడానికి జరిపిన ప్రక్రియ.. అంతే. ప్రేమాభిమానాలతో జరిపిన కేటాయింపులు ఏమాత్రం కావు' అని ఆమె పేర్కొన్నారు.

గత ఐదేళ్లూ నాపై వేధింపులే..

- లేఖలో బయటపెట్టిన షర్మిల
- అక్షరసత్యమని తేలిన 'ఆంధ్రజ్యోతి' 'రాయబారం' కథనం

అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగన్ సీఎంగా ఉన్న గత ఐదేళ్లూ తనను అన్ని విధాలా వేధింపులకు గురి చేశారని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ అభిమానులకు రాసిన లేఖలో అప్పటి విషయాలు ఆమె పంచుకున్నారు. 2019లో నేను రాజకీయాల్లో అడుగుపెట్టాను. మొదట తెలంగాణలో, ఆ తర్వాత ఏపీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించాను. అప్పటినుంచి, గత ఐదేళ్లూ తన పత్రిక, వైసీపీ మూకల ద్వారా నాపై జగన్ దుష్ప్రచారం సాగించారు. పెళ్లయినదానినన్న ఇంగితం కూడా లేకుండా వ్యక్తిత్వ హననానికి ఒడిగట్టారు. మా బాబాయ్‌పైనా తన పత్రికలో అసభ్యంగా ఫొటోలను ప్రచురించారు. ఏపీలో వైసీపీ ఓడాక.. జగన్ నా వద్దకు బంధువులను రాయబారం కోసం పంపించారు. వివాదాలు వద్దు.. సామరస్యంగా ఆస్తి వివాదాలు పరిష్కరించుకుందామని వారి ద్వారా చెప్పి పంపించారు. (సరిగ్గా ఇదే విషయాన్ని 'షర్మిలతో రాయబేరం' అనే పేరిట సోమవారం సంచికలో ప్రచురించిన కథనంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది) అయితే, ఈ రాయబారంలో జగన్ ఒక షరతు పెట్టారు. భవిష్యత్తులో జగన్, భారతి, అవినాశ్‌రెడ్డిపై నేను రాజకీయ విమర్శలు చేయరాదని ఆంక్షలు పెట్టారు. ఇది నా వృత్తి ధర్మానికి విరుద్ధమని సెటిల్‌మెంట్‌కు ఒప్పుకోలేదు. దీంతో మరింత వేధింపులకు గురిచేశారు. ఎన్‌సీఎల్‌టీ ట్రైబ్యునల్‌లో నాపై, అమ్మపై జగన్ కేసు పెట్టారు' అని షర్మిల చెప్పారు. 'సొంత చెల్లి, తల్లిపై కేసు వేసి రోడ్డు మీదకు లాగిన అపకీర్తిని జగన్ మూటగట్టుకున్నారు. దానినుంచి బయటపడటం కోసం కొత్తగా బెయిల్ రద్దు అంశం తెరపైకి తెచ్చారు. కానీ, షేర్లు బదలాయింపు జరగాల్సిన సరస్వతి పవర్ కంపెనీ ఈడీ అటాచ్‌లో లేదు. ఆయన బెయిల్‌కు వచ్చిన ముప్పేం లేదు. సాధారణంగా కుటుంబ, స్నేహబంధంతో మనుషులు ఒక్కటవుతారు. కానీ రాష్ట్రంలో వైఎస్ బంధం అనేది మనల్ని ఏకం చేసింది అందువల్లే వాస్తవాలు తెలియాలని బహిరంగ లేఖ రాస్తున్నా' అని పేర్కొన్నారు.

తెలంగాణలో అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పండి!

- మలేషియా ప్రభుత్వానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్రి ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు పెట్టుబడులు పెట్టడానికి ముందుకురావాలని మలేషియా దేశ వ్యవసాయ మంత్రి మహ్మద్ బిన్ సాబుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మలేషియా పర్యటనలో ఉన్న మంత్రి.. శుక్రవారం పలు ప్రతిపాదనలు అక్కడి ప్రభుత్వం ముందు ఉంచారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని కోరగా, మలేషియా వ్యవసాయశాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఫెల్డా ఛైర్మన్ అహ్మద్ షబేరీ చీక్‌తోపాటు తన ప్రతినిధి బృందంతో మంత్రి తుమ్మల సమావేశమై ఆయిల్ పామ్ రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించారు. ఆయిల్ పాం రైతులకు ప్రయోజనకరంగా ఉండే పద్ధతులపై చర్చించారు. మలేషియాలో భారత హైకమిషనర్ బీఎన్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెనాషియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించి, యాంత్రీకరణకు సంబంధించి అక్కడ వివిధ రకాల యంత్రాలు, పనిముట్లు, వాటి పనివిధానాన్ని పరిశీలించారు. మలేషియా పర్యటనలో రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్‌బాషా, అడిషనల్ డైరెక్టర్ సరోజిని, ఓఎస్డీ శ్రీధర్ పాల్గొన్నారు.

పత్తి రైతుల సౌకర్యం కోసం 'వాట్సప్'!

పత్తి రైతుల సౌలభ్యం కోసం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వాట్సప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. 8897281111 అనే వాట్సప్ నెంబరుతో పత్తి రైతులు, పత్తి కొనుగోలు సంబంధిత సేవలు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. రైతు పత్తి అమ్మకం, అర్హత, అమ్మకాల వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్లలో వేచి ఉండే సమయం, కొనుగోళ్ల వివరాలను రైతులు తమ ఇంటి వద్దనే ఉండి ఈ వాట్సప్ చాట్ ద్వారా తెలుసుకొనే వెసులుబాటు ఉంటుందన్నారు. అలాగే ఇబ్బందులున్నా వాట్సప్ ద్వారా తెలపాలని సూచించారు.



మలేషియా పర్యటనలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ప్రతినిధుల బృందం

మంత్రి కొండా సురేఖకు ఎదురుదెబ్బ

- కేటీఆర్ పరువు నష్టం దావాలో మంత్రిపై కోర్టు ఆగ్రహం
- మంత్రి స్థానంలో ఉండి అలా మాట్లాడటం తగదని వ్యాఖ్య

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన రూ.100 కోట్ల సివిల్ పరువు నష్టం దావా కేసుకు సంబంధించి మంత్రి కొండా సురేఖపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సినీ నటులు నాగచైతన్య-సమంతల విడాకుల విషయమ్మీద కేటీఆర్‌పై సురేఖ చేసిన వ్యాఖ్యలు సమాజంపై చెడు ప్రభావం చూపే అవకాశముందని, అందుకే ప్రజా వీక్షక సాధనాల్లో ఈ ఉదంతానికి సంబంధించిన సమాచారాన్నంతా వెంటనే తొలగించాలని ఆదేశించింది. బాధ్యత గల ఓ మహిళా మంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందని జడ్జి విస్మయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మంత్రి పదవిలో ఉండి అసభ్యకరంగా మాట్లాడటం తగదని సురేఖను మందలించింది. ఈ విషయమై మరోసారి కేటీఆర్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఉత్తర్వుల్లో పేర్కొంది. సురేఖతో పాటు ఆమెకు సంబంధించిన వారు, అనుచరులు కూడా ఇకపై ఈ విషయమై ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని స్పష్టం చేసింది. ఈ ఉదంతానికి సంబంధించి ఆమె చేసిన వ్యాఖ్యలను ప్రజా వీక్షక సాధనాల్లో నుంచి తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. యూట్యూబ్‌తో పాటు ఫేస్‌బుక్, గూగుల్, మెటా తదితర అన్ని సోషల్‌మీడియా వేదికల నుంచి సురేఖ మాట్లాడిన వీడియోలు, వార్తలు తొలగించాలని ఆ సంస్థలకు ఉత్తర్వులిచ్చింది.

హైడ్రా ఆర్డినెన్స్‌పై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైడ్రాకు చట్టబద్ధతను కల్పిస్తూ జారీచేసిన ఆర్డినెన్స్ నెంబరు 4 ఆఫ్ 2024పై వివరణ ఇవ్వాలని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. హైడ్రాకు చట్టబద్ధత కల్పించేందుకు జీహెచ్ఎంసీ చట్టం- 1955లో 384-బీ క్లాజ్‌ను కొత్తగా చేరుస్తూ ప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామానికి చెందిన మాజీ కార్పొరేటర్ మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. మూడువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

రామయ్య సన్నిధిలో గవర్నర్ జిష్ణు వర్మ

- భద్రాచలంలో 20 పడకల తలసీమియా వార్డు ప్రారంభం

భద్రాచలం, కొత్తగూడెం/ ఖమ్మం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శుక్రవారం దర్శించుకున్నారు. శ్రీరాముని సన్నిధికి విచ్చేసిన గవర్నర్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతించారు. ఆలయంలో మూలవరుల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. కాగా, రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో భద్రాచలంలో ఏర్పాటు చేసిన తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వార్డును ఈ పర్యటనలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించారు. కాగా, ఏపీలో విలీనమైన ఎటపాక, గుండాల, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం పంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలంలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలంటూ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య తదితరులు గవర్నర్‌ను ఈ సందర్భంగా కోరారు.

'బేగంపేట'లో అపోలో విమానానికి 'డ్యామేజీ'

స్పందించని విమానాశ్రయ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు

బేగంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బేగంపేట విమానాశ్రమంలో నిలిపి ఉంచిన అపోలో ఆస్పత్రుల యాజమాన్యానికి చెందిన విమానం ఇంజన్ పరికరాలకు గుర్తు తెలియని వ్యక్తులు స్వల్పంగా నష్టం కలిగించారు. దీనిపై విమానాశ్రయ అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో అపోలో ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపోలోకు చెందిన వీటీ-పీసీఆర్ ఎయిర్ క్రాఫ్ట్‌ను బేగంపేట విమానాశ్రయంలో పార్క్ చేస్తుంటారు. ఈ క్రమంలో సదరు విమానం ఈ ఏడాది ఏప్రిల్ 5కు ముందు రెండు వారాల పాటు అక్కడే ఉంది. అయితే, ఏప్రిల్ 5న చెన్నై వెళ్లేందుకు విమానాన్ని పరిశీలించగా ఇంజన్‌లోని కొన్ని పరికరాలు స్వల్పంగా దెబ్బతిని ఉండడాన్ని గుర్తించారు. ఈ మేరకు అపోలో ఆస్పత్రుల చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జగ్జీత్‌సింగ్ బేగంపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు.

ఏసీబీ వలలో ఇన్‌చార్జి ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్

ఘట్‌కేసర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మునిసిపల్ ఇన్‌చార్జి ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీ.. ఓ కాంట్రాక్టరు నుంచి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ పరిధిలోని ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు వద్ద ఘట్‌కేసర్ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో క్రేన్లు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు టెండర్లు పొందిన కాంట్రాక్టరు మూడు క్రేన్లను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను రూ.10లక్షల బిల్లు రావాల్సి ఉండగా.. ఏఈ రాజశేఖర్ రూ.1.5లక్షలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీ రూ.60వేలు డిమాండ్ చేశారు. ఈ విషయమై సదరు కాంట్రాక్టరు.. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రూ.50వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఏఈ రాజశేఖర్‌ను పట్టుకున్నారు. అంతకుముందే రూ.30వేలు తీసుకున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీని కూడా అదుపులోకి తీసుకున్నారు.

చీరకొంగులో చిట్టీలు దాచి దొరికిన మహిళ

- గ్రూప్-1 మెయిన్స్‌లో వెలుగుచూసిన కాపీయింగ్
- కాపీయింగ్ చేసింది ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలే!

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో కాపీయింగ్ వెలుగుచూసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో శుక్రవారం ఓ మహిళ కాపీయింగ్ చేస్తూ దొరికిపోయింది. చీర కొంగులో చీటీలు పెట్టుకొచ్చి, కాపీయింగ్ చేస్తుండగా పరీక్ష నిర్వహకుడు గమనించి వెంటనే పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంటెంట్ శివారెడ్డికి సమాచారమిచ్చారు. దీంతో ఆమెను పరీక్ష రాయనీయకుండా నిలిపివేసి ఉన్నతాధికారులకు సమాచారమందించారు. అనంతరం చీఫ్ సూపరిండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కాగా, కాపీయింగ్‌కు పాల్పడిన మహిళ వనపర్తి జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండటం గమనార్హం. అయితే ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది నేడు వెల్లడించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం

ఆదిలాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆదిలాబాద్‌లో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో కేటీఆర్ దిష్టిబొమ్మలను కార్యకర్తలు దహనం చేశారు. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కులేదని కాంగ్రెస్ ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

కేటీఆర్‌లో వణుకు మొదలైంది: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుందని, ఈ టెన్షన్‌లోనే ఆయన నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. పార్టీ మారిన వారు వ్యభిచారులంటూ కేటీఆర్ మాట్లాడుతున్నాడని, పదేళ్లలో 60 మందికి పైగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న కేసీఆర్‌కు ఏ పేరు పెట్టాలో ఆయనే చెప్పాలని ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎనలేని సేవలు చేశారని, ఆయన్ను పార్టీ కాపాడుకుంటుందని మధుయాష్కీ గౌడ్ అన్నారు. గంగారెడ్డి హత్యతో జీవన్‌రెడ్డి పార్టీ నాయకత్వం తీరు పట్ల అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో ఆయన నివాసానికి వెళ్లి మధుయాష్కీ పరామర్శించారు. పార్టీ, ప్రభుత్వం పట్ల జీవన్‌రెడ్డి తెలిపిన అభ్యంతరాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సమస్యలు కొని తెచ్చుకోవద్దు!

ఇతరుల తప్పులను మీ భుజాన వేసుకోవద్దు.. మౌఖిక వివరాలిస్తే చర్యలు తప్పవు

- మాజీ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లుకు కాళేశ్వరం కమిషన్ హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వేరెవరో చేసిన తప్పులను మీ భుజాన వేసుకోవద్దని కాళేశ్వరం కమిషన్ రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును హెచ్చరించింది. "ఇతరులు చేసిన తప్పిదాలను భుజాన వేసుకునే ప్రయత్నం చేయొద్దు. అఫిడవిట్‌లో ఇచ్చిన వివరాలకు, కమిషన్ ముందు చెప్పే వివరాలకు సారూప్యత ఉండాలి. రికార్డుల్లేకుండా కమిషన్ ముందు మౌఖిక సమాధానాలిచ్చి తప్పించుకోవాలని చూస్తే చర్యలు తప్పవు. సమస్యలను మీ అంతట మీరే కొనితెచ్చుకోవద్దు" అని కమిషన్ పేర్కొంది. మూడో రోజైన శుక్రవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు వెంకటేశ్వర్లు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాల్లో కమిషన్ ఆయన్ను గట్టిగా హెచ్చరించింది. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి పథకం కింద రూ.14వేల కోట్లను వెచ్చించగా.. అందులో రూ.13250కోట్ల పనులను కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో వినియోగించుకున్నామని మాజీ ఈఎన్‌సీ తెలిపారు. రూ.750కోట్ల పనులు వృథా అయ్యాయని గుర్తుచేశారు. 2019 జూన్ 21న బ్యారేజీల పనులన్నీ పూర్తయి, వాడుకలోకి రాగా అదే ఏడాది నవంబరులో వచ్చిన వరదలతో బ్యారేజీ దెబ్బతిందన్నారు. 2019-22 దాకా వరసగా బ్యారేజీల్లో సమస్యలు ఉత్పన్నం అయ్యాక 2023లో ఎనర్జీ డిసిపేషన్ స్టడీ చేయాలని తెలంగాణ ఇంజనీరింగ్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (టీజీఈఆర్ఎల్)ను కోరినట్లు చెప్పారు.

ఫ్లడ్ బ్యాంకుల ఉద్దేశమేంటి?

భూసేకరణ, ముంపును తగ్గించడమే వాటి ఉద్దేశం. రైతుల ప్రతిఘటనతో ఫ్లడ్ బ్యాంకుల నిర్మాణానికి పూనుకున్నాం. అందువల్లే వాస్తవిక అంచనాల్లో వాటిని చేర్చలేదు.

కాఫర్‌డ్యామ్ డిజైన్లు, డ్రాయింగ్‌లు సవరించారా?

మేడిగడ్డలో తొలుత 96 మీటర్లతో కాఫర్ డ్యామ్ కట్టాలని ప్రతిపాదించాం. ప్రతిపాదిత నిర్మాణం వరదలతో మునిగిపోవడంతో తట్టుకోవడం కష్టమని, 100-101మీటర్లకు పెంచాం. మేడిగడ్డ బ్యారేజీ పెరెన్నియల్ రివర్ ప్రదేశంలో ఉంది. మిగతా బ్యారేజీల్లేవు.

డ్రాయింగ్‌ల ప్రక్రియ ఏ దశలోనైనా ఆలస్యమైందా?

(అఫిడవిట్‌కు భిన్నంగా ఉంటే చర్యలు తప్పవని కమిషన్ హెచ్చరిక). రికార్డులన్నీ పరిశీలించి, సోమవారం కల్లా చెబుతా.

2019-22 మధ్య బ్యారేజీలు దెబ్బతిన్నాయా?

బ్యారేజీల్లో 2019-2022దాకా సమస్యలు వచ్చాయి. వీటిపై 2020 ఫిబ్రవరిలో ఈఎన్‌సీ సి.మురళీధర్ నేతృత్వంలో, ఆ తర్వాత నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో సమావేశమై చర్చించారు. దెబ్బతినడానికి గల కారణాలపై నమూనా అధ్యయనాలు చేయాలని ఆదేశాలిచ్చాం.

వాస్తవిక అంచనాలెంత? మళ్లీ సవరించారా?

2016 మార్చి 1న మేడిగడ్డ బ్యారేజీ రూ.2591 కోట్లు, అన్నారం బ్యారేజీ 1785 కోట్లు, సుందిళ్ల బ్యారేజీకి 1437కోట్లు వాస్తవిక నిర్మాణ అంచనా వ్యయంగా ఉంది. తర్వాత అంచనాలను రూ.4613 కోట్లు, రూ.2700కోట్లు, రూ.2200కోట్లుగా సవరించాం.

అంచనాలను సవరించడానికి కారణాలేంటి?

డిజైన్, డ్రాయింగ్‌లతో ప్రధాన కాంపోనెంట్ల ప్రకారం వాస్తవిక నిర్మాణ అంచనాలను తయారు చేశాం. ఫ్లడ్‌బ్యాంకులు, డైవర్షన్ చానళ్లను చేర్చడంతో పాటు మారిన పన్నుల శ్లాబులతో అంచనాలను సవరించాల్సి వచ్చింది.

సవరణ అంచనాలను ఎవరు ఆమోదించారు?

నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి/ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆమోదించారు.

పనుల పూర్తికి నిర్మాణ సంస్థలు గడువు కోరాయా?

అవును.. కోరాయి. 2016 మే 2న మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ నిర్మాణ పనులకు సీఎంగా ఉన్న కేసీఆర్ భూమి పూజ చేశారు. అన్నారం, సుందిళ్ల పనులు పూర్తయినట్లు సర్టిఫికెట్ ఇస్తే, మేడిగడ్డకు సబ్‌స్టాన్షియల్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చాం. ఒప్పంద నిబంధనల ప్రకారం బ్యారేజీ పనులు దాదాపు పూర్తయ్యాయని నిర్ధారిస్తూ ఇచ్చేదే సబ్‌స్టాన్షియల్ కంప్లీషన్ సర్టిఫికెట్.

కాళేశ్వరం ప్రాజెక్టుకు నోడల్ అధికారి ఉన్నారా?

నోడల్ అధికారిగా బి.హరిరామ్ ఉన్నారు.

నేడు విచారణకు సీఈ సుధాకర్‌రెడ్డి

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకమైన టెండర్ల ప్రక్రియతో పాటు పలు అంశాల్లో భాగస్వామిగా ఉన్న రామగుండం ఇన్‌చార్జీ సీఈ సుధాకర్‌రెడ్డిని శనివారం కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది.

సీకెంట్ పైల్స్ నిర్ణయం ఎల్‌అండ్‌టీదే: సీఈ చంద్రశేఖర్

'జలాశయాల నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడరు. మేడిగడ్డలో ఎందుకు వాడారు?' అని కమిషన్ సీఈ చంద్రశేఖర్‌ను ప్రశ్నించింది. దేశంలో ఇలాంటి నిర్మాణాల్లో సీకెంట్ పైల్స్ వినియోగించినట్లు అప్పట్లో తమ వద్ద సమాచారం లేదని సీఈ బదులిచ్చారు. ఇన్‌ఫ్రా, సముద్రపు తీర ప్రాజెక్టుల్లో, మహారాష్ట్రలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంలో వీటిని వినియోగిస్తున్నారని, వీటి డిజైన్లకు మార్గదర్శకాలు లేకపోవడంతో బ్రిటిష్ కోడ్‌ను అనుసరించామని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీలో ఆర్‌సీసీ కటాఫ్, షీట్‌పైల్స్‌కి బదులు సీకెంట్ పైల్స్‌తో కటాఫ్ వాల్ నిర్మించాలని ప్రాజెక్టు క్షేత్ర స్థాయి ఇంజనీర్లతో పాటు నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. సీడీవో విభాగం సరైన డిజైన్లు ఇవ్వకపోవడంతోనే మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్ కుంగిందనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. డిజైన్ల రూపకల్పన సందర్భంగా.. మేడిగడ్డ బ్యారేజీ నుంచి విడుదలయ్యే వరద వేగాన్ని సరైన రీతిలో పరిగణనలోకి తీసుకోలేదని, వరద నేలను తాకే చోట మట్టికోతకు గురికాకుండా దిగువన సరిపడ నీటి నిల్వలతో టెయిల్ పాండ్ ఉండాలన్న ఆలోచన కూడా చేయలేదని కమిషన్ అడగ్గా.. అందులో వాస్తవం లేదని చంద్రశేఖర్ అన్నారు. అధిక షూటింగ్ వెలాసిటీ ఉండనుందని క్షేత్ర స్థాయి ఇంజనీర్ల నుంచి తమకు లెక్కలు అందలేదన్నారు.

రాయడం... చదవడం వస్తే కొలువు

నీటిపారుదలశాఖలో నియామకాలు

1597 మంది లష్కర్‌లు, 281 మంది హెల్పర్ల అవసరం

ప్రభుత్వ ఉత్తర్వులు.. ప్రక్రియకు కమిటీ

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయడం.. చదవడం వస్తే చాలు నివాసం ఉంటున్న గ్రామంలోనే నీటిపారుదలశాఖకు చెందిన కొలువు చేతికి రానుంది. ఆయకట్టుకు నీరందించే ప్రధాన కాలువలు, డ్యామ్‌లు/రిజర్వాయర్ల పర్యవేక్షణ నిమిత్తం లష్కర్‌లను, హెల్పర్లను నియమించుకోవడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు 1597 మంది లష్కర్‌లు, గేట్ల ఆపరేషన్ కోసం 281 మంది హెల్పర్లను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించుకోనున్నారు. విద్యార్హతతో సంబంధం లేకుండా, 45 ఏళ్లలోపు వయసు కలిగి... శారీరకదారుఢ్యం ఉన్నవారు అర్హులు. ఎంపికైన వారికి గౌరవ వేతనంగా ప్రతీనెల రూ.15600లు అందనుంది. ఈ నియామకాల నేపథ్యంలో ప్రతీ ప్రధాన కాలువ పై నీటిపారుదలశాఖ నిఘా పెట్టనుంది. ప్రధానంగా వానాకాలంలో ప్రాజెక్టులు, చెరువుల నుంచి విడుదలయ్యే నీరు పొలానికి చేరుతుందా...?లేదా...? ఎక్కడైనా కాలువ దెబ్బతిందా...? దెబ్బతింటే ఇసుక బస్తాలు వేసి కాలువను కాపాడుకోవడం వీరి బాధ్యత. కాలువలో ఎంత ఎత్తుతో నీళ్లు వెళ్తున్నాయి? ఏ మేరకు నీళ్లు అవసరం? ఆయకట్టుకు ఎంతమేర నీరందుతుందనే సమాచారం కూడా వీరే సేకరిస్తారు. ఇటీవలే భారీ వర్షాలకు నాగార్జునసాగర్ ఎడమ కాలువకు మూడుచోట్ల గండ్లు పడ్డాయి. పలు చెరువులు తెగిపోయాయి. అయితే కాలువలపై పర్యవేక్షణ లేకపోవడంతోనే క్రమంగా చెట్లు, చెదలు పెరిగి, పూడిక కూడా చేరి, కాలువలు దెబ్బతింటున్నాయని అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నియామకాలకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నియామక ప్రక్రియ చేపట్టడానికి వీలుగా సంబంధిత ఈఎన్‌సీ/సీఈ చైర్మన్‌గా, ఎస్ఈ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తూ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఏయే చోట్ల లష్కర్‌లను నియమించుకోవాలనుకుంటున్నారో ఆ సమీప గ్రామాల్లో నివాసం ఉండేవారికే అవకాశం కల్పించనున్నారు.

రాజకీయ వ్యభిచారులు

- రాజీనామా చేయకుండా పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ విమర్శ



సిరిసిల్ల, హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎమ్మెల్యే రాజకీయ వ్యభిచారం చేస్తున్నాడని, పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు రాజకీయ వ్యభిచారులేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదని జగిత్యాల ఎమ్మెల్యే చెబుతుంటాడని, మరి గాడిదలు కాయడానికి రేవంత్‌రెడ్డితో కండువా కప్పిచ్చుకున్నావా అని ప్రశ్నించారు. ఒకరికి విడాకులు ఇవ్వకుండా ఇంకొకరిని చేసుకోవడాన్ని వ్యభిచారం అంటారని.. ఒక పార్టీకి రాజీనామా చేయకుండా ఇంకో పార్టీలో చేరితే దానిని రాజకీయ వ్యభిచారం అంటారని అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో ఈఆర్‌సీ.. విద్యుత్ టారిఫ్‌పై బహిరంగ విచారణ నిర్వహించింది. దీంట్లో పాల్గొన్న అనంతరం విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఇదే ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ మారితే రాళ్లతో కొట్టి చంపండన్నారని, ఇప్పుడు రాళ్లతో ఎవరిని కొట్టాలని ప్రశ్నించారు. బాంబులు పేలుతాయంటూ పొంగులేటి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. 'ఆయన మీద జరిగిన ఈడీ తనిఖీల్లో ఎన్ని నోట్ల కట్టలు దొరికాయి. బీజేపీతో సంధి ఎలా కుదిరింది.. ఈ బాంబుల విషయం చెబుతాడా' అని ఎద్దేవా చేశారు. కరెంటు చార్జీలు పెంచేందుకు డిస్కం ఇచ్చిన ప్రతిపాదనలు తిరస్కరించాలని ఈఆర్‌సీని కోరామని కేటీఆర్ తెలిపారు. 300యూనిట్ల తర్వాత యూనిట్ ధరను రూ.10 నుంచి 50కి పెంచాలన్న ప్రతిపాదన సరికాదన్నారు. ఉచిత విద్యుత్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18,500 కోట్ల అదనపు భారాన్ని ప్రజల మీద మోపే ప్రయత్నం చేస్తోందన్నారు. మంత్రులవేగాక విపక్ష నేతల ఫోన్లనూ సీఎం ట్యాపింగ్ చేయిస్తున్నారని, ఈ విషయంలో లైడిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ విసిరారు.

మూసీలో ఆలయాలను కూల్చే దమ్ముందా?

సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చివేత సిగ్గుచేటు.. ఆపకపోతే పోరాటమే: కిషన్‌రెడ్డి

- కాంగ్రెస్ అధినేత్రి అల్లుడి కోసమే మూసీ తతంగం: బండి సంజయ్



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న దేవాలయాలను కూల్చే దమ్ముందా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మోసపూరిత వైఖరి అని, దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తోందని, ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. పేదల ఇళ్ల కూల్చివేతల నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. పేద ప్రజల ఇళ్లు కూల్చితే తెలంగాణ రణరంగంగా మారుతుందని.. పేద ప్రజలు తిరగబడితే ఏ పోలీసు తూటా అడ్డుకోలేదని హెచ్చరించారు. బాధితులకు మద్దతుగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని.. ఈ పోరులో చర్లపల్లి జైలుకైనా, చంచల్‌గూడ జైలుకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రతి ఇంటికి వెళ్లి, వివరాలు సేకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో మూడు నెలలు నివాసం ఉండాలంటూ రేవంత్ చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. "మూసీ పరీవాహక ప్రాంతంలో పేదల ఇళ్లలో ఉండేందుకు నేను సిద్ధమే. కనీసం పోలీసు భద్రత మధ్య అయినా సీఎం బాధితుల వద్దకొచ్చి వారి ఆవేదనను తెలుసుకోవాలి" అని పేర్కొన్నారు. మూసీ బాధితులకు అండగా ఇందిరాపార్కు వద్ద బీజేపీ చేపట్టిన మహాధర్నాలో కిషన్ రెడ్డి ప్రసంగించారు. మూసీ పునరుజ్జీవం అంటున్న ప్రభుత్వానికి పేదల ఇళ్ల కూల్చివేయడమే లక్ష్యమా? ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఉన్న బడా వ్యక్తుల ఫాంహౌజ్‌లను వదలిపెట్టి పేదలపైనే ప్రతాపం చూపిస్తారా? అని మండిపడ్డారు. కేసీఆర్ తరహాలోనే రేవంత్ పాలనా కొనసాగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో పేదలకు కనీస సౌకర్యాలు కల్పించలేని కాంగ్రెస్ ప్రభుత్వం, రూ.లక్షన్నర కోట్ల అప్పు చేసి మూసీ పునరుజ్జీవం చేస్తుంటం దారుణమని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు, సుందరీకరణకు బీజేపీ వ్యతిరేకం కాదని.. అయితే పేదల ఇళ్ల జోలికి వెళ్లొద్దని.. అప్పుడు బీజేపీ కార్యకర్తలు ముందుకొచ్చి సహకరించేందుకు సిద్ధంగా ఉంటారని ప్రకటించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత్రి అల్లుడి కోసమే రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరిట తతంగం నడుపుతోందని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన వట్టిదేనని, కాంగ్రెస్ అధినేత్రి అల్లుడు గుడిని చూసే పేరుతో మూసీ పరీవాహక ప్రాంతానికొచ్చి కాంట్రాక్టు మాట్లాడుకున్నారని, లక్షన్నర కోట్ల కాంట్రాక్టు ఫిక్సయిపోయిందని, ఆ డబ్బులు ఆయనకు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు డబ్బులు పంపేందుకూ ఇక్కడ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. లేదంటే.. రూ.లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారనేది సీఎం రేవంత్ చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ పేరిట గతంలో కేసీఆర్ కుటుంబం దోచుకుందని, వారికి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఓ డ్రామా కంపెనీ అని, ఆ పార్టీలో అందరూ ముఖ్యమంత్రులేనని ఎద్దేవా చేశారు. "నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్నీ కేసీఆరే. ఆయనే ఏక్ నిరంజన్‌గా ఉంటే మంత్రులంతా డమ్మీలుగా ఉండేవారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో మంత్రుల్లేరు. అంతా ముఖ్యమంత్రులే" అని విమర్శించారు. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరిన వాళ్లను రాజకీయ వ్యభిచారులని కేటీఆర్ అంటున్నారని చెబుతూ "మరి.. మీ నాన్న మొదట ఏ పార్టీలో ఉన్నారు? ఇప్పుడు ఏ పార్టీ నడుపుతున్నారు?" అని కేటీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. కేటీఆర్ లీగల్ నోటీసులకు సరైన రీతిలో సమాధానమిస్తానని స్పష్టం చేశారు.

కేఫ్‌కు నిలోఫర్ అని పేరెందుకు?

ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో పాల్గొన్న అనంతరం బండి సంజయ్ హిమాయత్‌నగర్‌లోని నిలోఫర్ కేఫ్‌కు వెళ్లారు. సంజయ్ వచ్చారని తెలుసుకున్న ఆ కేఫ్ యజమాని బాబూరావు అక్కడికొచ్చి పరిచయం చేసుకున్నారు. చిట్టిముత్యాలతో తయారు చేసిన సాంబార్ రైస్‌ను రుచి చూడాలని సంజయ్‌ను కోరారు. అయితే కేఫ్‌కు నిలోఫర్ అని పెట్టడానికి కారణమేమిటని ఆయన్ను ప్రశ్నించారు. తాను 1976లో నిలోఫర్ ఆస్పత్రి వద్ద రోజుకు రెండు రూపాయలకు పనిచేసేవాడినని.. తర్వాత అక్కడే టీ, బిస్కెట్లు అమ్మానని..గిరాకీ బాగా ఉండటంతో కేఫ్ పెట్టానని బాబూరావు వివరించారు.

టీజీఎస్పీ హటావో.. ఏక్ పోలీస్ బనావో..!

- టీజీఎస్పీ పోలీస్ కుటుంబాల డిమాండ్
- సచివాలయ ముట్టడికి యత్నం.. ఉద్రిక్తత



సచివాలయ ముట్టడికి వస్తున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లు వారి భార్యలు, కుటుంబసభ్యులు

ఖైరతాబాద్/గచ్చిబౌలి/హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పెషల్ పోలీస్(టీజీఎస్పీ) బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్లు 24 గంటల పాటు ఉద్యోగాలంటూ ఇళ్లకు రావడం లేదని.. కనీసం మంచి, చెడుల సమయంలో సైతం సెలవులు ఇవ్వడం లేదని వారి కుటుంబ సభ్యులు వాపోయారు. మహిళలు కన్నీరు పెట్టుకున్నారు. అందరు కానిస్టేబుళ్లలానే తమ వారు కూడా ఎంపికైనా.. వారిని తక్కువగా చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకచోట ఉద్యోగంలో ఉంచకుండా రాష్ట్రమంతా తిప్పుతూ సెలవులు ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల నిరసనలు తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో శుక్రవారం సచివాలయ ముట్టడికి యత్నించారు. దీంతో టీజీఎస్పీ సిబ్బంది భార్యలతో పాటు వారి కుటుంబ సభ్యులను మహిళా కానిస్టేబుళ్లు అరెస్టు చేశారు. కానిస్టేబుళ్ల భార్యలు, పసి పిల్లలతో ఆందోళనకు దిగడం, అరెస్టుల సమయంలో చిన్నపిల్లల ఏడుపులు, మహిళల ఆర్తనాదాలతో సచివాలయం ప్రాంతం అట్టుడికిపోయింది. అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో 15 రోజులు డ్యూటీలు వేసేవారని, ప్రస్తుతం 26 రోజులు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు ఆరోపించారు. పసి పిల్లలతో ఇంట్లో ఉంటున్నామని, ఇళ్లలో పెద్దలను కూడా చూసుకోవడం లేదని, ఈ ఉద్యోగాల కారణంగా తమ కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోయారు. స్పెషల్ పోలీసులకూ ఇతర పోలీసుల్లాగే ఒకే చోట కనీసం ఐదేళ్లు ఉద్యోగం చేసే అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. ఆందోళనకారులను మహిళా కానిస్టేబుళ్లు అయిష్టంగానే అరెస్టు చేశారు. అరెస్టుల సమయంలో కొందరు పోలీసులను పరుగులు పెట్టించారు.

కొండాపూర్‌లో భారీగా స్తంభించిన ట్రాఫిక్

రాష్ట్రమంతా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న స్పెషల్ పోలీసుల కుటుంబ సభ్యులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం కొండాపూర్ ప్రధాన రహదారిపై టీజీఎస్పీ 8వ బెటాలియన్ పోలీసుల కుటుంబాల మహిళలు బైఠాయించారు. 'వియ్ వాంట్ ఏక్ పోలీస్' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఒకే నోటిఫికేషన్, ఒకే పరీక్షతో ఉద్యోగాల్లో చేరుతుండగా బెటాలియన్ పోలీసులను మాత్రం కూలీల మాదిరిగా చూస్తున్నారని ఆరోపించారు. వీరి బైఠాయింపుతో కొండాపూర్‌లో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అలాగే ధర్నా చేస్తున్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, మహిళలతో సీఐ రాజేశ్ అనుచితంగా ప్రవర్తించాడని, అతన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ మహిళలతో చర్చించారు. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. శుక్రవారం రాత్రి యూసఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద టీజీఎస్పీ మొదటి బెటాలియన్ పోలీసుల కుటుంబ సభ్యులు రోడ్డుపై నిరసన తెలిపారు.

టీజీఎస్పీ సర్క్యులర్ తాత్కాలికంగా నిలిపివేత

టీజీఎస్పీ పునర్విభజనకు సబంధించి జారీ చేసిన సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బెటాలియన్స్ అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్ ప్రకటించారు. ఈ నెల 10న జారీ చేసిన సర్క్యులర్‌పై సిబ్బంది కుటుంబ సభ్యులు ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో సర్క్యులర్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జైన్ తెలిపారు. అన్ని బెటాలియన్లతో దర్బార్‌లు నిర్వహించి సిబ్బంది నుంచి అభిప్రాయాలు సేకరించాలని కమాండెంట్లను ఆదేశించారు. సిబ్బంది నుంచి స్వీకరించిన అభ్యంతరాల్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామని జైన్ తెలిపారు. సిబ్బంది తమ సమస్యలు నేరుగా తెలిపేందుకు tgspcontrol@gmail.com, వాట్సాప్ నంబరు 87126 58531 అందుబాటులో ఉంచామన్నారు. బెటాలియన్ సిబ్బంది ఆందోళనలకు కారణమైన సర్క్యులర్‌ను నిలిపివేసిన డీజీపీ జితేందర్, అదనపు డీజీపీ సంజయ్‌కు పోలీస్ అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

ఖమ్మం, మంచిర్యాలలో ఆర్ఎఫ్‌సీలు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో కొత్తగా రెండు రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ(ఆర్ఎఫ్‌సీ)లు ఏర్పాటు చేశారు. ఖమ్మం, మంచిర్యాల జిల్లాల్లో శుక్రవారం కొత్తగా రెండు ఆర్ఎఫ్‌సీ కేంద్రాల్ని అధికారులు ప్రారంభించారు. ఖమ్మంలో భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల పోలీసులకు సేవలందిస్తారు. మంచిర్యాల ఆర్ఎఫ్‌సీ నుంచి ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు రామగుండం కమిషనరేట్ పోలీసులకు సేవలు అందుతాయని ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు.

గ్రూప్-1కు తగ్గుతున్న పోటీ

(మొదటి పేజీ తరువాయి)

మిగిలారు. మరో రెండు రోజుల పాటు పరీక్షలు ఉన్నాయి. ఈ రెండు పరీక్షలకు మరింత మంది గైర్హాజరయ్యే అవకాశం ఉంది. దాంతో ఈ నిష్పత్తి అంటే... పోస్టులకు పోటీ పడే అభ్యర్థుల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంటుంది. గ్రూపు-1 మెయిన్ పరీక్షల నిర్వహణలో పకడ్బందీ చర్యలను తీసుకుంటున్నట్టు పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు ప్రకటించారు. ముఖ్యంగా ప్రశ్నపత్రాల విషయంలో అనేక జాగ్రతలను తీసుకుంటున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా పరీక్ష కేంద్రాలకు పంపించే ప్రశ్న పత్రాలను తెరిచే విషయంలో కూడా జాగ్రత్తలను పాటిస్తున్నట్లు వెల్లడించారు.

మిగులు టీచర్ల సర్దుబాటు

డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు అందుబాటులోకొచ్చాక చాలా స్కూళ్లల్లో మిగులు (సర్‌ప్లస్) టీచర్ల సమస్య తలెత్తింది. దీనిని పరిష్కరించడానికి వీలుగా తాత్కాలిక సర్దుబాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం శనివారం ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో కొత్తగా 10 వేల మంది ఉపాధ్యాయులకు పైగా కొత్తగా అందుబాటులోకొచ్చిన విషయం తెలిసిందే. వీరందరికి ఈ నెల 15వ తేదీన పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆయా స్కూళ్లల్లో ఉన్న పోస్టులకు అనుగుణంగా ఈ పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ పోస్టింగ్‌ల జారీ సమయంలో చాలా ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకోలేదు. ఫలితంగా పలు స్కూళ్లల్లో సరైన సంఖ్యలో విద్యార్థులు లేకున్నా ఎక్కువ మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు జారీ చేశారు. దాంతో అనేక పాఠశాలల్లో సర్‌ప్లస్ టీచర్ల సమస్య తలెత్తింది. ఒక్క సిరిసిల్లా జిల్లాల్లోనే సుమారు 238 మంది ఉపాధ్యాయులను మిగులుగా గుర్తించారు. ఇలా అన్ని జిల్లాలో ఈ సమస్య తలెత్తింది. దీనిని నివారించడానికి ఈ మిగులు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపించాలని భావిస్తున్నారు. తాత్కాలిక సర్దుబాటు పేరుతో శనివారం ఉత్తర్వులను ఇవ్వడానికి అన్ని జిల్లా కలెక్టర్లు ఏర్పాట్లను చేశారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ఈ మిగులు ఉపాధ్యాయులను పంపించే అవకాశం ఉంది. కాగా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల జాయినింగ్ తేదీని ఈ నెల 10గా పరిగణించాలని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు. ఈ మేరకు ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇక రాష్ట్రంలోని మండల విద్యా అధికారుల (ఎంఈవో)కు ఈ నెల 29వ తేదీన ప్రత్యేక శిక్షణను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమి కబ్జా

- రూ. 600 కోట్ల విలువైన స్థలానికి ఎసరు
- ప్రైవేటు భూమిగా మార్చి చూపిన నిందితులు
- బోరబండకు చెందిన ఆరుగురు నిందితుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధికారులతో కుమ్మక్కై నకిలీ పత్రాలతో రూ. 600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన నిందితులను సైబరాబాద్ ఆర్థిక నేరాల దర్యాప్తు విభాగం అధికారులు అరెస్ట్ చేశారు. నిందితులు 12.09 ఎకరాలకు సంబంధించి... 1978 నాటి పత్రాలను మార్చి నకిలీ పత్రాలు సృష్టించారని పోలీసులు గుర్తించారు. బోరబండకు చెందిన మహ్మద్ అబ్దుల్ రజాక్, గ్రీక్ బిల్డర్స్ ఎల్‌ఎల్‌పీ పార్టనర్ నవీన్ కుమార్ గోయల్, రంగారెడ్డి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ జె గురుసాయిరాజ్, మహ్మద్ అబ్దుల్ ఆది, సైదా కౌసర్, అఫ్షాసారాతోపాటు మరికొందరు నిందితులు రాయదుర్గంలోని 12.09 ఎకరాలకు సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించారు. సబ్ రిజిస్ట్రార్ సహకారంతో రికార్డులను మార్చారు. అంతేకాకుండా ప్రభుత్వ భూమిని రికార్డులో ప్రొహిబిటెడ్ లాండ్ నుంచి ప్రైవేటు భూమిగా మార్చి గ్రీక్ బిల్డర్స్‌తో కమర్షియల్, రెసిడెన్షియల్ నిర్మాణాలు చేపట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం గ్రామంలోని సర్వే నెంబర్ 1, 3, 4, 5, 17, 19, 49 లలో ఉన్న 12.09 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కేటాయించింది. ఇందులో 5.16 ఎకరాల్లో యూనిటీ మాల్‌ను నిర్మించాలనే ప్రణాళికలు కూడా ఉన్నాయి. యూనిటీ మాల్ నిర్మాణానికి కేంద్రం రూ. 202 కోట్ల నిధులు కూడా కేటాయించింది. ఈ భూమికి సంబంధించిన నకిలీ పత్రాల వ్యవహారం వెలుగులోకి రాగానే శేరిలింగంపల్లి తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగ అధికారులు నిందితులు నకిలీ పత్రాలతో భూమిని కబ్జా చేసినట్లు గుర్తించారు. నిందితులు బోరబండకు చెందిన మహ్మద్ అబ్దుల్ రజాక్, గ్రీక్ బిల్డర్స్ ఎల్‌ఎల్‌పీ పార్టనర్ నవీన్ కుమార్ గోయల్, రంగారెడ్డి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ జె గురుసాయిరాజ్, మహ్మద్ అబ్దుల్ ఆది, సైదా కౌసర్, అఫ్షాసారాను అరెస్ట్ చేశారు.

తప్పు చేసిన వాడిని వదలను

నేనెప్పుడూ తప్పు చేయలేదు.. రాజకీయ కక్షలకు పాల్పడలేదు కానీ ఏపీలో కక్ష రాజకీయాలొచ్చాయి

- లోకేశ్ ప్రజలకోసం పోరాడతానన్నాడు
- పాదయాత్ర చేసి నిరూపించుకున్నాడు
- బాలకృష్ణ 'అన్‌స్టాపబుల్'లో ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తన జీవితంలో ఏనాడూ కక్ష రాజకీయాలకు పాల్పడలేదని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ఏ పని చేసినా నాలుగు సార్లు ఆలోచించి చేస్తానని.. ఒక్కనాడూ చట్టాన్ని ధిక్కరించలేదని చెప్పారు. అలాంటి తనను అరెస్టు చేయడం ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నానని చెప్పారు. సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ.. తన 'అన్‌స్టాపబుల్' కార్యక్రమంలో ముఖ్యమంత్రిని ఇంటర్వ్యూ చేశారు. అందులో ముఖ్యాంశాలు బాబు మాటల్లోనే..

- నేను జీవితంలో అనేక సంక్షోభాలు చూశాను. ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మార్చుకుంటూ సమాజం కోసం పనిచేసుకుంటూ వచ్చాను.
- నాకు ఎలాంటి నోటీసూ ఇవ్వకుండా అరెస్ట్ చేశారు. ప్రజాక్షేత్రంలో నంద్యాలలో మీటింగ్ పెట్టి అక్కడ నుంచి నేరుగా బస్సు దగ్గరకు వచ్చి.. రాత్రి రెస్ట్ తీసుకుంటున్న సమయంలో బయట రాత్రంతా అలజడి సృష్టించారు. "ఏదైనా చేస్తాం" అనే ధీమాతో ఆ రోజు నన్ను అరెస్టు చేశారు. నంద్యాల నుంచి ప్రకాశం జిల్లా ద్వారా అమరావతికి తీసుకొచ్చారు. రాత్రంతా ఇన్వెస్టిగేషన్ పేరుతో తిప్పి తెల్లవారితే మెడికల్ టెస్ట్‌కు పంపించారు. అక్కడ నుంచి మళ్లీ అక్కడా ఇక్కడా తిప్పి తిప్పి కోర్టుకు తీసుకువెళ్లి.. వాదనల నెపంతో సాయంత్రం దాకా ఉంచి అర్ధరాత్రి రాజమండ్రి జైలుకు పంపారు. ఆ రాత్రి చేయని తప్పునకు శిక్ష అనుభవించడం కాకుండా.. అది జరిగిన విధానం ఆలోచించినప్పుడు గుండె తరుక్కుపోయింది. వెనకాల బాధ్యత గుర్తు చేస్తోంది. నేను స్థైర్యం కోల్పోతే ఇక ఏమీ ఉండదు. ధైర్యంగా ఎదుర్కొన్నాను కాబట్టి నా జోలికి రాలేకపోయారు గానీ లేకపోతే ఏమయ్యేదో! ఒక్కటే ఆలోచించాను. చనిపోతే ఒక్క క్షణం. అనుకున్న ఆశయాల కోసం పనిచేస్తే అదే శాశ్వతం. అదే నన్ను ముందుకు నడిపించింది. చావు గురించి ఆలోచిస్తే జీవితంలో ఏదీ చేయలేం. ముందుకెళ్తే ఏదైనా ఎదుర్కొంటామని ముందుకెళ్లాం. నేను జైల్లో ఉంటే కుటుంబమంతా రాజమండ్రిలో ఉన్నారు. ప్రజల పోరాటానికి నాయకత్వం వహించారు. నేను వచ్చే వరకు అకుంఠిత దీక్షతో రోడ్లపై పోరాడారు. ఎప్పుడూ రాజకీయాల్లోకి రాని భువనేశ్వరి.. వాళ్ల నాన్న సీఎంగా ఉన్నా, నేను సీఎంగా ఉన్నా ఎప్పుడూ బయటకు రాని ఆమె.. మొదటిసారిగా ఇది జరిగిన తర్వాత నిలదొక్కుకుని రాత్రింబవళ్లు పోరాడారు.
- నా జీవితంలో ఏ పనిచేసినా చట్ట ధిక్కరణ చేయలేదు. ఒకటికి నాలుగు సార్లు ఆలోచించి చేశాను. రాజ్యాంగం ప్రకారం ఏం చేయాలో దానికి కట్టుబడి చేశాను. ఇలాంటివన్నీ చేసిన తర్వాత ఆ రోజు జరిగిన సంఘటన (అరెస్టును) ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాను. అదీ ఏపీలో ఆనాటి పరిస్థితి. నేను ఎప్పుడూ తప్పు చేయలేదు. నిప్పులాగా బతికాను. ప్రజలు నన్ను సపోర్ట్ చేస్తారన్న విశ్వాసం ఉంది. అదే నన్ను గెలిపించింది. అదే నిలబెట్టింది. అరెస్టు చేస్తారనో, ప్రాణం పోతుందనో భయపడితే అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేం.
- నా జీవితంలో ఎప్పుడూ రాజకీయ కక్షలతో ముందుకెళ్లలేదు. నేను అధికారంలో ఉన్నప్పుడు.. ప్రతిపక్షంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి కొన్నిసార్లు రెచ్చిపోయినా సంయమనం పాటించాను. ఆయన కొన్ని విషయాల్లో దూకుడుగా మాట్లాడారు. ఎదుర్కొని వార్నింగ్ ఇచ్చాను. మళ్లీ తగ్గి క్షమాపణలు చెప్పిన సందర్భాలున్నాయి. కానీ మొట్టమొదట సారిగా ఆంధ్రప్రదేశ్‌లో కక్షపూరిత రాజకీయాలు వచ్చిన పరిస్థితి. ఆ కక్ష రాజకీయాలు వ్యక్తిగత ద్వేషాలయ్యాయి. నేను మాత్రం లక్ష్మణ రేఖ దాటను. తప్పు చేసిన వాడిని వదిలిపెట్టను. తప్పులు చేయకపోతే మాత్రం వారి జోలికి పోను. ఆ విషయంలో స్పష్టంగా ఉన్నాను.
- నన్ను జైల్లో కలిసిన పవన్ కల్యాణ్.. "ధైర్యంగా ఉన్నారా సార్?" అని అడిగారు. "ఎప్పుడూ అధైర్యంగా ఉండను.. మీరు కూడా ధైర్యంగా ఉండండ"ని నేను చెప్పాను. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చకుండా ప్రయత్నాలు చేస్తానని పదే పదే ఆయన చెప్పారు. ఇద్దరం కలిసి ఒక మాటనుకున్నాం. అందరం కలిసి పోటీ చేద్దామని చూచాయగా అన్నాను. ఆయన కూడా ఆలోచించుకుని ఓకే సార్ అన్నారు. బీజేపీకి కూడా గట్టిగా నచ్చజెప్పి అలయెన్స్‌గా తీసుకొస్తామని ఆయన చెప్పారు. బయటకు వెళ్లి మీరు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టారు.
- లోకేశ్ పాదయాత్ర తన నిర్ణయమే. తండ్రిగా నాకు కొన్ని ఇబ్బందులున్నాయని చెప్పాను. ఆ సమయంలో పాదయాత్రకు వెళ్లడం కరెక్ట్ కాదని.. విద్వేషకరమైన ప్రభుత్వం ఉన్నప్పుడు అంత సుజావుగా సాగదని, ఇబ్బందులు కలిగించడమే కాకుండా దేనికైనా తెగిస్తారని చెప్పాను. కానీ, లోకేశ్.. "నేను వెళ్లాలి. కమిట్ అయ్యాన"న్నాడు. ఏ నందమూరి తారకరామారావు మనవడిగానో, చంద్రబాబు కొడుకు గానో, బాలకృష్ణ అల్లుడు గానో కాకుండా నాకంటూ ఒక ప్రత్యేకత కావాలని.. నిరూపించుకుంటానని వెళ్లాడు. ఆరోజు ఒక్కటే అన్నాడు.. ప్రజల కోసం పోరాడతానని! వెళ్లాడు. నిరూపించుకున్నాడు.
- హైదరాబాద్ నగరాన్ని నిజాం, సికింద్రాబాద్ నగరాన్ని బ్రిటిష్‌వాళ్లు అభివృద్ధి చేస్తే.. సైబరాబాద్‌ను నేను అభివృద్ధి చేశాను. ఈ రోజు హైదరాబాద్ మహానగరంగా దేశానికే నెంబర్‌వన్ సిటీగా తయారయ్యే పరిస్థితి ఉంది. ఆ ఫలాలు ప్రజలు అనుభవిస్తున్నారు. గత పాలకులెవరూ నాశనం చేయలేదు. వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇప్పటికీ కూడా దేశానికి కొన్ని నగరాలు కావాలి. చండీగఢ్ వచ్చిన తర్వాత ఏ నగరమూ రాలేదు. ప్రధానమంత్రి శంకుస్థాపన చేసిన (అమరావతి) నగరాన్ని నేను ప్రపంచంలో అద్భుతమైన సిటీల్లో ఐదు నగరాల్లో ఒక నగరంగా చేయాలని శ్రీకారం చుట్టాను. దేశంలోనే మొదటి సారి ప్రత్యేకంగా ఫైబర్ గ్రిడ్, నీరు, కరెంట్, ఏసీ, గ్యాస్ ఇలా పైప్ లైన్ ద్వారా నడిపించే వ్యవస్థలను పెట్టాం.

గుస్సాడి కనకరాజు కన్నుమూత

- నేడు మార్లవాయిలో అంత్యక్రియలు..
- సంతాపం తెలిపిన సీఎం రేవంత్



జైనూర్/హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గుస్సాడి నృత్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు (90) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనది కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం మార్లవాయి గ్రామం.. కనకరాజుకు ఇద్దరు భార్యలు, పిల్లలున్నారు. కొంతకాలంగా ఆయన వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినప్పటికీ ఆరోగ్యం మెరుగవలేదు. ఈ నేపథ్యంలోనే మార్లవాయిలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. శనివారం మార్లవాయిలో కనకరాజు అంత్యక్రియలు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జరపనున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, గుస్సాడి కళలో ఆరితేరిన కనకరాజు తోటి ఆదివాసులకు ఆ నృత్యాన్ని నేర్పిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. దీంతో కేంద్రం ఆయన్ను 2021లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. కాగా కనకరాజు మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కనకరాజు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుస్సాడికి పద్మశ్రీ కిరీటం తొడిగి...

కనకరాజు మృతితో గోండు సంప్రదాయ కళ చిరునామాను కోల్పోయామని గోండు ఆదివాసీ అధ్యయన వేదిక అధ్యక్షుడు, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, కన్వీనర్ గూడూరు మనోజ అన్నారు. 'దీపావళి పండుగకు ఊరూరా సామూహికంగా కళాత్మక నృత్యం చిందులు వేసేది. అలాంటి గుస్సాడి నృత్య సంగీతాలు మూగపోవడం కలిచివేస్తోంది. గుస్సాడి నృత్యానికి పద్మశ్రీ కిరీటం తొడిగి.. తాను ఆవలి తీరం చేరడం ఆదివాసీ సాంస్కృతిక రంగానికి తీరని లోటు' అని పేర్కొన్నారు.

రెవెన్యూ, ఇరిగేషన్ ఓకే అన్నాకే!

- బిల్డింగ్, లేఅవుట్ అనుమతుల్లో మార్పు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల్లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులను తొలుత రెవెన్యూ, సాగునీటి శాఖలు పరిశీలించి ఓకే అన్నాకే.. అనుమతి ఇవ్వాలని హెచ్‌ఎండీఏ భావిస్తోంది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏలో ఉన్న రెవెన్యూ అధికారులే క్లియర్ టైటిల్ ఉందా? అనే విషయాలను పరిశీలించి ఫైల్‌ను ఓకే చేసి ముందుకు నడుపుతున్నారు. తర్వాతే ప్లానింగ్ విభాగం నుంచి ప్రాసెసింగ్ మొదలవుతోంది. హెచ్‌ఎండీఏ అనుమతులతో నిర్మించిన ఒక భవనాన్ని ఇటీవల చెరువులో ఉందని హైడ్రా కూల్చేసింది. డెవలపర్ ఒక చోట స్థలం చూపించి, అనుమతులన్నీ పొందాక మరోచోట నిర్మాణం చేసినట్టు తేలింది. దాంతో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల్లో స్థానికంగా రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల నుంచి క్లియరెన్స్ తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఏ ప్రాంతం నుంచి దరఖాస్తు వస్తుందో అక్కడి రెవెన్యూ శాఖకు చెందిన ఆర్‌ఐ, ఇరిగేషన్ శాఖ ఏఈ క్లియరెన్స్ ఇవ్వాలని నిర్దేశించారు.



28న చిరంజీవికి ఏఎన్ఆర్ అవార్డు ప్రదానం

అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఈనెల 28న ప్రతిష్ఠాత్మక 'ఏఎన్ఆర్ అవార్డు'ను బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా మెగాస్టార్ చిరంజీవికి ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరవుతున్నట్లు అక్కినేని కుటుంబం తెలిపింది. ఈ మేరకు నాగార్జున చిరంజీవిని స్వయంగా కలసి ఆహ్వానించారు. 'మా నాన్న ఏఎన్ఆర్ శత జయంతి వేడుకలు జరుగుతున్న ఈ సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. ఈ మైలురాయికి గుర్తుగా ఏఎన్ఆర్ అవార్డ్స్ 2024 ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి అమితాబ్ బచ్చన్ అంగీకరించడం ఆనందంగా ఉంది. ఈ అవార్డు ఫంక్షన్‌ను మరపురానిదిగా చేద్దాం!' అని నాగార్జున తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు.



జైలు నుంచి విడుదల

చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ శుక్రవారం బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయనకు గురువారం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. బెయిల్ పత్రాలు శుక్రవారం సాయంత్రం జైలుకు చేరడంతో విడుదలయ్యారు. జైలు వద్ద మీడియాతో మాట్లాడకుండా భార్యతో కలిసి వాహనంలో అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. లైంగిక వేధింపుల ఆరోపణలతో మహిళా కొరియోగ్రాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసులు జానీ మాస్టర్‌పై కేసు నమోదు చేసి సెప్టెంబరు 20న రిమాండ్‌కు తరలించారు. కేసు నేపథ్యంలో జానీమాస్టర్‌కు 2022 సంవత్సరానికి ఇచ్చిన జాతీయ ఉత్తమ కొరియోగ్రాఫర్ పురస్కారం నిలిపివేశారు.

సైదాబాద్, (ఆంధ్రజ్యోతి)

అది తప్పేమీ కాదు



'వాల్తేరు వీరయ్య'తో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు నటి ఊర్వశీ రౌతేలా. అనంతరం 'ఏజెంట్', 'బ్రో', 'స్కంద' చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌లో నటించారు. ప్రస్తుతం బాలకృష్ణ హీరోగా బాబీ తెరకెక్కిస్తోన్న చిత్రంలో నటిస్తున్నారు. కాగా, ఊర్వశీ రీసెంట్‌గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. వయసులో తనకంటే పెద్ద వారైన హీరోలతో యాక్ట్ చేయడంలో తప్పేమీ లేదని, సినిమాల విషయంలో తాను వయసును పెద్దగా పట్టించుకోనని అన్నారు. 'సింగ్ సాబ్ ద గ్రేట్‌తో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. అప్పుడు నా వయసు 19 ఏళ్లు. సన్నీ డియోల్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్నా. వయసు పరంగా మా మధ్య 38 ఏళ్ల వ్యత్యాసం. బాలీవుడ్‌లో ఇదొక రికార్డు. నాకు తెలిసినంత వరకూ అంత ఏజ్ గ్యాప్‌తో ఎవరూ స్క్రీన్ షేర్ చేసుకోలేదు. సన్నీ డియోల్ పిల్లలకంటే నేను చిన్నదాన్ని. దర్శకుడు ఆ విధంగా స్క్రిప్ట్ రాసినప్పుడు, ఆలోచించినప్పుడు నటించడంలో తప్పు లేదు' అని ఊర్వశీ రౌతేలా వివరించారు.

శివయ్య ఆశీస్సుల కోసం...



'కన్నప్ప' టీమ్ ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించింది. పన్నెండు జ్యోతిర్లింగాల సందర్శనలో భాగంగా.. డాక్టర్. మోహన్ బాబు, నటుడు విష్ణు మంచు, దర్శకుడు ముఖేశ్‌కుమార్ తదితరులు.. కేదార్‌నాథ్, బద్రీనాథ్, రిషికేశ్‌క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ "శివుని ఆశీస్సుల కోసం ఈ యాత్రను ప్రారంభించాం. ఈ సినిమాను అందరూ మెచ్చే విధంగా తెరకెక్కించడానికి అహర్నిశలు శ్రమిస్తున్నాం" అని చెప్పారు. కాగా, విష్ణు మంచు నటిస్తున్న ఈ సినిమాను ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. డిసెంబరులో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

పోస్ట్‌మ్యాన్ సాహసాలు



కిరణ్ అబ్బవరం, నయన సారిక, తన్వీరామ్ ప్రధాన పాత్రల్లో నటించిన పాన్ ఇండియా చిత్రం 'క'. దర్శకద్వయం సుజీత్, సందీప్ తెరకెక్కించగా.. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్ పాత్రలో కనిపించనున్నారు కిరణ్ అబ్బవరం. ఉత్కంఠకు గురి చేసే సన్నివేశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. కిరణ్ అబ్బవరం నటన, యాక్షన్ సన్నివేశాలు సినిమా మీద అంచనాలు పెంచుతున్నాయి. ఈ సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ ప్రేక్షకులను అలరిస్తుందని మేకర్స్ తెలిపారు.

సైకలాజికల్ థ్రిల్లర్



గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో ఆర్జీవీ-ఆర్వీ బేనర్‌పై రవి వర్మ నిర్మించిన చిత్రం 'శారీ'. 'టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ' దీని టాగ్‌లైన్. నిజజీవిత సంఘటనల ఆధారంగా రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ. ఇందులో భయానక ప్రేమికుడిగా సత్య యాదు, అతనిలో సెగలు రేపే చీరలోని అమ్మాయి పాత్రలో ఆరాధ్య దేవి నటించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళ్, మలయాళ భాషల్లో డిసెంబరు 20న విడుదలవుతోంది.



మంత్రి పొన్నంకు వినతి పత్రం అందిస్తున్న ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయండి

» రవాణా మంత్రి పొన్నంకు ఆర్టీసీ జేఏసీ వినతి

హైదరాబాద్, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని టీజీఎస్ ఆర్టీసీ ఉమ్మడి కార్యాచరణ సంఘం(జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ప్రతినిధుల బృందం శుక్రవారం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌ కు వేర్వేరుగా వినతి పత్రాలను సమర్పించింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించే ప్రక్రియను ప్రారంభించాలని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న కోరారు. ఆలస్యమైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విజయవంతంగా విలీన ప్రక్రియ చేపడాతరనే విశ్వాసం ఉందని అన్నారు. మరోవైపు ఇక నుంచి టీఎన్‌జీవోతో కలిసి పని చేయనున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమన్వయంతో సంయుక్తంగా పోరాట కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. శుక్రవారం టీఎన్‌జీవోస్ కార్యాలయంలో జరిగిన రెండు జేఏసీల ప్రతినిధుల సమావేశంలో ఈ మేరకు ఒప్పందం కుదిరిందని తెలిపారు.

సీతారామ-పాలేరు లింక్ కాలువకు టెండర్లు

» 190.73 కోట్ల అంచనాలతో 10.5 కిలోమీటర్ల కాలువ

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పాలేరు రిజర్వాయర్‌ను అనుసంధానించే కీలకమైన సీతారామ-పాలేరు లింక్ కాలువ పనులకు రూ.190.73 కోట్ల నిర్మాణ అంచనాలతో ప్రభుత్వం టెండర్లు పిలిచింది. సీతారామలో ప్యాకేజీ-13లో ఖమ్మం జిల్లా సింగరేణి మండలం చీమలపాడు గ్రామం నుంచి ఏన్కూరు మండలం బుర్దా రాఘవాపురం వరకు దాదాపు 10.50 కిలోమీటర్ల మేర మట్టిని తవ్వి పాలేరు రిజర్వాయర్‌తో అనుసంధానం చేయనున్నారు. అందుకు సంబంధించిన లింక్ కాలువ తవ్వకం, కట్ట నిర్మాణం, సిమెంట్-కాంక్రీట్ లైనింగ్‌తో పాటు ఇతరత్రా రూ.190.73 కోట్లతో ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. తాజాగా టెండర్లకు శుక్రవారం నోటిఫికేషన్ ఇచ్చారు. నవంబరు 8వ తేదీ దాకా టెండర్లను స్వీకరించనున్నట్లు ఖమ్మం ఎస్ఈ వెల్లడించారు.

హైదరాబాద్ చేరుకున్న పొంగులేటి బృందం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలోని హన్ నది పరిశీలనకు వెళ్లిన మంత్రి పొంగులేటి బృందం.. పర్యటనను ముగించుకుని శుక్రవారం హైదరాబాద్ చేరుకుంది. వారికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, యాదయ్య, అధికార బృందంతో కలిసి ఈ నెల 19న దక్షిణ కొరియా వెళ్లారు.

317 జీవో ఉద్యోగులకు వ్యతిరేకం

» సీఎ‌స్‌తో సమావేశంలో ఉద్యోగుల ఐకాస

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవో 317 ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉందని, దాన్ని సవరించి ఇప్పటికే పని చేస్తున్న ఉద్యోగులకు వెసులుబాటు కల్పించి స్థానికత ఆధారంగా సర్దుబాటు చేయాలని ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. సీఎం రేవంత్ సూచన మేరకు సీఎస్ శాంతి కుమారి శుక్రవారం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో జీవో 317పై భేటీ అయ్యారు. ఐకాస ఛైర్మన్ మారెం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు నేతృత్వంలో పలు సంఘాల నేతలు సీఎస్‌ను కలిసి 317జీవోపై ఉన్న అనుమానాలు, అభ్యంతరాలను వివరించారు. అనంతరం సచివాలయ ఆవరణలో విలేకరులతో ఐకాస నేతలు మాట్లాడుతూ ఇటీవల మంత్రి వర్గ ఉపసంఘం 317 జీవో మీద సీఎంకు అందజేసిన నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. అందులో ఉన్న వ్యతిరేక అంశాలను పరిశీలించిన తరువాతనే క్యాబినెట్ ఆమోదానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని, అవసరం అయితే ఖాళీలు లేని చోట్ల సూపర్‌న్యూమరీ పోస్టులు ఏర్పాటు చేసి సర్దుబాటు చేయాలని సూచించారు. జీవో లోపభయిష్టంగా ఉందని, ఉద్యోగులు ఎంత చెప్పినా గత ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించి ఉద్యోగుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పని చేసిందన్నారు. స్థానికతకు అవకాశం లేకుండా జీవోను బలవంతంగా ఉద్యోగుల నెత్తిమీద రుద్దారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగులకు ఐచ్ఛికాలు ఇచ్చి బలవంతంగా స్థానికేతర ప్రాంతాలకు బదిలీలు చేశారని సీఎస్‌కు వివరించారు. భార్యాభర్తలు, వికలాంగులు, వితంతువులు, వైద్యపరమైన సమస్యలు ఉన్నవారి ఇబ్బందులు పట్టించుకోలేదని, ఎలాంటి అవకాశం ఇవ్వకుండా బదిలీలు చేశారని తెలిపారు.

నేడు మంత్రిమండలి సమావేశం

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి శనివారం సచివాలయంలో సమావేశం కానుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన సాయంత్రం 4గంటలకు జరగనున్న ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ప్రధానంగా రైతుభరోసా పథకం అమలు, అందుకు సంబంధించిన అంశాలతోపాటు రైతుబీమాపైనా చర్చించనున్నారు. కాగా, ధాన్యం కొనుగోలు పాలసీ రూపకల్పన కోసం ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ ఇప్పటికే ఒక నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందించింది. ఈ నివేదికలో పొందుపరిచిన అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏల విషయంలోనూ సర్కారు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. క్యాబినెట్ భేటీలో ఈ అంశాన్ని చర్చించి ప్రకటన చేసే అవకాశాలున్నాయి. ఇక కొత్త జిల్లాలకు ప్రభుత్వ ఉద్యోగుల కేటాయింపు, స్థానికత వివాదానికి సంబంధించిన 317జీవోపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ.. ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీనిపైనా మంత్రిమండలి నిర్ణయం తీసుకోనుంది.

కొత్త ఆర్‌వోఆర్ అమలుకు ఆర్డినెన్స్‌పై చర్చ!

ధరణి, నూతన ఆర్‌వోఆర్ చట్టంపైనా మంత్రివర్గం సమావేశంలో చర్చించనున్నట్టు తెలిసింది. నూతన ఆర్‌వోఆర్ ముసాయిదాకు సంబంధించి ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయింది. దీనిని అమలు చేసేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలా? అనేదానిపై క్యాబినెట్‌లో చర్చించనున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా.. 2016లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన 'ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్'ను మళ్లీ తీసుకొచ్చేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నం చేస్తోంది. ఆ చట్టానికి మరిన్ని అధికారాలు కల్పించే అంశంపైనా చర్చించే అవకాశం ఉంది. దీంతోపాటు గ్రామస్థాయి రెవెన్యూ యంత్రాంగాన్ని తీసుకునే అంశం, ఉద్యోగుల విధివిధానాలు కూడా చర్చకు రావచ్చని తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు కోసం నిర్వహించదలచిన 'కులగణన' అంశం కూడా ప్రస్తావనకు రానుంది. క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడా పాలసీపైనా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కోసం గ్రామాలవారీగా ఇందిరమ్మ కమిటీలను నియమించాలని ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కమిటీలు ఎన్ని ఏర్పాటయ్యాయి, పథకం అమలు, ఈ పథకాన్ని ప్రధానమంత్రి ఆవాస యోజనకు అనుసంధానం చేసే అంశంతోపాటు, రాజీవ్ స్వగృహ, గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. మరోవైపు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును అత్యుత్తమ విధానాల్లో ప్రారంభించేందుకు తీసుకునే చర్యలపైనా చర్చించనున్నారు. 'హైడ్రా' అంశం కూడా చర్చకు రానుంది. మామునూరు, ఇతర ఎయిర్‌పోర్టుల నిర్మాణాలకు ఉన్న సాధ్యాసాధ్యాలపైనా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

పటేల్ తరహాలో గాంధీ విగ్రహం!

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించుకోవచ్చు కానీ, తాము మూసీ పునరుజ్జీవం చేస్తామంటే మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. తాము గుజరాత్‌కు పోటీ ఇవ్వబోతున్నందునే తెలంగాణను, హైదరాబాద్‌ను అభివృద్ధి చేయనివ్వకుండా అడ్డుతగులుతున్నారని ఆరోపించారు. అయినా.. గాంధీ వారసులుగా తాము బాపూఘాట్‌ను అభివృద్ధి చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. ఇక దక్షిణాది రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని రేవంత్ ఆరోపించారు. ఈ రాష్ట్రాలకు ప్రధాని మోదీ అందించిన సహకారం చాలా తక్కువ అని అన్నారు. ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే.. దక్షిణాది రాష్ట్రాల నుంచే పన్నులు ఎక్కువగా చెల్లిస్తున్నామని, అయినా వాటిలో తిరిగి పొందేది మాత్రం చాలా తక్కువగా ఉంటోందన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి పంపించే ప్రతి రూపాయిలో కేవలం 40 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరప్రదేశ్ నుంచి మాత్రం కేంద్రానికి రూపాయి వెళ్తే.. రూ.7 వస్తున్నాయని, బిహార్‌కు రూ.6వెనక్కి వస్తున్నాయని అన్నారు.

దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్ష

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను దక్షిణాది రాష్ట్రాలు ఆహ్వానిస్తున్నా.. నిధుల విషయంలో మాత్రం వివక్షే ఎదురవుతోందని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఉత్తర భారతదేశానికి చెందిన వ్యక్తి కావడమే ఈ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడానికి కారణమన్నారు. గతంలో ఉత్తరాది నుంచి ఎవరైనా ప్రధాని అయితే.. దక్షిణాదికి చెందిన వ్యక్తిని రాష్ట్రపతిని చేసే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పాటించిందని తెలిపారు. మోదీ వచ్చాక ఈ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారని ఆరోపించారు. మూడు సార్లు అధికారం చేపట్టి.. దేశ ప్రజల కోసం ఏ సంస్కరణలు తీసుకువచ్చారని ప్రశ్నించారు. పార్టీలను విడగొట్టి, ప్రభుత్వాలను పడగొట్టేందుకు పనిచేయడం తప్ప.. ప్రధానిగా ప్రజలకు మోదీ పార్టీ చేసిందేమీలేదని ఆరోపించారు. భావోద్వేగ రాజకీయాలతో ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.



తెలంగాణలోని 4 కోట్ల మంది ప్రజలు ఎన్నుకుంటేనే మేము అధికారంలోకి వచ్చాం. ప్రభుత్వాన్ని పనిచేయనివ్వండి.. మీకు నచ్చకపోతే ఇంట్లో కూర్చోండి. మా ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవాలని చూస్తే.. ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతోనైనా కేసీఆర్ ప్రజల ఆలోచనను అర్థం చేసుకోవాలి. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే సర్కారును పడగొట్టాలని చూశారు. కానీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే నాకు మద్దతుగా నిలిచారు.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కేసీఆర్ బయటకు ఎందుకు రావడంలేదు?

పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపించిన గత సీఎం కేసీఆర్.. పదిసార్లు కూడా సెక్రటేరియట్‌కు రాలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే పది నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. "కేసీఆర్ తనకు తానే స్వాతంత్ర్య సమరయోధుడినని చెప్పుకొంటారు. ఫాంహౌస్‌లో పడుకొంటారు. పదేళ్లలో ఒక్కసారి కూడా సచివాలయానికి రాలేదు. గత పది నెలల్లో ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే ఎందుకు రావట్లేదు? తానొక జమీందార్‌గా, ప్రజలందరూ గులాములుగా కేసీఆర్ భావిస్తుంటారు. అందుకే బయటకు రావడంలేదు" అని రేవంత్ అన్నారు. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగు రోడ్డు, రేడార్ స్టేషన్, ఇరిగేషన్ ప్రాజెక్టులతో తెలంగాణ పురోగతిని సాధించి గుజరాత్‌కు పోటీ ఇస్తుందనే విషయం తెలిసే తమ ప్రయత్నాలను ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రయత్నం చేస్తున్నాయని రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ వ్యతిరేకించిన మరుసటి రోజే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రభుత్వ నిర్ణయాలను తప్పుబడతారని అన్నారు. అయినా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తే తప్పేంటని ప్రశ్నించారు.

నవంబరు నెలాఖరులోగా క్రీడా పాలసీ

దేశంలోనే అత్యుత్తమంగా ఉండేలా రాష్ట్ర క్రీడా పాలసీని రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తుది ముసాయిదాను నవంబరు నెలాఖరులోగా సిద్ధం చేయాలన్నారు. ఇందుకోసం క్రీడాకారులు, నిపుణులతో సంప్రదించడంతో పాటు విస్తృతంగా అధ్యయనం చేయాలన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ బిల్లును సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని సూచించారు. క్రీడా పాలసీపై శుక్రవారం తన నివాసంలో అధికారులతో సీఎం సమీక్షించారు. మరో పది రోజుల్లోనే క్రీడా పాలసీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు సంబంధించిన పలు అంశాలను అధికారులు వివరించగా.. సీఎం పలు మార్పుచేర్పులను సూచించారు. దక్షిణకొరియా క్రీడా వర్సిటీ ప్రతినిధులతో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఆస్ట్రేలియాలోని క్వీన్స్ ల్యాండ్ వర్సిటీ విధానాలపై అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను తయారుచేయాలని, రెండేళ్లలో నేషనల్‌గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యమిచ్చేలా ఒలింపిక్ అసోసియేషన్‌ను సంప్రదించాలని అన్నారు.

సమర్థులకే పదవులు!


» పనిచేసేవారికే అవకాశమివ్వండి

» టీపీసీసీ చీఫ్ మహేశ్‌తో కేసీ వేణుగోపాల్



న్యూఢిల్లీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కోసం కష్టపడి పనిచేసే సమర్థులకే పార్టీ పదవులు కట్టబెట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని అన్నారు. శుక్రవారం ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌ను మహేశ్‌కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, నూతన కమిటీల నియామకం, రాజకీయ పరిస్థితులపై 40 నిమిషాలకు పైగా చర్చించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి 50 రోజులైన సందర్భంగా.. తాను నిర్వహించిన కార్యక్రమాలు, రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహేశ్‌కుమార్‌గౌడ్ వివరించారు. ప్రతిపక్షాలు అడ్డగోలుగా చేస్తున్న ఆరోపణల్ని తిప్పికొడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామని, సోషల్ మీడియాను మరింత ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు పార్టీ కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా యువతకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని, తద్వారా గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల నియామకంలో.. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలోనూ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయాల నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామని కేసీ వేణుగోపాల్‌కు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతంలో 2వేల గజాల విస్తీర్ణం కలిగిన స్థలంలో కార్యాలయాలు నిర్మించాలని టీపీసీసీ నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం స్థలాలు కేటాయించాలని కోరుతూ కలెక్టర్లకు అధికారికంగా దరఖాస్తులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల పదవుల భర్తీపైనా చర్చించారు.

జీవన్‌రెడ్డి సమస్యకు త్వరగా పరిష్కారం చూపండి



రాహుల్, ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహేష్‌గౌడ్‌లకు జగ్గారెడ్డి వినతి

» జీవన్‌రెడ్డి.. ఒంటరని అనుకోవద్దు.. సమయం వచ్చినప్పుడు వెంట నేనుంటా

» ఈ వయసులో ఆయనకు రాజకీయ ఇబ్బందులు బాధాకరమంటూ వ్యాఖ్య

హైదరాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఈ వయసులో పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి రాజకీయ ఇబ్బందులు రావడం బాధాకరమని, అధిష్ఠానం దీన్ని గుర్తించి త్వరితగతిన ఆయన సమస్యకు పరిష్కారం చూపాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి కోరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు శుక్రవారం ఓ ప్రకటనలో ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. గురువారం మీడియాలో జీవన్‌రెడ్డి ఆవేదన చూసిన తర్వాత తనకు చాలా బాధ అనిపించిందన్నారు. ఏం జరుగుతుంది.. ఏమాట్లాడాలి? అన్నది అర్థం కావట్లేదని, అందుకే ఏమీ మాట్లాడలేక పోతున్నానని పేర్కొన్నారు. ఈ వయసులో ఆయన ఆవేదన చూసి తన మనస్సు కలుక్కుమందన్నారు. తాను ఎవరినీ తప్పు పట్టట్లేదని పేర్కొన్నారు. అయితే తాను ఒంటరిని అని జీవన్‌రెడ్డి అనుకోవద్దని, సమయం వచ్చినప్పుడు ఆయన వెంట తాను ఉంటానని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్ వాది అని, ఆయన జీవితమంతా కష్టాలేనన్నారు. ఎప్పుడూ జనంలో ఉండే జీవన్‌రెడ్డిని జగిత్యాల ప్రజలు ఎందుకు ఓడించారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. అలాగే సంగారెడ్డిని ఎంతో అభివృద్ధి చేసిన తనను ఎందుకు ఓడగొట్టారో కూడా అర్థం కాలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో పార్టీనీ, ప్రజలను తాను తప్పు పట్టట్లేదన్నారు. తమ టైం బాగాలేదని చెప్పి సర్దుకుపోతున్నామని తెలిపారు. జీవన్‌రెడ్డికి, తనకు మధ్య వయసు తేడా ఉందని, ఈ వయసులో ఆయనకు రాజకీయ ఇబ్బందులు రావడం బాధాకరమని అన్నారు. అధిష్ఠానం దీన్ని గుర్తించి త్వరితగతిన ఆయన సమస్యకు పరిష్కారం చూపాలని జగ్గారెడ్డి కోరారు.

భయపడాల్సింది లేదు

అన్ని అనుమతులు పొందిన నిర్మాణాల కూల్చివేత ఉండదు

» నిర్మాణదారులు గతంలో పొందిన పర్మిషన్లు రద్దు చెయ్యం

» నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నరెడ్కో ప్రాపర్టీ షోలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తదితరులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : హైడ్రా కూల్చివేతలపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ప్రభుత్వ విభాగాల నుంచి అన్ని అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టిన వారు కూల్చివేతల అంశంలో భయపడాల్సిన అవసరమే లేదని భరోసా ఇచ్చారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి రియల్టర్లు గతంలో పొందిన అనుమతులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయిగా నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో రియల్టర్లు, బిల్డర్లు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు నరెడ్కో(నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) తెలంగాణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించి ఆయా సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. ప్లాట్లు, ఇళ్లు, విల్లాల క్రయవిక్రయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్‌తోపాటు నిర్మాణ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ అనుమతులతో నిర్మించిన కట్టడాలకు కూల్చివేతల భయం లేదని, ఈ అంశంలో ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన వివిధ అనుమతుల జారీ ప్రక్రియను సులభతరం చేస్తామని ప్రకటించారు. నరెడ్కో, క్రెడాయ్, ఇతర రియల్ ఎస్టేట్, నిర్మాణ సంఘాలు కలిసి ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రియల్ ఎస్టేట్ రంగంతో పాటు నిర్మాణదారులు ఏ విషయంలోనైనా ప్రభుత్వంతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు ఈ కమిటీ ఉపయోగపడుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పారిశ్రామికవేత్తలు వస్తున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనని, రీజనల్ రింగ్ రోడ్‌తో పాటు అనుసంధాన రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. మెట్రో విస్తరణ పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. మూసీ అభివృద్ధితో నగర రూపురేఖలు మారతాయని, ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో రియల్టర్లు, బిల్డర్లు భాగస్వామ్యం కావాలని మంత్రి ఉత్తమ్ కోరారు. కాగా, నరెడ్కో జాతీయ అధ్యక్షులు హరిబాబు మాట్లాడుతూ జీడీపీలో నిర్మాణ రంగం వాటా అధికమని తెలిపారు. అందుబాటు ధరల్లో లభించే ప్లాట్లకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించాలని, నిర్మాణ రంగంపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడు మేక విజయసాయి మేక మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గిస్తే స్థిరాస్తుల క్రయవిక్రయాలు పెరుగుతాయని సూచించారు. నరెడ్కో ప్రతినిధులు కిరణ్, కాళిదాస్, ఆర్ వెంకటేశ్వరరావు, చలపతిరావు, సునిల్ చంద్రారెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనతో దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ

బీసీ, ఎస్సీ, ఎస్టీల కలను నెరవేరుస్తున్నాం

» ఏఐసీసీ ప్రధాన కార్యదర్శితో భట్టి

» కేసీ వేణుగోపాల్‌కు కుల గణన సర్వే ఫార్మాట్ అందజేత



ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భట్టి

న్యూఢిల్లీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కుల గణన చేపట్టి దేశానికే రోల్ మోడల్‌గా నిలవబోతున్నామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల కలను నెరవేర్చబోతున్నామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెడుతున్నామని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని కేసీ వేణుగోపాల్ నివాసానికి వెళ్లిన భట్టి ఆయనతో సమావేశమయ్యారు. కుల గణన సర్వే ఫార్మాట్ అందజేశారు. గంటకు పైగా జరిగిన చర్చల్లో రాష్ట్రంలో కుల గణన, ప్రణాళిక, విధివిధానాలు తదితర అంశాలపై చర్చించారు. జార్ఖండ్ ఎన్నికలకు కాంగ్రెస్ ఇంచార్జిగా భట్టి విక్రమార్కను అధిష్ఠానం నియమించిన నేపథ్యంలో కేసీ వేణుగోపాల్, భట్టి మధ్య జార్ఖండ్ ఎన్నికలపైనా చర్చ జరిగింది. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌గౌడ్ బాధ్యతల తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు, పీసీసీ, డీసీసీ కమిటీలు, హైడ్రాపై చర్చ జరిగినట్టు సన్నిహిత వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ అంశంపైనా ఇరువురు చర్చించినట్టు సమాచారం. అనంతరం ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్‌తోనూ భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. ఆయనతోనూ రాష్ట్రంలో కుల గణన, జార్ఖండ్ ఎన్నికల అంశాలపైనే చర్చించినట్టు తెలిసింది.

కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నాగరాజుతో భట్టి భేటీ

తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నాగరాజు మద్దిరాలను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కోరారు. గత ప్రభుత్వం చేసిన బడ్జెటేతర రుణాలు రాష్ట్ర ఖజానాపై తీవ్ర రుణ భారాన్ని మోపుతున్నాయని, వాటిని రీ షెడ్యూల్ చేస్తే రాష్ట్రానికి ఉపశమనంగా ఉంటుందని తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నాగరాజు మద్దిరాలను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పాత అప్పులు, వడ్డీల భారం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై చర్చించినట్టు తెలిసింది.

రాష్ట్రంలో 80% భూ భాగం పట్టణ పరిధిలోకే

» 27 యూడీఏల ఏర్పాటు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసమే

» 90 శాతం గ్రామ పంచాయతీలు యూడీఏల పరిధిలోకి

» ఒక్క వికారాబాద్ యూడీఏ పరిధిలోనే 4 మునిసిపాలిటీలు, 493 గ్రామాలు

హైదరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 80 శాతం భూభాగం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)ల పరిధిలోకి తీసుకొచ్చారు. ఇది వరకే ఉన్న తొమ్మిది అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలతోపాటు తాజాగా 18 కొత్త యూడీఏలను ఏర్పాటు చేయడంతోనే ఇది సాధ్యమైందని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు. పొరుగున ఉన్న ఏపీలో 93శాతం యూడీఏల పరిధిలోకి చేర్చగా.. మన దగ్గర అదే రీతిలో 90% పైగా గ్రామ పంచాయతీలను యూడీఏల పరిధిలోకి తీసుకొచ్చారు. ములుగు, ఆసిఫాబాద్, ఖమ్మం, భద్రాది కొత్తగూడెం వంటి ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలు తప్ప మిగిలిన ప్రాంతాన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి తీసుకొచ్చామని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) ఎస్. దేవేందర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఒక్క వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పరిధిలో కొడంగల్, వికారాబాద్, తాండూర్, పరిగి నాలుగు మునిసిపాలిటీలు, 493 గ్రామాలను చేర్చారు. దీంతో ఆ జిల్లాలో 90 శాతంపైగా యూడీఏ పరిధిలోకి వచ్చినట్లయింది.

రాష్ట్రంలో ఏర్పాటు చేసిన యూడీఏలు ఇవే

ఆదిలాబాద్, 2.జగిత్యాల, 3.జనగాం, 4.నిర్మల్, 5.వనపర్తి, 6.కొత్తగూడెం, 7.మహబూబాబాద్, 8. నాగర్‌కర్నూల్, 9. యాదాద్రి భువనగిరి, 10. మంచిర్యాల, 11. వికారాబాద్, 12. మెదక్, 13.కుమరంభీం ఆసిఫాబాద్, 14. వేములవాడ (విస్తరించారు), 15.నల్లగొండ (విస్తరించారు), 16.ఖమ్మం (విస్తరించారు), 17.కరీంనగర్ (విస్తరించారు) 18. మహబూబ్‌నగర్ (విస్తరించారు), 19. సిద్దిపేట (విస్తరించారు), 20. నిజామాబాద్ (విస్తరించారు), 21. సూర్యాపేట, 22. పెద్దపల్లి, 23. జయశంకర్ భూపాలపల్లి, 24. జోగులాంబ గద్వాల్, 25. నారాయణపేట్, 26. సంగారెడ్డి, 27. కామారెడ్డి.

90%గ్రామ పంచాయతీలు యూడీఏల పరిధిలోకి

రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో సుమారు 90 శాతం పంచాయతీలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి తీసుకొచ్చారు. మొత్తం పంచాయతీల్లో సుమారు 11,492 యూడీఏల పరిధిలో చేర్చారు. దీంతో 80 శాతం పైగా భూ భాగం రాష్ట్రంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోకి వచ్చినట్లయిందని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలే ఎక్కువ

యూడీఏలను పెద్దఎత్తున ఏర్పాటు చేయడం వల్ల ప్రణాళికాబద్ధమైన పట్టణ ప్రగతికి అవకాశం ఉంటుంది. 540 వరకు ఇప్పుడున్న మండల కేంద్రాలను ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి చేసుకునేందుకు యూడీఏలు దోహదపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర నిధుల ద్వారా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేసే అవకాశం ఉంది. పెట్టుబడులను మళ్లించడం ద్వారా అన్ని యూడీఏల పరిధిలో ప్రణాళికాబద్ధమైన ప్రగతికి అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలను యూడీఏ పరిధిలోకి తీసుకురావడం వల్ల ఆయా ప్రాంతాల్లో పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాతో పెద్ద ఎత్తున గృహనిర్మాణాలను చేపట్టే వీలుంది. పట్టణ పరిధిలో గృహనిర్మాణాలకు ఒక్కో ఇంటికి కేంద్రం ఇస్తున్న రూ.1.5 లక్షల నిధులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఎక్కువ కుటుంబాలకు లభిస్తుంది. దీంతోపాటు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వివిధ పథకాల ద్వారా అందించే నిధులతో గ్రామాల స్వరూపం మారిపోయే అవకాశం ఉంటుంది. ల్యాండ్ పూలింగ్ ద్వారా పురపాలక శాఖ లేఅవుట్లు వేసి పేదలకు సరసమైన ధరలతో ఇళ్ల స్థలాలు కేటాయించే అవకాశం కూడా ఉంది. ఆస్తి పన్నులు, లేఅవుట్ చార్జీలు, బిల్డింగ్ చార్జీలు పెరుగుతాయనేది అపోహ మాత్రమే.

- ఎస్. దేవేందర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్





Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.